# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 82 | హైదరాబాద్ | శుక్రవారం 12-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00




సింగిల్ బుల్లెట్ తో ట్రంప్ సన్నిహితుడి కాల్చివేత... స్నైపర్ కోసం ముమ్మర వేట

11లో

## నేటి భారతం

- "ఈ ప్రపంచంలో న్యాయం, శాంతి కోసం చేయవలసిన అపారమైన పనిని మనం ఆలోచిస్తున్నప్పుడు.. గొప్ప విషయాలను సాధించడానికి.. విశ్వసించడానికి, ఆశించడానికి.. మనకు ఎదురయ్యే, లభ్యమయ్యే పరిస్థితులను గౌరవించాలి..
- మనం ఇక్కడ సమావేశమైనప్పుడు, చిన్న విషయాలలో కూడా న్యాయం కోసం చూస్తాము..
- మన పనిలో, మన సమావేశాలలో దేవుని సన్నిధిలో.. నమ్మకాన్ని ఉంచుతాం.. న్యాయం జరుగుతుందని విశ్వసిస్తాం..
- కానీ దైవం సాక్షిగా ఆ న్యాయమే అన్యాయంగా మారినప్పుడు.. కాలం మీద వదిలేయడం తప్ప ఇంకేమి చెయ్యగలం..?

– బోయినపల్లి రమణ రావు
సీనియర్ జర్నలిస్ట్..



## హైదరాబాద్ శివారులో
# కుండపోత వర్షం

- ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లు కుండపోత వర్షం
- రోడ్ల మీద నీరు నిలవడంతో వాహనదారుల ఇబ్బందులు
- మెదక్ జిల్లాలోనూ భారీ వర్షా లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. కొద్ది నిమిషాల్లోనే రహదారులన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్, అబ్దుల్లా పూర్‌మెట్

తరువాయి 11లో

# అది పెయిడ్ క్యాంపెయిన్
## నన్నే టార్గెట్ చేశారు
## గడ్కరీ సంచలన వ్యాఖ్యలు

- ఈ20 పెట్రోల్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్నది పెయిడ్ క్యాంపెయిన్ అన్న గడ్కరీ
- రాజకీయంగా తనను లక్ష్యంగా చేసుకునే ఈ దాడి అని వ్యాఖ్య
- ఇథనాల్ విధానంతో రైతులకు రూ. 45,000 కోట్ల మేలు జరిగిందని వెల్లడి

11లో



## భారత్-నేపాల్
# సరిహద్దులో హై అలర్ట్..
### 30 మంది ఖైదీల అరెస్ట్



11లో

- నేపాల్‌లో అల్లర్ల నడుమ జైళ్ల నుంచి తప్పించుకున్న ఖైదీలు
- భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించగా భగ్నం చేసిన ఎస్ఎస్‌బీ
- యూపీ, బీహార్, బెంగాల్ రాష్ట్రాల సరిహద్దుల్లో 30 మంది అరెస్ట్



# న్యాయస్థానాల్లో అవినీతి ?



- కదులుతున్న ప్రజాస్వామ్య పునాదులు.. ?
- న్యాయవాదులు అన్యాయం వాదిస్తున్నారు..
- రాజకీయాలు న్యాయస్థానాలను ప్రభావితం చేస్తున్నారు..
- ఎంతో ఉన్నతమైన న్యాయ వ్యవస్థ నిర్వీర్యమైపోతోందా..?
- అవినీతి న్యాయమూర్తుల కథలు ఆందోళన కలిగిస్తున్నాయి..
- సామాన్యుడు అట్టుడిగిపోతున్నాడు.. అన్యాయమై పోతున్నాడు..
- న్యాయస్థానాలున్యాయనే ధైర్యం నానాటికీ అడుగంటిపోతోంది..
- కనిపించని భగవంతుడి కంటే.. కనిపించే కోర్టులను నమ్ముతాం..
- కోర్టులు కరప్ట్ అయితే ఇంకెవరికి చెప్పుకోవాలి..
- అమ్ముడుపోతున్న న్యాయ వ్యవస్థ.. తప్పని అవస్థ..

12లో




## కవితకు చింతమడక వాసుల
# ఆహ్వానం..

- బతుకమ్మ వేడుకల్లో తమతో కలిసి పాల్గొనాలని కోరిన గ్రామస్తులు
- ఈ నెల 21న జరిగే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి
- పెద్ద ఎత్తున తరలి వచ్చిన గ్రామస్తులు




11లో



## మాజీ మంత్రి కేటీఆర్‌కు అరుదైన గౌరవం

'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక

11లో

## హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్..
# మీ ఫోన్‌లోనే జీహెచ్ఎంసీ సేవలు

- పౌరసేవల కోసం జీహెచ్ఎంసీ సరికొత్త వాట్సప్ చాట్‌బాట్
- వాట్సప్‌లోనే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ చెల్లింపులు
- ఫిర్యాదులు చేస్తే నేరుగా సంబంధిత అధికారికి సమాచారం
- జనన, మరణ ధ్రువపత్రాల వివరాలు సులభంగా తెలుసుకునే వీలు
- కృత్రిమ మేధ (ఏఐ)తో 24 గంటలూ అందుబాటులో సేవలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** హైదరాబాద్ నగరవాసులకు జీహెచ్ఎంసీ సేవలు ఇకపై మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. పౌరులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వాట్సప్ ద్వారానే ఫిర్యాదులు చేయడం, పన్నులు చెల్లించడం వంటి పనులను చక్క బెట్టుకునేలా సరికొత్త వ్యవస్థను జీహెచ్ఎంసీ సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కృత్రిమ మేధ (ఏఐ)

తరువాయి 11లో



# హోరెత్తిన జనం

## సంపాదకీయం

# భారత్ ను టార్గెట్ చేసి బాగుపడిన చరిత్రా

అతిగా ఆశపడే ఆడది.. అతిగా ఆవేశపడే మగాడు సుఖపడినట్లు చరిత్రలోనే లేదు.. ఇది ఓ సినిమా డైలాగ్. అయితే ఈ డైలాగ్ ఇప్పుడు భారత్‌తో కయ్యానికి కాలుదువ్విన దేశాలకు వర్తిస్తుంది. భారత్‌ను దెబ్బతీయాలని, డ్యామేజ్ చేయాలని చూసిన ఏదేశమూ బాగుపడలేదు. భారత్‌ను విమర్శించిన దేశాలు ఒక్కొక్కటిగా రాజకీయ, ఆర్థిక సంక్షోభాల్లో కూరుకుపోతున్నాయనే చర్చ ఇటీవల ఊపందుకుంది. మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, మయన్మార్, కెనడా, నేపాల్ వంటి దేశాలు వివిధ సమస్యలతో సతమతమవుతున్నాయి. ట్రంప్ వ్యవహారశైలి కారణంగా అమెరికా కూడా భారత్‌తో ఘర్షణ పడుతోందని, రాబోయే రోజుల్లో అది సంక్షోభంలోకి జారుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దక్షిణాసియా దేశాలైన మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్, మయన్మార్‌లు ఇటీవలి కాలంలో రాజకీయ, ఆర్థిక అస్థిరతలతో సతమతమవుతున్నాయి. ఈ దేశాలు భారత్‌తో సంబంధాలలో ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి, కొన్ని సందర్భాల్లో భారత్‌పై విమ-ర్శలు గుప్పించాయి. ఈ సంక్షోభాల వెనుక ఆయా దేశాల అంతర్గత రాజకీయాలు, ఆర్థిక సమస్యలు, విదేశీ శక్తుల ప్రభావం కీలక పాత్ర పోషిస్తున్నాయి. 2023లో అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జూ 'ఇండియా ఔట్' నినాదంతో ఎన్నికల్లో గెలిచారు. భారత సైనిక ఉనికిని తొలగించాలని డిమాండ్ చేసిన ఆయన, చైనాతో సంబంధాలను బలోపేతం చేశారు. అయితే, 2024లో ఆర్థిక సంక్షోభం, పర్యాటక రంగంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలో ఒడిదొడుకులు మాల్దీవులను కుదిపాయి. దీంతో ముయిజ్జూ భారత్‌తో సంబంధాలను మెరుగుపరచడానికి ప్రయత్నించారు, కానీ దేశంలో రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం, విద్యార్థుల నిరసనలు బంగ్లాదేశ్‌ను రాజకీయ అనిశ్చితిలోకి నెట్టాయి. హసీనా భారత్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉండగా, ఆమె పతనం తర్వాత బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ), ఇతర ఇస్లామిస్ట్ సమూహాలు చైనా, పాకిస్తాన్‌లతో సంబంధాలను బలపరిచే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ మార్పు భారత్‌కు భద్రతా సవాళ్లను, మైనారిటీ హిందువులపై దాడుల ఆందోళనను తెచ్చిపెట్టింది. 2022లో ఆర్థిక సంక్షోభం శ్రీలంకను అతలాకుతలం చేసింది. గోటబాయ రాజపక్సే ప్రభుత్వం పతనం, అనుర కుమార దిస్సానాయకే నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. శ్రీలంక చైనాకు రుణబాధ్యతలు ఎక్కువగా ఉండగా, భారత్ 4 బిలియన్ డాలర్ల సహాయంతో ఆదుకుంది. దిస్సానాయకే భారత్‌తో సహకారాన్ని కొనసాగిస్తూ, చైనాతో సమతుల్యతను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. దీర్ఘకాలంగా భారత్‌తో శత్రుత్వం కలిగిన పాకిస్తాన్ ఆర్థిక, రాజకీయ సంక్షోభాలతో సతమతమవుతోంది. 2022లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం పతనం, ఆర్థిక అస్థిరత, ఉగ్రవాద బెడద పాకిస్తాన్‌ను బలహీనపరిచాయి. భారత్‌పై విమర్శలు, కాశ్మీర్ విషయంలో ఘర్షణాత్మక వైఖరి కొనసాగుతున్నప్పటికీ, షాంఘై సహకార సంస్థ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాల్గొనడం, కర్తార్‌పూర్ కారిడార్ ఒప్పందం పునరుద్ధరణ వంటివి సంబంధాలలో కొంత మెరుగుదలకు సూచనలు. 2021లో సైనిక తిరుగుబాటు తర్వాత మయన్మార్ అంతర్యుద్ధంలో చిక్కుకుంది. దేశంలో 14% భూభాగం మాత్రమే జుంటా నియంత్రణలో ఉంది. ఈ అస్థిరత భారత్ ఈశాన్య సరిహద్దులలో ఉగ్రవాదం, మాదక ద్రవ్యాల రవాణా సమస్యలను తెచ్చిపెట్టింది. భారత్ మయన్మార్‌లోని తిరుగుబాటు గ్రూపులతో సంప్రదింపులు జరుపుతూ, దౌత్యపరమైన సమతుల్యతను కాపాడుతోంది. 2025లో సోషల్ మీడియా నిషేధం నేపథ్యంలో జెన్%-%జెడ్ నిరసనలు నేపాల్‌లో ప్రధాని కేపీ. శర్మ ఓలి రాజీనామాకు దారితీశాయి. ఓలి చైనాతో సంబంధాలను బలోపేతం చేస్తూ, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ఒప్పందాలపై సంతకం చేశారు, ఇది భారత్‌తో సంబంధాలలో ఒత్తిడిని తెచ్చింది. భారత్ ఈ పరిణామాలను దౌత్యపరంగా ఎదుర్కొంటూ, నేపాల్‌తో ఆర్థిక, సాంస్కృతిక సహకారాన్ని కొనసాగిస్తోంది. అమెరికా, భారత్‌తో సంబంధాలలో ఇటీవల కొన్ని ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ పాకిస్తాన్‌లోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడి చేయడం అమెరికా రహస్య సైనిక కార్యకలాపాలను బహిర్గతం చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. దీని ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25% అదనపు సుంకాలను విధించారని, ఆర్థిక ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని చర్చ జరుగుతోంది. అయితే, అమెరికా రాబోయే రోజుల్లో సంక్షోభంలోకి జారుకుంటుందనే వాదనకు స్పష్టమైన ఆధారాలు లేవు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, భారత్‌తో వాణిజ్య ఉద్రిక్తతలు, దక్షిణాసియాలో చైనా ప్రభావం పెరుగుదల వంటి అంశాలు దాని విదేశాంగ విధానంపై ఒత్తిడిని తెచ్చే అవకాశం ఉంది. భారత్ తన పొరుగు దేశాలతో 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానాన్ని కొనసాగిస్తోంది. బంగ్లాదేశ్‌కు 8 బిలియన్ డాలర్లు, శ్రీలంకకు 4 బిలియన్ డాలర్ల సహాయం, నేపాల్, మాల్దీవులతో ఆర్థిక, సాంస్కృతిక సహకారం ద్వారా భారత్ తన ప్రభావాన్ని కాపాడుకుంటోంది. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా ఈ దేశాల్లో పెట్టుబడులను పెంచుతుండగా, భారత్ బిమ్‌స్టెక్, బీబీఐఎన్ వంటి సబ్%-%రీజినల్ సహకార వేదికల ద్వారా చైనా ప్రభావాన్ని సమతుల్యం చేస్తోంది. అమెరికాతో సంబంధాలను దృష్టిలో ఉంచుకుని, భారత్ క్వాడ్ (అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా) వంటి భాగస్వామ్యాల ద్వారా దక్షిణాసియాలో స్థిరత్వాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తోంది.

- కూటమి నేతల్లో ఆనందోత్సహాలు
- ఆయువుపట్టుపై టీడీపీ గురి




అనంతపురం, సెప్టెంబర్ 11

రాయలసీమపైనే కూటమి ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తుంది. సీమలో తమ పట్టును నిలుపుకోవాలన్న ప్రయత్నం కనపడుతుంది. మొన్నటి ఎన్నికల్లో రాయలసీమలో కూటమి సక్సెస్ అయ్యింది. వచ్చే ఎన్నికల వరకు దానిని నిలుపుకోవాలని చూస్తోంది కూటమి. అందుకే ప్రతి కార్యక్రమం ఇకనుంచి రాయలసీమ నుంచి ప్రారంభించాలని నిర్ణయించింది. టిడిపి తో పాటు జనసేన, బిజెపి సైతం రాయలసీమ పైనే ఫోకస్ పెట్టాలని స్ట్రాంగ్ గా డిసైడ్ అయ్యాయి. తద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అస్థిరపరిచి.. ఓటు బ్యాంకు ను మూడు పార్టీలు పొంది.. కూటమి ద్వారా లబ్ధి పొందాలన్నది ప్లాన్ గా తెలుస్తోంది. అందుకే ఈరోజు 'సూపర్ సిక్స్- సూపర్ హిట్' సభను అనంతపురంలో ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. రాయలసీమలో 52 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అటువంటి చోట మొన్నటి ఎన్నికల్లో 45 స్థానాలను సాధించింది కూటమి. టిడిపికి 41, బిజెపికి నాలుగు, జనసేనకు ఒక స్థానం వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం ఏడు స్థానాలకు మాత్రమే పరిమితం అయింది. వచ్చే ఎన్నికల్లో కూడా ఆ 45 సీట్లను గెలుచుకోవడమే లక్ష్యంగా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంజుకోనివ్వకుండా గట్టి వ్యూహంతో ముందుకు వెళ్తోంది కూటమి. వరుస కార్యక్రమాలతో పక్కా స్కెచ్ వేసుకుంటూ ముందుకు సాగుతోందితెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కడపలో మహానాడు నిర్వహించింది. టిడిపి ఆవిర్భావం తర్వాత కడపలో మహానాడు ఎప్పుడు ఏర్పాటు చేయలేదు. అటువంటిది కూటమి గెలుపుతో ఊపు మీద ఉన్న టిడిపి మొన్న వేసవిలో మహానాడు నిర్వహించి సత్తా చాటింది. తరువాత పట్టుబట్టి మరి జగన్ సొంత అసెంబ్లీ నియోజకవర్గంలోని పులివెందుల, తరువాత ఒంటిమిట్ట జడ్పిటిసి సీట్లలో గెలిచి చూపించింది. ఇక పవన్ సైతం వరుసగా రాయలసీమలోనే టూర్లు ప్లాన్ చేస్తున్నారు. చివరికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన మాధవ్ సైతం ప్రతి కార్యక్రమం రాయలసీమ నుండే మొదలు పెడుతున్నారు. వైసిపి ఓటు బ్యాంకు పై గురి పెట్టారని స్పష్టమవుతోంది. సీఎం చంద్రబాబు బహు వ్యూహంతో ముందుకు సాగుతున్నారు రాయలసీమ విషయంలో. ఒకవైపు పార్టీ పరంగా కార్యక్రమాలు చేపడుతూనే.. ప్రభుత్వపరంగా సీమలో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు చేపట్టాలని చూస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం రాయలసీమకు 30 శాతం కేటాయించారు. హంద్రీ నీవా ద్వారా కుప్పంకు నీళ్లు తెప్పించారు. కడపలో ఉక్కు ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. రాయలసీమలో ఎక్స్ప్రెస్ హైవేల నిర్మాణ పనులను వేగవంతం చేశారు. అమరావతి రాజధాని తో పాటు పోలవరం ను పూర్తిచేసే పనిలో పడ్డారు. అన్నింటికీ మించి రాయలసీమలో అభివృద్ధి జాడలు చూపించాలని చూస్తున్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృత నిశ్చయంతో ఉన్నారురాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వైసీపీకి గతంలో పట్టు ఉండేది. 2019 ఎన్నికల్లో కేవలం ఈ నాలుగు జిల్లాల్లో టీడీపీ మూడు స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది.. అయితే 2024 లో జరిగిన ఎన్నికల్లో రాయలసీమలో సీన్ రివర్స్ అయింది. రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో వైసీపీకి ఐదు

# అసెంబ్లీకి రండి తేల్చుకుందాం...

విజయవాడ, సెప్టెంబర్ 11



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు కౌంటర్ ఇచ్చారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాల అంటే తెలియని నాయకులు కూడా వాటి గురించి మాట్లాడుతున్నాడని జగన్ పై అన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి రావాలని చంద్రబాబు నాయుడు సవాల్ విసిరారు. బయట కూర్చుని రప్పా రప్పా అంటూ సరిపోదంటూ ఆయన హెచ్చరించారు. అసెంబ్లీలో మెడికల్ కళాశాలల అంశంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. భూమి ఇవ్వగానే అది మెడికల్ కాలేజీ అయిపోదని, 17 మెడికల్ కాలేజీలు ఉంటే.. ఒక్కటే పూ-ర్తయ్యిందని చంద్రబాబు అన్నారు. గత పాలకులు మెడికల్ కాలేజీలకు పునాదులేసి వదిలేశారన్న ఆయన అందుకే తమ హయాంలో పీపీపీ విధానం తీసుకొచ్చామని తెలిపారు. మెడికల్ కాలేజీలపై అసెంబ్లీలో చర్చకు రావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఘనత తమదేనని చంద్రబాబు చెప్పారు. వైసీపీ ఉనికి కోల్పోతోందన్న చంద్రబాబు వైసీపీ ఆఫీసులు మూసేసి సోషల్ మీడియా ప్రచారం చేస్తోందని తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది ప్రజలు..తామ కాదని అన్నారు.వైసీపీ నేతలకు అసెంబ్లీకి వచ్చి చర్చించే దమ్ముందా అని సవాల్ విసిరారు. అసెంబ్లీకిరాకుండా రప్పారప్పా అంటూ రంకెలేస్తున్నారన్నారు. ఇక్కడ ఉన్నది సీబీఎన్, పవన్ కల్యాణ్ అని బెదిరింపులకు భయపడబోమని చంద్రబాబు అన్నారు. ఒంటిమిట్ట, పులివెందులలో ప్రజలు మీ బెండు తీశారన్న చంద్రబాబు నాయుడు హింసా రాజకీయాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. సూపర్ సిక్స్- సూపర్ హిట్ విజయోత్సవ సభకు అశేషంగా వచ్చిన తరలి వచ్చిన మూడు పార్టీల శ్రేణులకు, ప్రజలకు, మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యేందుకు అండగా నిలిచిన అన్నదాతకు, స్త్రీశక్తులకు, యువకిశోరాలకు వందనం అన్న చంద్రబాబు ఈ సభ రాజకీయాల కోసం, ఎన్నికల కోసం ఓట్ల కోసం కాదు. 15 నెలల పాలనలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని చెప్పడానికే ఈ సభ అని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను- సూపర్ హిట్ చేశారని చెప్పడానికే ఈ విజయోత్సవ సభ నిర్వహించామని చెప్పారు

జనంలోనే తేల్చుకుంటామంటున్న జగన్

వైసీపీ అధినేత జగన్ ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న ఆంధ్రప్రదేవ్ శాసనసభ సమావేశాలకు హాజరు అయ్యే అవకాశం కనిపించడం లేదు. ఆయన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయి. అవసరమైతే తనపై అనర్హత వేటు వేసి పులివెందులకు ఉపఎన్నిక వచ్చినా పరవాలేదన్న ధోరణి ఆయనలో కనిపించింది. తాను మాత్రం ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే శాసనసభకు వచ్చినా ప్రయోజనం ఉండదని, ప్రజా సమ-స్యలపై ప్రస్తావించడానికి అవసరమైన తగిన సమయం తనకు దొరకదని కూడా ఆయన అన్నారు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే ప్రజల సమస్యలపై శాసనసభలో ప్రస్తావించడానికి తగిన సమయం దొరుకుతుందని వైఎస్ జగన్ తెలిపారు. ప్రతిపక్ష హోదా ఇస్తే శాసనసభ పక్ష నేతకు సమానంగా సమయాన్ని ప్రతిపక్ష నేతకు స్పీకర్ సమయం ఇవ్వాల్సి వస్తుందని జగన్ అభిప్రాయపడ్డారు. అందుకే తనకు ప్రతిపక్ష హోదా అడుగుతున్నప్పటికీ ఇవ్వకపోవడానికి అదే కారణమి అన్నారు. వైసీపీని ప్రతిపక్షంగా కూడా గుర్తించడం లేదన్నారు. ఒక్కొక్క ఎమ్మెల్యేకు ఐదు నిమిషాల సమయం మాత్రమే ఇస్తామని చెబుతున్నారని అన్నారు.. దీంతో వైఎస్ జగన్ రానున్న శాసనసభ సమావేశాలకు హాజరు అయ్యేందుకు సుమ-ఖంగా లేరని అర్థమవుతుంది. ఆరోజుల్లో అసెంబ్లీకి చంద్రబాబు రాకపోయినా ఏం చేయలేరన్నారు. ఏం చేయదలచుకున్నా ఈ మూడేళ్లు మాత్రమే చేయగలగరని, తర్వాత మాత్రం ఏమి చేస్తారని ప్రశ్నించారు. తాను కూడా నేరుగా ప్రజాందోళనలో పాల్గొంటానని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించకుండా ఆందోళనలకు దిగుతామని తెలిపారు. రాష్ట్ర శ్రేయస్సుకోరే అన్ని రాజకీయ పార్టీలు కలసి రావాలని జగన్ పిలుపు నివ్వడంతో ఇక జగన్ నేరుగా రంగంలోకి దిగుతానని, ఉప ఎన్నికలకు తాను భయపడే ప్రసక్తి లేదని చెప్పకనే చెప్పారు.


# డయారియా బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరం కలెక్టర్ లక్ష్మీ షా

విజయవాడ సెప్టెంబర్ 11

విజయవాడ రాజరాజేశ్వరిపేట డయేరియా కేసులకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరాలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం 41 మందికి చికిత్స అందిస్తున్నాం. అందరి పరిస్థితి నిలకడగా ఉంది. చికిత్స తీసుకొని ఆరోగ్యం మెరుగుపడటంతో ఇప్పటి వరకు 22 మంది డిశ్చార్జ్ అయ్యారు. ప్రత్యేక వైద్యాధికారులతో ఆర్ఆర్ పేటలో వైద్య శిబిరం 24%శ%7 పాటు సేవలు అందిస్తుంది. ముందు జాగ్రత్తగా కుళాయి నీటి సరఫరా ఆపేసి 15 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నాం. డయేరియా కేసులపై కలెక్టర్ కార్యాలయంలో 91549 70454తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసాం. పరిస్థితి చక్కదిద్దేందుకు, సమన్వయానికి రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసామని అన్నారు.

=====================================

# నారాయణపూర్ జిల్లాలో భారీగా లొంగిపోయిన మావోయిస్టులు



బీజాపూర్ సెప్టెంబర్ 11

ఛత్తీస్ గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు భారీగా లొంగిపోయారు. వివిధ కేడర్లకు చెందిన 16 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఒక్కోరికి 50వేల ప్రోత్సాహక చెక్కులు పోలీసు అధికారులు అందచేసారు.

# 916 కోట్లతో దగదర్తి విమానశ్రయానికి గ్రీన్ సిగ్నల్

నెల్లూరు సెప్టెంబర్ 11,

కూటమి ప్రభుత్వం ఏపీలో విమానాశ్రయాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. పలు నగరాలకు ఎయిర్ పోర్ట్ కనెక్టివిటీతో తమ ప్రాంతం నుంచే విమాన ప్రయాణికులు రాకపోకలు పెరిగేలా చూస్తోంది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా దగదర్తిలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం మొదటి దశ పనులను రూ.916 కోట్ల వ్యయంతో చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ప్రాజెక్టును %ఔఔ% (పబ్లిక్- ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) మోడల్‌లో చేపట్టనున్నారు. రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) దీనిని నిర్వహించనుంది. ప్రస్తుతం నిర్మాణ సంస్థ ఎంపిక కోసం ఏపీఏడీసీఎల్ అంతర్జాతీయ టెండర్‌ను ఆహ్వానించింది. అక్టోబర్ 10న ప్రీ-బిడ్ కాన్ఫరెన్స్ నిర్వహించనుండగా.. బిడ్లు దాఖలుకు నవంబర్ 3 వరకు అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో విమాన సేవలను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విమానాశ్రయం నిర్మాణం చేపడుతోంది. పారిశ్రామిక, పర్యాటక కార్యకలాపాలు పెరుగుతున్నందున దగదర్తి విమానాశ్రయం నుంచి ప్రయాణికుల రాకపోకలతో పాటు సరుకు రవాణా విస్తృతంగా పెరుగుతాయని ఏపీఏడీసీఎల్ అంచనా వేసింది. నెల్లూరులోని దగదర్తి విమానాశ్రయం అందుబాటులోకి వస్తే కడప, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు ప్రయోజనం కలుగుతుందని ఏపీఏడీసీఎల్ భావిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి విమానాశ్రయ నిర్మాణ సంస్థతో ప్రభుత్వం 45 ఏళ్ల పాటు అమలులో ఉండే రాయితీ ఒప్పందాన్ని కుదుర్చుకోనుంది. ప్రతి 15 సంవత్సరాలను ఓ దశ కింద తీసుకుని.. దశల వారీగా ప్రణాళిక రూపొందించారు. మొదటి దశలో డిమాండ్ తక్కువగా ఉండగా, రెండో దశలో డిమాండ్ పెరిగి, మూడో దశలో గరిష్ట స్థాయికి చేరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. భవిష్యత్‌లో ప్రయాణికుల సంఖ్యతో పాటు కార్గో సేవలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు

ప్రారంభ దశలో ఎయిర్‌బస్ A-320/A-321 తరహా మీడియం సైజు విమానాలు నడిపాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి దగదర్తి విమానాశ్రయంలో ఒకే ఒక రన్‌వే నిర్మించనున్నారు. దగదర్తిలో విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి అనుమతుల విషయంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది.

2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించడంతో పాటు 1,300 ఎకరాల భూమిని సేకరించింది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి ప్రాథమిక అనుమతులు తీసుకుంది.

అలాగే రక్షణ, హోంశాఖల అనుమతుల కోసం దరఖాస్తు చేసింది. 2017లోనే పర్యావరణ, అటవీ అనుమతులు లభించాయి. టర్బో కన్సార్షియం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు నిర్మాణ బాధ్యత అప్పగించగా, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ సంస్థ ఒప్పందం నుంచి తప్పుకుంది. తరువాత ఆ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కన పెట్టి, తెట్టు (ప్రకాశం జిల్లా) వద్ద కొత్త విమానాశ్రయ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసింది. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దగదర్తి విమానాశ్రయ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

# తిరుపతి నుంచి షిర్డీకి మరిన్ని సర్వీసులు

తిరుపతి సెప్టెంబర్ 11

తిరుపతి మీదుగా షిర్డీ వెళ్లాలనుకునే ప్రయాణికులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఎప్పటి నుంచో భక్తుల నుంచి ఉన్న అభ్యర్థనకు గ్రీన్ సిగ్నల్ పడింది. రోజూ తిరుపతి షిర్డీ మధ్య ట్రైన్ నడపాలనే రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు కేంద్ర రైల్వే శాఖ ఓకే చెప్పంది. దీంతో త్వరలోనే ఈ ఈ రెండు స్టేషన్‌ల మధ్య ప్రతి రోజూ ట్రైన్ నడవబోతోంది. తిరుపతి షిర్డీ మధ్య ప్రస్తుతం 07637/07638 నెంబర్ ఉన్న ట్రైన్ నడుస్తోంది. ఇది కేవలం ఆదివారం మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీన్ని ప్రతి రోజూ నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే ఈ ట్రైన్ ప్రతి రోజూ భక్తులకు అందుబాటులో ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఈ ట్రైన్ అన్ని రోజుల పాటు నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. చంద్రబాబు లేఖపై స్పందించిన రైల్వే శాఖ తిరుపతి షిర్డీ మధ్య ప్రతిరోజూ ట్రైన్ నడిపేందుకు అంగీకరిస్తూ ప్రతి లేఖ రాసింది. తిరుపతి నుంచి షిర్డీ మధ్య సుమారు 1074 కిలోమీటర్ల రైల్వే దూరం ఉంటుంది. అయితే వివిధ ప్రాంతాలను కలుపుతూ నడుస్తున్న రైళ్లు దాదాపు 1369 నుంచి 1439 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ రెండు ప్రధాన పుణ్యక్షేత్రాల మధ్య మూడు రైళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి వారానికి ఒకటి లేదా రెండు రోజులు నడుస్తాయి. వాటిలో ప్రధానమైంది 1. %ఖ్శ్ ాచీూ×% స్పెషల్ ఫేర్ సమ్మర్ స్పెషల్ (07637) ఇది తిరుపతి (%ఖ్శ్%)లో ప్రారంభమై సాయినగర్ షిర్డీ వరకు నడుస్తుంది. ఇందులో ప్రయాణ సమయం సుమారు 29 గంటల 15 నిమిషాలు. ఇప్పుడు కేవలం ఆదివారం మాత్రమే అందుబాటులో ఉంది. ఇది త్వరలోనే అన్ని రోజుల్లో అందుబాటులోకి రానుంది. తిరుపతి లో ఉదయం 05:30 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10:45 గంటలకు షిర్డీ చేరుకుంటుంది. ఈ ట్రైన్‌లో స్లీపర్ క్లాస్‌లో ప్రయాణం చేయాలంటే సుమారు ?780, 3%ూ% కోచ్ కోసం ?2000, 2%ూ% కోచ్ కోసం ?3000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ట్రైన్ మొత్తం 31 స్టాప్‌లలో ఆగుతుంది. రేణిగుంట, కడప, గుంతకల్, సికింద్రాబాద్, నిజామాబాద్, ఔరంగాబాద్ మొదలైనవి స్టేషన్లు ఉన్నాయి. 17417 నెంబర్ గల వీక్లీ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. ఇది తిరుపతి- షిర్డీ మధ్య కేవలం మంగళవారం మాత్రమే అందుబాటులో ఉంటుంది. తిరుపతిలో ఉదయం 8:15 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10:45 గంటలకు షిర్డీకి చేరుకుంటుంది. ఈ ట్రైన్ కూడా రేణిగుంట, కడప, గుంతకల్, సికింద్రాబాద్, ఔరంగాబాద్, మన్మాడ్ మొదలైనవి 32 స్టేషన్‌లలో ఆగుతుంది. 16733నెంబర్‌తో ఉన్న %=వీవీ ాఖనూ% ఎక్స్‌ప్రెస్ కూడా అందుబాటులో ఉంది. ఇది రామేశ్వరం నుంచి ఓఖా వరకు నడుస్తుంది, కానీ తిరుపతి నుంచి నాగర్‌సోల్ వరకు సేవలను అందిస్తుంది. ఇది షిర్డీకి సమీపంలో ఉంది. ఈ ట్రైన శనివారం మాత్రమే నడుస్తోంది.

# వర్మ మౌనం వెనుక వ్యూహం

కాకినాడ, సెప్టెంబర్ 11,
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఏ అధికారిక కార్యక్రమాల్లోనూ ఒక్క వర్మ తప్ప తెలుగు దేశం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఎందుకు కనిపించడం లేదు. దీనికి బదులు దొరకని ప్రశ్నగా పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి కనిపిస్తోంది. మన అనే భావన ఉంటే ఎంతదూరమైనా వెళ్తాం.. తీరా అక్కడకు వెళ్లాక ఎవ్వరూ పట్టించుకోకపోతే.. కనీసం పలుకరింపునకు కూడా నోచుకోకపోతే.. అక్కడ ఇమడలేని పరిస్థితి ఎదురవుతుంది.. ఆరోజు ఏదోలా సమయం గడిపి రేపన్నాక వెళ్లేందుకు కూడా ఇష్ట పడం.. సరిగ్గా ఇలానే ఉందట పిఠాపురం నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్ల పరిస్థితి. పిలవని పేరంటానికి మనదే కదా అని వెళితే కనీస గుర్తింపు లేని చోట ఇమడలేక.. అటు బయట చెప్పుకోలేక సతమతమవుతున్నారట పిఠాపురంలోని తెలుగు తమ్ముళ్లు. నియోజకవర్గ నాయకునితో చెప్పుకుందామంటే కొన్ని సందర్భాల్లో ఆయనకే ఏమీ తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నారని, ఇక ఆయన మాకే న్యాయం చేస్తాడని లోలోన మధన పడిపోతున్నారట.. పై అధిష్టానికి చెప్పుకుందామంటూ ఇదంతా కావాలనే వర్మ చేస్తున్నారా అన్న ప్రచారంతో ముందుకు అడుగు పడక తెగ ఫీల్ అయి-పోతున్నారట. కేడర్ పరిస్థితి ఇలా ఉంటే ఇక టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వర్మ పరిస్థితి మరో విధంగా ఉంది. ప్రాధాన్యత లేకుండా పోయిన తెలుగు తమ్ముళ్లను సంతృప్తి పరచలేక.. మరోపక్క అధిష్టానాన్ని ప్రశ్నించలేక సంకట పరిస్థితిని ఎదుర్కొంటున్నారట. మొత్తంమీద పిఠాపురం కూటమిలో మాత్రం నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితి ఎప్పుడు లావా మాదిరి ఉప్పొంగుతుందా అనేలా పరిస్థితి ఉందని అర్థం అవుతుంది..పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో తెలుగుదేశం పార్టీకి సంకట పరిస్థితి ఎదుర్కొంటుందా అన్న ప్రశ్నకు టీడీపీ కార్యకర్తలు ఔననే సమాధానం చెబుతున్నారు. ఇక్కడ జరుగుతున్ నవ అధికారిక కార్యక్రమాలకు తెలుగు తమ్ముళ్లకు ఏ కబురు ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురంలో ఆది నుంచి టిడిపి వర్సెస్ జనసేనగానే పరిస్థితి ఉంది. తొలినాళ్లలో వర్మకు సీటు విషయంలో అలజడి రేగిన తర్వాత చంద్రబాబు హామీతో ఆయన వెనక్కి తగ్గి పవన్‌కు మద్దతు నిలిచారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలలో పవన్ వెంటే నడుస్తోన్న వర్మ పలు సందర్భాల్లో చేదు అనుభవాల్ని ఎదుర్కొన్న పరిస్థితి కనిపించింది. అయితే తన అసహనాన్ని ఏ మాత్రం బయటపడకుండా జాగ్రత్త పడ్డ వర్మ తన వెంట ఉండే పార్టీ నాయకులకు దక్కని గౌరవంపై మాత్రం చాలా అసంతృప్తిలో ఉన్నారన్నది ఆయన అనుచరుల మాట. ఇదిలా ఉంటే నియోజకవర్గంలో మాత్రం ముందునుంచీ ఉన్నట్లే టిడిపి-జనసేన మధ్య ఎడమోహం పెడమోహంగానే ఉంది పరిస్థితి. మూడు పార్టీలు కలిసి చేసిన కార్యక్రమాల్లో కనీసం పట్టుమని పది మంది టీడీపీ నాయకులు లేని విధంగా పరిస్థితి మారింది. పదవుల పంపకాల్లో అధిష్టానమే అన్ని లెక్కలు చూస్తోందని సర్దుకు పోతున్నా.. ఆఖరికి ఎవరికి ఏ పదవి వచ్చినా సర్దుకుపోతున్నారట. ఎందుకంటే పాలన పెత్తనంలో తమకు ఎటువంటి అవకాశం ఇవ్వడం లేదన్న నిస్తేజంలో అసలు మాకు పదవుందా.. అని ప్రశ్నిస్తూ టిడిపి నేతలు బాహాటంగా విమర్శిస్తున్నారు. దీనిపై వర్మ ఎన్నిసార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో తెలుగు తమ్ముళ్లకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.పిఠాపురం పేరు చెబితే ప్రస్తుతం పవన్ మాటే వినిపిస్తోంది. దీంతో టిడిపిని నమ్ముకున్న వారికి కేవలం టిడిపి ప్రచార కార్యక్రమాలు తప్పితే పథకాలు, వాటి అమలకు సంబంధించి అధికారికంగా కబుర్లు రావడం లేదని టిడిపి నేతలే చెబుతున్నారు. తమ అధినాయకుడు నిత్యం టెలికాన్ఫరెన్స్ లలో కబుర్లు తప్పితే తమకు ఎటువంటి అవకాశాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పురుషోత్తపట్నం వాటర్ పంపింగ్ ప్రారంభానికి పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జి వర్మకు ఎటువంటి కబురు రాలేదు. పిఠాపురం జైగణేష్ ఆలయ ఉత్సవాలకు సంబంధించి ఛైర్మన్ అభ్యర్థిగా ఉన్న టిడిపి సీనియర్ నేత కొరుప్రోలు శ్రీనుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జనసేన నేతలే సమీక్ష నిర్వహించేశారు. దీనిపై కొరుప్రోలు శ్రీను సోషల్ మీడియాలో బాహాటంగానే ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అవమానంపై ఓ వీడియోను విడుదల చేశారు. పాదగయలో జరిగిన సామూహిక వరలక్ష్మి వ్రతాలకు సంబంధించి ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు, జనసేన నాయకులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కానీ టిడిపి నేతలకు పిలుపు రాకపోవడంతో దీనిపైనా వారు గుర్రుగా ఉన్నారు.
ఇలా చెప్పుకుంటూ పోతే జనసేన అధికారికంగా జరిపే కార్యక్రమాలకు టిడిపికి ఎటువంటి సమాచారం ఉండకపోవడంతో టిడిపిని పూర్తిగా విస్మరించారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న వర్మ మౌనం వెనుక కారణం ఏంటి అన్న చర్చ స్థానికంగా కొనసాగుతోంది.. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చినా కంగారు పడకండి అన్న సమాధానమే వినిపిస్తోందట.. అయితే అధిష్టానం కూడా వర్మ మాటను పట్టించుకోవడం మానేసిందా.. సమస్య నేరుగా డిప్యూటీ సీఎం పవన్‌ది కావడంతో టిడిపి అధిష్టానం లైట్ తీసుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది అర్థమైన వర్మ జనసేనతో సర్దుకుపోయేందుకు ట్రై చేస్తున్నారన్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం ప్రభుత్వ కార్యక్రమాలకు వర్మను పిలిచే విషయంలో కాస్త ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం.

> **ఇలా చెప్పుకుంటూ పోతే జనసేన అధికారికంగా జరిపే కార్యక్రమాలకు టిడిపికి ఎటువంటి సమాచారం ఉండకపోవడంతో టిడిపిని పూర్తిగా విస్మరించారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.పిఠాపురం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న వర్మ మౌనం వెనుక కారణం ఏంటి అన్న చర్చ స్థానికంగా కొనసాగుతోంది.. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చినా కంగారు పడకండి అన్న సమాధానమే వినిపిస్తోందట.**

## ఫిట్స్ రావడంతో ఇంట్లోకి దూసుకెళ్ళిన ఆటో

చిత్తూరు సెప్టెంబర్ 11,
చౌడేపల్లి మండలంలోని శెట్టిపేట గ్రామ పంచాయతీ యర్రపల్లి నుండి రాయలపేట వద్ద గల గౌదమాకులపల్లి కి వెళ్తుండగా దుర్గసముద్రం వద్ద ఆటో యాక్సిడెంట్ అయ్యింది.డ్రైవర్ విశ్వనాథకు ఫిట్స్ రావడంతో ఆటో అదుపుతప్పి నివాస గృహంలోకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో 5 మందికి రక్త గాయాలు అయ్యాయి.అందులో విశ్వనాథ్ (35), హారతి(24),తేజశ్రీ(26), మంజుల(34)మంజుల(40)లకు గాయాలు అయ్యాయి. అందులో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండటంతో వారు స్వయంగా పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.మహిళలు అందరూ ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ప్రమాదస్థలానికి చేరుకొని సహాయక చర్యలు అందించి,క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్చారు.ఈ ప్రమాదం పై కేసునమోదు చేసుకొన్నట్లు ఎస్సై నాగేశ్వరావు తెలిపారు.

## గద్వాల: విషాదం.. పిడుగుపాటుతో ముగ్గురు మృతి...ఇద్దరికీ గాయాలు

విజయవాడ, సెప్టెంబర్ 11
బుధవారం సాయంత్రం అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ మండలం మేడికొండ, భూమ్ పురం మధ్య పత్తి పొలంలో పనిచేస్తున్న కూలీలు వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లారు. దురదృష్టవశాత్తు, చెట్టుపై పిడుగు పడటంతో ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే అయిజలోని ఆసుపత్రికి తరలించగా, ముగ్గురు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు మృతులు పార్వతమ్మ (22), సర్వేష్ (20), సౌభాగ్య(40)గా గుర్తించారు . మిగిలిన ఇద్దరిని గద్వాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## పత్తి పంటలో గంజాయి సాగు: 580 మొక్కలు స్వాధీనం

ఆదిలాబాద్ సెప్టెంబర్ 11,
గుడిహత్నూర్ మండలంలో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి, టాకిగూడ గ్రామ శివారులోని ముష్కే దేవరావు అనే రైతుకు చెందిన పత్తిపంటలో అంతర పంటగా సాగు చేస్తున్న సుమారు 580 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. 5 ఎకరాల పత్తి పంటలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించి, సుమారు 50 లక్షల విలువైన మొక్కలను పట్టుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## యూరియా సరఫరా నిమిత్తం రైతులు అనవసర ఆందోళన చెందవద్దు

**– జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు,**

విజయవాడ సెప్టెంబర్ 11
కృష్ణా జిల్లాలో యూరియా సరఫరా నిరంతరాయంగా, ఎటువంటి అంతరాయం లేకుండా జరుగుతోంది. ఇప్పటివరకు 3,180 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగింది. గురువారం 1,381 మెట్రిక్ టన్నులు జిల్లాకు వస్తున్నది. ఇంకా 1,200 మెట్రిక్ టన్నులు జిల్లాకు అలాట్మెంట్ చేయబడింది. అలాగే, వచ్చే పది రోజుల్లో మరో 8,000 మెట్రిక్ టన్నుల వరకు యూరియా సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.
యూరియా సరఫరా గురించి రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదు. వారి అవసరాలకు తగినట్టు టోకెన్ విధానం ద్వారా సరఫరా కొనసాగుతోంది. అర్హత ప్రకారం ప్రతి రైతుకూ సరైన పరిమాణంలో యూరియా అందించేందుకు చర్యలు తీసుకోబడుతున్నాయని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు, తెలియజేశారు.
అనధికారంగా యూరియాను నిలువ చేసినా , అక్రమ రవాణా కి పాల్పడినా, సామాజిక మాధ్యమాలు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో అవాస్తవ ప్రచారం చేసినా, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు.


## హెచ్ ఐ వి / ఎయిడ్స్ పై అవగాహనే ఆయుధం

**ఎయిడ్స్ అంటు వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి**
**ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్.**




గోదావరిఖని సెప్టెంబర్ 11
గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో హెచ్. ఐ. వి / ఎయిడ్స్ వ్యాప్తిని నిరోధించడంలో భాగంగా కళాశాల ఎన్. ఎస్. ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు ఐ. సి. టీ. సి. సంయుక్తంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.
ఈ అవగాహన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా అధ్యక్షత వహించగా, ఐ. సి. టీ. సి. కౌన్సిలర్ శంకర్ రిసోర్స్ పర్సన్ గా విచ్చేసి హెచ్ ఐ వి / ఎయిడ్స్ మహమ్మారి బారిన పడకుండా నివారణోపాయాలు తెలియజేసి అవగాహన కల్పించారు. వీరు మాట్లాడుతూ – ముఖ్యంగా యువత మంచి జీవన శైలిని అలవరుచుకొని ఆరోగ్యవంతమైన జీవన విధానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు.
డిస్పోసబుల్ సిరంజిలు వాడడం ద్వారా, అపరిచితుల నుండి రక్తాన్ని స్వీకరించకపోవడం వలన అనగా రక్త మార్పిడి సమయంలో జాగ్రత్త వహించడం వలన, అనారక్షిత సంభోగ క్రియకు దూరంగా ఉండడం వలన, ఎయిడ్స్ సోకిన గర్భిణీ స్త్రీ కి జన్మించిన శిశువులకు హెచ్. ఐ. వి సోకకుండ ఎన్ వి పి ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా హెచ్. ఐ. వి / ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా నివారించవచ్చన్నారు. విద్యార్థులు దీని బారిన పడకుండా తమని తాము రక్షించుకోవచ్చని చెప్పారు. ఎయిడ్స్ అనేది అంటూ వ్యాధి కాదని అంటించుకునే వ్యాధని తెలుసుకొని బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని ప్రభుత్వం వారు నిర్వహించే ఐ. సి. టీ. సి. లకు సమాచారం అందించి హెచ్. ఐ. వి ఎయిడ్స్ పీడితులను కౌన్సెలింగ్ లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం వారు అందించే తగిన సూచనలు పొంది ఉచితంగా అందించే మందులు క్రమం తప్పకుండా వాడుకోవాలన్నారు. యువత నిశ్శబ్దాన్ని ఛేదించి హెచ్. ఐ. వి ఎయిడ్స్ నివారణ గురించి చర్చించాలి అన్నారు.
. ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా మాట్లాడుతూ – విద్యార్థులు ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు హెచ్. ఐ. వి / ఎయిడ్స్ భూతాన్ని తరిమి కొట్టాలన్నారు. ఈ మహమ్మారికి మందు లేదని నివారణ ఒక్కటే మార్గమని అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సానుకూల దృక్పథం పెంపొందించుకోవాలన్నారు.
. రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ మరియు ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా డి కిరణ్మయి సభకు ఆహ్వానం పలికి సదస్సును నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి నిరోధం పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సహించిన ప్రిన్సిపల్ ప్రొ జై కిషన్ ఓఝా కి, ఐ. సి. టీ. సి కౌన్సిలర్ శ్రీ శంకర్ కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎయిడ్స్ నివారణ పై అవగాహన కల్పించే కొన్ని నినాదాలను విద్యార్థులతో పలికించారు.

## 250 రూపాయిలతో వైజాగ్ టూర్




**విశాఖపట్టణం, సెప్టెంబర్ 11**
శాఖను సందర్శించాలనుకునేవారికి అదిరిపోయే వార్త. వైజాగ్‌లో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు ఇటీవల రెండు డబుల్ డెక్కర్ బస్సులను ప్రారంభించారు. ఈ బస్సులలో పెద్దలు రూ.250, పిల్లలు రూ.100 చెల్లిస్తే 24 గంటలు చెల్లేలా టికెట్ ఇస్తారు. దీని సాయంతో నగరంలోని పర్యాటక ప్రాంతాలను అద్దాల బస్సులో చూస్తూ చుట్టేసే వీలుంది.సాగర తీరం విశాఖపట్నం సందర్శనకు నిత్యం ఎంతోమంది పర్యాటకులు తరలి వస్తుంటారు. చారిత్రక ప్రదేశాల నుంచి ప్రకృతి సౌందర్యాల వరకూ విశాఖ కేరాఫ్ అడ్రస్. సింహాచలం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు కూడా ఉండటంతో.. భక్తులు కూడా విశాఖకు క్యూ కడుతుంటారు. ఇక సమీపంలోనే అరకు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు విచ్చేస్తుంటారు. వర్షాకాలంలో అరకు లోయ కొత్త అందాలు సంతరించుకుంటూ ఉంటుంది. దీంతో పర్యాటకుల తాకిడి మరింత అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విశాఖ వచ్చే సందర్శకులకు ప్రత్యేక థ్రిల్ పంచేందుకు, అలాగే విశాఖలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే విశాఖలో తాజాగా డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం.సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విశాఖలో పర్యాటక శాఖ రెండు డబుల్ డెక్కర్ బస్సులను పర్యాటకులు, స్థానికుల కోసం అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ డబుల్ డెక్కర్ బస్సులను ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు నడుపుతున్నారు. అద్దాల బస్సులో కూర్చుని సాగర తీరం అందాలను వీక్షించేలా ఈ డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేశారు. మొత్తం 16 కిలోమీటర్ల మేరకు ఈ బస్సులు నడుస్తున్నాయి. ఈ డబుల్ డెక్కర్ బస్సులలో పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.100 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. అయితే ఇందులో ప్రత్యేకమైన సౌకర్యం ఏమిటంటే.. ఎక్కడైనా దిగి, ఎక్కడైనా ఎక్కొచ్చు. అలాగే 24 గంటల పాటు ఈ టికెట్ చెల్లుతుంది. టికెట్ కౌంటర్లను కూడా రెండుచోట్ల ఏర్పాటు చేశారు. రుషికొండ బీచ్‌తో పాటుగా, ఆర్కే బీచ్ వద్ద టికెట్ కౌంటర్లు అందుబాటులోకి తెచ్చారు.మరోవైపు ప్రతి గంటకూ ఓ బస్సు ఉండేలా ఈ డబుల్ డెక్కర్ బస్సులను నడుపుతున్నారు. ఆర్కే బీచ్ వద్ద మొదలుపెడితే.. టీయూ142, సబ్‌మెరైన్ మీదుగా సీ హారియర్ అండ్ హెలికాప్టర్ మ్యూజియం, వైజాగ్ మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పార్కుతో పాటుగా, కైలాసగిరి రోప్‌వే, తెన్నేటి పార్కు, వైజాగ్ జూ పార్కు, ఇస్కాన్ టెంపుల్, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, రుషికొండ బీచ్ జంక్షన్, తొట్లకొండ వరకు ఈ డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 వరకూ ఈ డబుల్ డెక్కర్ బస్సులు నడుస్తాయిమరోవైపు ముందుగా చెప్పుకున్న విధంగా ఈ డబుల్ డెక్కర్ బస్సుల నుంచి ఏ స్టాప్ వద్ద అయినా దిగొచ్చు. ఆ ప్రాంతాన్ని సందర్శించిన తర్వాత వెనకాలే వచ్చే మరో బస్సులో ఎక్కేందుకు వీలుంది. ఈ సమాచారాన్ని పర్యాటకులకు గైడ్‌లు అందిస్తారు. ఉదాహరణకు మీరు కైలాసగిరి రోప్ వే చూద్దామని అక్కడ దిగిపోయారనుకోండి. కైలాసగిరి రోప్‌వే చూసిన తర్వాత.. ఆ వెనకాలే వచ్చే డబుల్ డెక్కర్ బస్సు ఎక్కే అవకాశం ఉంది. గైడ్‌లకు ఫోన్ చేస్తే ఆ బస్సు ఏ సమయానికి అక్కడకు చేరుకుంటుందనే వివరాలు తెలియజేస్తారు. ఆ రకంగా మీ ట్రిప్ ప్లాన్ చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.

## ఎంపీనే బురిడి కొట్టించారు

**కాకినాడ, సెప్టెంబర్ 11**
ఏపీలో సైబర్ నేరాలకుఅడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అనునిత్యం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం నమోదు అవుతూ వస్తోంది. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరూ సైబర్ నేరాల బాధితులే. పోలీసులు అనేక రూపాల్లో అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో చలనం లేదు. సైబర్ నేరాల బారిన పడుతూనే ఉన్నారు. మొన్నటికీ మొన్న ఏపీ మంత్రి అల్లుడు ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా కాకినాడ జనసేన ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఏకంగా రూ.92.5 లక్షలు కొల్లగొట్టారు. వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ మార్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.పూర్వాశ్రమంలో తంగేళ్ల ఉదయ శ్రీనివాస్( టీ టైమ్ వ్యవస్థాపకుడు. మొన్నటి ఎన్నికల్లో కాకినాడ నుంచి జనసేన తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే తాజాగా ఈ టైం సిఎఫ్ఓ శ్రీనివాసరావు గంగిశెట్టి కి ఓ సైబర్ మోసగాడు వాట్సాప్ లో కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ప్రొఫైల్ పిక్చర్ పెట్టుకుని మెసేజ్ చేశాడు. మొదట ఆగస్టు 22న శ్రీనివాసరావుకు మెసేజ్ పంపాడు. అది తన కొత్త నెంబర్ అని పరిచయం చేసుకున్నాడు. అయితే అది తన బాస్ ఉదయ శ్రీనివాస్ నెంబర్ అని శ్రీనివాస్ నమ్మాడు. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాడు ఎంపీ ఉదయ శ్రీనివాస్ పేరు చెప్పి అత్యవసరంగా డబ్బులు కావాలన్నాడు. కొన్ని వారాలపాటు శ్రీనివాసరావు తో వందర్లా బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు పంపమని చెప్పాడు. శ్రీనివాసరావు కూడా తన యజమాని డబ్బులు పంపమని భావించి.. 11 సార్లు ఏకంగా రూ.92.5 లక్షలు అదేవిధంగా ట్రాన్స్ఫర్ చేశారు. అయితే సెప్టెంబర్ 8న ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసులు సిఎఫ్ఓ శ్రీనివాసరావు కలుసుకోవడంతో అసలు విషయం బయటపడింది. అటువంటి రిక్వెస్ట్ తానేది ఫోన్లో చేయలేదని ఎంపీ చెప్పడంతో సైబర్ మోసానికి గురయ్యానని శ్రీనివాసరావు ఒక నిర్ణయానికి వచ్చారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాదు లోని సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ పేరుతో ఈ మోసం జరగడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అయితే ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇప్పటివరకు ఏడు లక్షల రూపాయలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మిగిలిన డబ్బును వెనక్కి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ డబ్బులు ఎవరి బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయో తెలుసుకునేందుకు బ్యాంక్ రికార్డులు, కాల్ డేటా రికార్డులు, ఐపీ అడ్రస్లను పరిశీలిస్తున్నారు.

## రాజీ పడితే ఇద్దరు గెలిచినట్టే..

**13న జాతీయ లోక్ అదాలత్**
**కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి.**
**లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుంది**
**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

గోదావరిఖనిసెప్టెంబర్ 11, రాజీమార్గం రాజమార్గమని, కక్షలు, కార్పణ్యాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ మేరకు ఈరోజు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీన జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండ బుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. రాజీ మార్గం రాజ మార్గ మని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు పోలీస్ సిబ్బంది రాజీపడ్డ దగిన కేసులను లను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## నార్నూర్ కేజీబీవీ విద్యాలయంలో పురుగుల అన్నం.. విద్యార్థుల ఆందోళన

ఆదిలాబాద్ సెప్టెంబర్ 11,
నార్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించిన అన్నంలో పురుగులు రావడంతో వారు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. పాఠశాలలో వడ్డించే భోజనంలో తరచుగా పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. బియ్యాన్ని సరిగా శుభ్రం చేయకుండానే అన్నం వండుతున్నారని, అందుకే పురుగులు ప్లేట్ల లోకి వస్తున్నాయని వారు ఆరోపించారు. తమ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. భోజనం వడ్డించిన ప్లేట్లను ఒక దగ్గర పెట్టి విద్యార్థినిలు నిరసన తెలిపారు.. విషయం తెలుసుకున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యా ర్థులతో మాట్లాడారు. భోజన నాణ్యత, ఇతర మౌలిక వసతులపై పూర్తి వివరాలు సేకరించారు. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు..

# నార్నూర్ కేజీబీవీ విద్యాలయంలో పురుగుల అన్నం.. విద్యార్థుల ఆందోళన

ఆదిలాబాద్, సెప్టెంబర్ 11

నార్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించిన అన్నంలో పురుగులు రావడంతో వారు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. పాఠశాలలో వడ్డించే భోజనంలో తరచుగా పురుగులు వస్తున్నాయని విద్యార్థులు వాపోయారు. బియ్యాన్ని సరిగా శుభ్రం చేయకుండానే అన్నం వండుతున్నారని, అందుకే పురుగులు ప్లేట్ల లోకి వస్తున్నాయని వారు ఆరోపించారు. తమ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. భోజనం వడ్డించిన ప్లేట్లను ఒక దగ్గర పెట్టి విద్యార్థినిలు నిరసన తెలిపారు.. విషయం తెలుసుకున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. భోజన నాణ్యత, ఇతర మౌలిక వసతులపై పూర్తి వివరాలు సేకరించారు. విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు..

# గులాబీలో పొలిటికల్ ఫైట్..




హైదరాబాద్, సెప్టెంబర్ 1

తెలంగాణ రాజకీయాల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతల మధ్య ఉద్భవించిన విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), ఆయన సోదరి, బీఆర్ఎస్ బహిష్కృత నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో వ్యక్తం చేసిన భిన్నాభిప్రాయాలు పార్టీలో అంతర్గత సంక్షోభానికి దారితీశాయి. ఇద్దరూ కేసీఆర్ సిద్ధాంతం మేరకు పనిచేస్తామంటూ వైరుధ్య ప్రకటనలు చేయడం ఇద్దరి మధ్య ఫైట్ మొదలైందా అన్న చర్చ జరుగుతోంది.కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా, ఉపరాష్ట్రపతి ఎన్నికలను బహిష్కరించాలన్న నిర్ణయాన్ని ప్రకటించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతులను వేధిస్తున్నాయని, అందువల్ల బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉంటుందని ఆయన వాదించారు. ఈ నిర్ణయం వెనుక రాజకీయ వ్యూహం స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణలో రైతు సమస్యలను ఎత్తిచూపడం ద్వారా బీఆర్ఎస్ తన ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవాలని భావిస్తోంది. రైతు సమస్యలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్లకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగించాలన్నది కేటీఆర్ వ్యూహంగా కనిపిస్తుంది. అయితే, ఈ నిర్ణయం పార్టీలోని అన్ని వర్గాల నుంచి ఏకాభిప్రాయాన్ని పొందలేదు, ముఖ్యంగా కవిత దీనిని పరోక్షంగా వ్యతిరేకించడం ద్వారా అంతర్గత విభేదాలు బయటపడ్డాయి.కవిత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్రెడ్డిని సమర్థించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బిడ్డగా జస్టిస్ సుదర్శన్రెడ్డి గెలవాలని కోరుకోవాలని ఆమె సూచించడం ద్వారా బీఆర్ఎస్లోని ఒక వర్గం ఆలోచనలను ప్రతిబింబించారు. ఇది తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని జాతీయ స్థాయిలో ఉన్నతంగా చాటాలని కోరుకుంటుంది. అయితే, కవిత ఈ పిలుపు బీఆర్ఎస్ అధికారిక నిర్ణయానికి విరుద్ధంగా ఉండడం ఆమె పార్టీలోని ఇతర నాయకులతో, ముఖ్యంగా కేటీఆర్తో, విభేదాలను సూచిస్తుంది. ఇది కూడా ఆమె సస్పెన్షన్కు దారితీసిన కారణాల్లో ఒకటిగా కనిపిస్తోంది.కేటీఆర్, కవితల మధ్య ఈ భిన్నాభిప్రాయాలు బీఆర్ఎస్లో లోతైన అంతర్గత సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. కవిత సస్పెన్షన్, ఆమె తదనంతర రాజీనామా బీఆర్ఎస్లో అధికార పోరును మరింత స్పష్టం చేశాయి. కవిత, హరీశ్రావు, సంతోష్రావుపై తీవ్ర విమర్శలు చేస్తూ, పార్టీలో కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించడం ద్వారా, తన సొంత స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తుంది. అయితే, ఈ చర్య ఆమెను పార్టీ నుంచి బహిష్కరణకు గురి చేసింది. కేటీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా, ఈ సంక్షోభాన్ని నియంత్రించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. కవిత సస్పెన్షన్కు ముందు ఆమె ఆరోపణలపై పార్టీ అంతర్గతంగా చర్చించినట్లు ఆయన స్పష్టం చేశారు.అన్న, చెల్లెలి ఫైట్.. ఇప్పటికే అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్కు ఇబ్బందిగా మారనుంది. కేటీఆర్ నాయకత్వంలో పార్టీ రైతు సమస్యలను ఎత్తిచూపడం ద్వారా తిరిగి ఊపందుకోవాలని చూస్తున్నప్పటికీ, కవిత రాజీనామా, కొత్త పార్టీ స్థాపన గురించిన ప్రచారం పార్టీ ఐక్యతను బలహీనపరిచే అవకాశం ఉంది. కవిత తదుపరి రాజకీయ చర్యలు, ముఖ్యంగా కొత్త పార్టీ స్థాపన లేదా కాంగ్రెస్లో చేరిక వంటి అంశాలు, తెలంగాణ రాజకీయ లెక్కలను మార్చవచ్చు.

================

# సూపర్ సిక్స్ ఫ్లాప్ అయినా సూపర్ హిట్ సభలా

విజయవాడ, సెప్టెంబర్ 10

అట్టర్ ఫ్లాప్ సినిమాలకు సక్సెస్ మీట్లు పెట్టినట్లుగా సూపర్ సిక్స్ ఫ్లాప్ అయినా సూపర్ హిట్ అని సభలు పెట్టుకుంటున్నారని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. తాడేపల్లిలో జరిగిన ప్రెస్మీట్లో కూటమి ప్రభుత్వం.. వైఫల్యాలు , అవినీతిని, మోసపూరిత వాగ్దానాలు చేసిందని ఆరోపిస్తూ సుదీర్ఘంగా మాట్లాడారు. రైతుల సమస్యలు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, ఆరోగ్యశ్రీ నిర్వీర్యం, సూపర్ సిక్స్ హామీలు, ఎన్నికలలో అక్రమాలు వంటి అంశాలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందని, ఎరువుల సరఫరాలో అవకతవకలు, బ్లాక్మార్కెట్ దందాలు జరుగుతున్నాయని ఆరోపిచారు. రైతు భరోసా, సున్నా వడ్డీ పథకాలను రద్దు చేసి, ఆర్బీకేలు, ఈ-క్రాపింగ్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఉల్లి, టమాటా, చీనీ రైతుల దుస్థితిని ఎత్తిచూపుతూ, ధరల స్థిరీకరణ కోసం చేసిన హామీలను అమలు చేయలేదన్నారు. యూరియా సరఫరాలో రూ.250 కోట్ల స్కామ్ జరిగిందని, టీడీపీ నేతలు ఎరువులను బ్లాక్మార్కెట్లో అమ్ముతున్నారని ఆరోపించారు. వైఎస్సార్సీపీ హయాంలో 17 మెడికల్ కాలేజీలను ప్రారంభించామని 800 కొత్త సీట్లను తీసుకొచ్చామని జగన్ అన్నారు. అయితే చంద్రబాబు ఈ ప్రాజెక్టులను నిలిపివేశారని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఇది పేదలకు అందుబాటులో ఉండాల్సిన వైద్య సేవలను దెబ్బతీస్తుందన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీకి 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరైనా, చంద్రబాబు వాటిని తిరస్కరించారని, ఇది పేదలకు వైద్య విద్య అవకాశాలను అడ్డుకోవడమేనన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ప్రైవేట్ ఆస్పత్రులు ఈ పథకం కింద వైద్యం అందించడం మానేశాయన్నారు. రూ.4,500 కోట్ల బకాయిలలో కేవలం రూ.600 కోట్లు మాత్రమే చెల్లించారని, దీంతో ప్రజలకు ఉచిత వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు, టెస్టులు లేకపోవడం వల్ల వైద్య వ్యవస్థ దిగజారిందని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు తల్లికి వందనం, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత సిలిండర్లు అన్నీ అబద్ధాలని, ఒక్కటి కూడా సరిగ్గా అమలు కావడం లేదు. ఐదు లక్షల పెన్షనర్లకు కోత విధించారని, రూ.3 వేల నిరుద్యోగ భృతి, రూ.36 వేల ఆడబిడ్డ నిధి వంటి హామీలు గాలికొదిలేశారన్నారు. సూపర్ సిక్స్ను "అట్టర్ఫ్లాప్ సినిమా"గా అభివర్ణిస్తూ, బలవంతంగా విజయోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. ఇసుక, లిక్కర్, అమరావతి పేరిట మాఫియా దందాలు నడుస్తున్నాయని, రాష్ట్ర ఆదాయం తగ్గుతుండగా, చంద్రబాబు , ఆయన అనుచరుల సంపద పెరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా కొనసాగుతోందని, ప్రభుత్వ ఆస్తులను అమ్ముకుంటూ ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారన్నారు.

# చంద్రగ్రహణం దెబ్బకు నలుగురు ప్రధానులు ఔట్

ముంబై, సెప్టెంబర్ 11

నేపాల్లో సామాన్యుల ఆందోళనలు దేశం మొత్తాన్ని అల్లాడించాయి. యువతరం ఆవేశం ముందు.. కాకలు తీరిన రాజకీయ నాయకుల ఎత్తులు చిత్తయ్యాయి. అయితే, కేవలం నేపాల్ మాత్రమే కాదు, ఫ్రాన్స్, జపాన్, థాయ్లాండ్ వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి. అయితే, రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు దేశాలకు చెందిన ప్రధాన మంత్రులు పదవీచ్యుతులయ్యారు. కానీ, దీనికి కారణం చంద్రగ్రహణం అంటూ సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం తెగ వైరల్ అవుతోంది.ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతోన్న రాజకీయ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. సోషల్ మీడియాపై నిషేధం విధిస్తూ నేపాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చివరకు ఆ దేశాన్ని కుదిపేస్తోంది. ఆ దేశ ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మరోవైపు, ఫ్రాన్స్లోనూ 'బ్లాక్ ఎవ్విరిథింగ్' ఉద్యమం క్రమంగా ఉద్ధృతమవుతోంది. ఆ దేశ ప్రధాని ఫ్రాంకోయిస్ బేరోపై విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆయన సోమవారం నాడు పదవి నుంచి తప్పుకున్నారు. ఇక, థాయ్లాండ్, జపాన్ ప్రధానులు షిన్వత్రా, షిగేరు ఇషిబాలు కూడా రాజీనామాలు చేశారు. జపాన్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కూటమి ఓటమి చవిచూసి బలం కోల్పోయింది. దీంతో ఇషిబా రాజీనామా చేయాలనే ఒత్తిడి సొంత పార్టీ నుంచే



ఎదురవవడంతో ఆయన తప్పుకున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే నాలుగు దేశాల ప్రధానులు రాజీనామా చేయడంతో ఇదంతా ఆదివారం నాడు సంభవించిన చంద్రగ్రహణం ప్రభావం అని సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు.ప్రముఖ వ్యాపారవేత్త హర్షగోయెంకా ఎక్స్ (ట్విట్టర్)లో పెట్టిన ఓ పోస్ట్ చర్చనీయాంశమైంది. 'చంద్రగ్రహణం ప్రభావంతో గత రెండు రోజుల్లోనే జపాన్, ఫ్రాన్స్, నేపాల్, థాయ్లాండ్ ప్రధానులను జనం ఇంటికి సాగనంపారు.. అందరి చూపు త్వరలోనే ఏర్పడబోయే సూర్యగ్రహణం మీదే ఉంది.. తదుపరి రాజీనామా ఓ పెద్ద కాషాయ నేతదే కావచ్చు' అని అంటూ ట్వీట్ చేశారు. ఆయన చేసిన ట్వీట్ పరోక్షంగా ప్రధాని మోదీని టార్గెట్ చేసినట్టు ఉంది. ఈ ట్వీట్పై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఓ నెటిజన్ "ఆ వ్యక్తి మోదీ కావచ్చు" అని రిప్లయ్ ఇచ్చాడు.'నారింజ పండు పూర్తిగా పక్వానికి వచ్చి తనకు కేటాయించిన విధిని నెరవేర్చిన తర్వాత అది కొమ్మ నుంచి విడిపోయి అస్తమించే సూర్యుడిలా "చంద్రుని"పై తన కాంతిని ప్రసరింపజేస్తుంది... అప్పటి వరకు అందరూ చేదు "ఆకుపచ్చ" రసాన్ని తాగి, తీపి నారింజ రసం అమృతాన్ని తాగాలనే ఆశతో సూర్యుడిని పూజిస్తారు.. తర్వాత జై శ్రీరామ్ అంటారు" అని ఓ నెటిజన్ కామెంట్ పెట్టారు.'జ్యోతిష్కులు అంచనాలు కంటే చంద్రుడు రాజీనామాలతో బిజీగా ఉన్నట్లు కనిపిస్తోంది... సూర్య గ్రహణం నిజంగా "నారింజ రంగు" ఉన్నదానిని లక్ష్యంగా చేసుకుంటే, సూర్యగ్రహణాన్ని చూడటానికి అద్దాలు సరిపోవు – మనకు పాప్కార్న్ కూడా కావాలి' అని ఇంకొక యూజర్ పోస్ట్ పెట్టడం గమనార్హం. అయితే, ప్రధాని మోదీకి వచ్చే 17తో 75 ఏళ్లు పూర్తవుతుండటంతో బీజేపీ వయసు నిబంధనల ప్రకారం ఆయన పదవి నుంచి తప్పుకుంటారని సోషల్ మీడియాలో తెగ ప్రచారం చేస్తోన్న సంగతి తెలిసిందే.

# కవితను టీడీపీలోకి అంటే జగన్ ను తీసుకోవడమే....

## వైరల్ గా మారిన లోకేష్ కామెంట్స్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10

పార్టీ ఆఫీసంటే అది కార్యకర్తల కార్యాలయమే అన్నారు ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్. సీఎంని కలవాలంటే అప్పాయింట్మెంట్ అవసరంకానీ.. పార్టీ ఆఫీసుకు ఎవరు ఎప్పుడొచ్చినా ఫిర్యాదులు తీసుకుంటామన్నారు. ఢిల్లీ బీజేపీ ఆఫీసు కన్నా టీడీపీ ఆఫీస్ పెద్దగా ఉందన్నారు లోకేష్. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ ఔఆం అభ్యర్థికి ఎందుకు ఓటేసిందో వైఎస్ జగన్నే అడగాలన్నారు లోకేష్. 2029 ఎన్నికల్లో కూడా మోదీకే తమ మద్దతు ఉంటుందన్నారు. కేటీఆర్ని కూడా కలుస్తానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు లోకేష్. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగి కలవాల్సిన అవసరం లేదన్నారు. కవితను టీడీపీలో తీసుకోవడమంటే.. జగన్ని పార్టీలో చేర్చుకోవడమేనంటూ చిట్చాట్ చేశారు నారా లోకేష్.

రెడ్బుక్లో చాలా ఉన్నాయన్న లోకేష్.. అన్నీ బయటికొస్తాయన్నారు. వైసీపీ నేతలెవరూ అవినీతి జరగలేదని చెప్పడం లేదు. దొరికిపోతానన్న భయంతోనే జగన్ బెంగుళూరులో ఉన్నారన్నారు. తెలంగాణపై టీడీపీ ఫోకస్ చేస్తోందని.. త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీపై పార్టీ అధినేత నిర్ణయం తీసుకుంటారన్నారు లోకేష్. ఢిల్లీ టూర్లో ఉన్న నారా లోకేష్ ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు పనితీరును ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలను బూత్ స్థాయికి తీసుకెళ్లాలని ప్రధాని సూచించారన్నారు. స్వదేశీ వస్తువులను ప్రమోట్ చేయాలని ప్రధాని చెప్పారన్నారు లోకేష్.

# ఇండియా, అమెరికా చర్చలకు వేళాయెరా..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11

డొనాల్డ్ ట్రంప్ టారీఫ్ల బాదుడుతో భారత్, అమెరికాల మధ్య జరగాల్సిన ఆరో దశ వాణిజ్య చర్చలు అర్ధాంతరంగా వాయిదా పడ్డాయి. అయితే, ఈ చర్చలు త్వరలో న్యూఢిల్లీలో ప్రారంభం కానున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ చర్చలు, ఒప్పందం ఖరారు దిశగా సాగుతాయని పేర్కొన్నాయి వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో భారత్ తన వైఖరికి కట్టుబడి ఉండాలని భావిస్తోంది, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవల ప్రధాని స్పష్టం చేశారు..సుంకాల మేఘాలు కమ్ముకున్న వేళ... భారత్, అమెరికాల మధ్య ఆరో దశ వాణిజ్య చర్చలు త్వరలోనే ప్రారంభమవుతాయని, ఒప్పందం ఖరారు కానుందని విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. వాస్తవానికి ఆగస్టు చివరి వారంలోనే ఈ చర్చలు జరగాల్సి ఉండగా.. భారత్పై ట్రంప్ 50 శాతం అదనపు సుంకాలు విధించడంతో వాయిదా పడ్డాయి. ఈ చర్చలు న్యూఢిల్లీలోనే జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం భారత్తో వాణిజ్య చర్చలు పున:ప్రారంభమవుతాయని ట్రూత్ సోషల్లో హింట్ ఇచ్చారు. వాణిజ్య అడ్డంకులను అధిగమించడానికి ఇరు దేశాలూ చర్చలు కొనసాగిస్తున్నాయని ఆయన తెలిపారు."రాబోయే వారాల్లో నా ఆప్త మిత్రుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడటానికి నేను ఎదురు చూస్తున్నాను. మన రెండు గొప్ప దేశాలకు విజయవంతమైన ముగింపుకు రావడంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు " అని ట్రంప్ పోస్ట్ పెట్టారు. వైట్హౌస్ వద్ద ట్రంప్ మాట్లాడుతూ.. భారత్–అమెరికా మైత్రిని చాలా ప్రత్యేకమైన సంబంధంగా పేర్కొంటూ.. మోదీ, తాను స్నేహితులుగా ఉంటామని నొక్కి చెప్పారు. ఈ ప్రకటన చేసిన కాసేపటికే ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్లో పై విధంగా స్పదించారు. 'బాధపడాల్సిన




పని లేదు. మనకు సందర్భానుసారంగా క్షణాలు మాత్రమే ఉంటాయి' అని అన్నారు.ట్రంప్ పోస్ట్పై కూడా ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్ సానుకూల ఆలోచనలను తాను అభినందిస్తున్నానని, పరస్పరం స్పందిస్తున్నానని మోదీ అన్నారు. ధరలకు ప్రాధాన్యత ఇచ్చే వ్యవసాయం, డెయిరీ మార్కెట్లలోకి అమెరికా ప్రవేశాన్ని భారత్ నిరాకరించడంపై దీర్ఘకాలిక ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయినప్పటికీ ట్రంప్ పదే పదే డిమాండ్ చేస్తున్నది ఏమిటంటే అక్టోబర్ గడువు నాటికి ఒక ఒప్పందం లేదా కనీసం ముందస్తు ఫ్రేమ్వర్క్ ఇరుపక్షాలు ఆశిస్తున్నాయని వర్గాలు తెలిపాయి.అయితే, భారత్ వ్యవసాయం, పాడి పరిశ్రమపై తన వైఖరికి కట్టుబడి ఉండాలని కోరుకుంటుంది. చౌకైన అమెరికన్ వస్తువులు ఈ మార్కెట్లను నీరుగార్చడానికి, కోట్లాది మంది రైతులు, పశు పెంపకందారులు, మత్స్యకారులు, మహిళల జీవనోపాధిని దెబ్బతీస్తాయని భారత్ భావిస్తోంది. దీంతో పాటు మొక్కజొన్న, సోయాబీన్, యాపిల్, బాదం, ఇథనాల్ వంటి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలనే ప్రతిపాదనలను కూడా భారతదేశం తోసిపుచ్చింది. దీనిని అనుమతించడం వల్ల భారత రైతులపై ప్రభావం పడుతుందని కేంద్రం వాదిస్తోంది. ఢిల్లీలోని ఎర్రకోట నుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'రైతులు, మత్స్యకారులు, పశువుల పెంపకం దారులకు సంబంధించిన ఏదైనా హానికరమైన విధానానికి వ్యతిరేకంగా మోదీ గోడలా నిలబడుతున్నారు... భారత్ ఈ విషయంలో ఎప్పటికీ రాజీపడబోదని' మోదీ ఖరాఖండీగా చెప్పారు.



## లోకేష్ 2.0

# అన్ని పనుల్లో స్పష్టమైన మార్పు

విజయవాడ, సెప్టెంబర్ 11

ఏపీ మంత్రి నారా లోకేష్ లోస్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఆయన పనితీరులో సమూల మార్పులు రావడం విశేషం. రాష్ట్ర మంత్రిగా ఉంటూ బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తేగలుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నారు. కేంద్ర పెద్దలతో తరచూ మాట్లాడుతున్నారు. అదే సమయంలో రాజకీయంగా సొంత పార్టీని ఒంటి చేత్తో నడపగలుగుతున్నారు. చంద్రబాబు పూర్తిగా పాలనపై దృష్టి పెట్టెలా.. మిగతా వ్యవహారాలను అన్నీ తానై చూస్తున్నారు నారా లోకేష్. మరోసారి డేరింగ్ స్టెప్ వేశారు నారా లోకేష్. కూటమి ప్రతిష్టాత్మకంగా అనంతపురంలో నిర్వహిస్తున్న 'సూపర్ సిక్స్ సూపర్ హిట్ ' కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. నేపాల్ పరిణామాల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న ఏపీ ప్రజలను రప్పించే బాధ్యతను తీసుకున్నారు. అందుకే ఈ సభకు వెళ్లకుండా సచివాలయం నుంచి నేపాల్ నుంచి సురక్షితంగా తెచ్చే ప్రయత్నాలు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ నేపాల్ లో చిక్కుకున్న ఏపీ ప్రజలను రక్షించనున్నారు నారా లోకేష్.కూటమిఅధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. సంక్షేమ పథకాలతో సైతం అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించింది ఏపీ ప్రభుత్వం. నిధులు సమీకరించగలిగింది. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. ఇంకోవైపు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన కూడా జరిగింది. సంక్షేమ పథకాలు పట్టాలెక్కాయి. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్న క్యాంటీన్లు.. ఇలా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయగలిగింది కూటమి ప్రభుత్వం. 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల నియామకం సైతం పూర్తి చేయగలిగింది. అందుకే 15 నెలల కూటమిపాలన సక్సెస్ కావడంతో అనంతపురం వేదికగా భారీ కార్యక్రమానికి ఈరోజు సంకల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. అయితే ప్రభుత్వంతో పాటు తెలుగుదేశం పార్టీలో అత్యంత కీలకమైన నారా లోకేష్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండటం మాత్రం చిన్న విషయం కాదు. అయితే నేపాల్ పరిణామాల నేపథ్యంలో ఏపీ ప్రజల కష్టాలను గట్టెక్కించేందుకు లోకేష్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉండి పోవాల్సి వచ్చింది.నేపాల్ పరిణామాల నేపథ్యంలో నారా లోకేష్ తన అనంతపురం పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈరోజు ఉదయం 10 గంటలకు సచివాలయంలోని రియల్ టైం గవర్నెన్స్ సెంటర్ కు నారా లోకేష్ వెళ్తారు. రియల్ టైం గవర్నెన్స్ వేదికగా ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే ఆర్టిజిఎస్ సెంటర్ కు రావాలని ఆదేశాలు జారీ చేశారు నారా లోకేష్. అక్కడ ప్రత్యేక కాల్ సెంటర్, వాట్సాప్ నెంబర్ ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించనున్నారు. నేపాల్ లో చిక్కుకున్న వారి వివరాలు సేకరించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో తక్షణమే వారిని రాష్ట్రానికి తీసుకురానున్నారు. అత్యంత కీలకమైన ఈ బాధ్యతను వేరే నేతలకు, మంత్రులకు అప్పగించకుండా లోకేష్ స్వయంగా పర్యవేక్షిస్తుండడం విశేషం.వాస్తవానికి విదేశాల్లో చిక్కుకునే వారిని స్వస్థలాలకు తెప్పించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. మంత్రివర్గ ఏర్పాటు సమయంలోనే ఆ బాధ్యతలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు అప్పగించింది. అయితే ఎక్కువగా విదేశాల్లో చిక్కుకున్న వారి విషయంలో మంత్రి నారా లోకేష్ చొరవ చూపుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. విదేశాల్లో ఉండే బాధితులు ఎక్కువగా లోకేష్ ను ఆశ్రయించడం ప్రారంభించారు. లోకేష్ ను ఆశ్రయిస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందని బాధితుల అభిప్రాయం. అందుకే మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి లోకేష్ గ్రీవెన్స్ సెల్ పెడితే.. రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు వచ్చి అక్కడ వినతులు అందిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల కేంద్రం వద్ద కూడా లోకేష్ పరపతి పెరిగింది. ప్రపంచ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో సైతం నారా లోకేష్ కు సాన్నిహిత్యం ఉంది. అందుకే ఏపీకి పెట్టుబడుల వరద వస్తోంది. ఇంకోవైపు విదేశాల్లో ఉండే తెలుగు ప్రజలకు సంబంధించిన సంఘాల ప్రతినిధులు సైతం లోకేష్ తో టచ్ లో ఉంటారు. అందుకే విదేశాల్లో ఎవరికైనా ఇబ్బందులు వస్తే ముందుగా గుర్తొచ్చే పేరు నారా లోకేష్. అయితే ఇప్పుడు నేపాల్ లో అల్లకల్లోలం ఉన్న నేపథ్యంలో.. అక్కడ చిక్కుకున్న ఏపీ ప్రజలను రప్పించే గురుతుర బాధ్యతను తీసుకున్నారు నారా లోకేష్. ఓ రాజకీయ భారీ బహిరంగ సభ ప్లాన్ చేసిన తర్వాత ప్రభుత్వంతో పాటు తెలుగుదేశం పార్టీలోనూ, కూటమిలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్న లోకేష్ దూరంగా ఉండడం.. అది కూడా ప్రజల కోసమే కావడం నిజంగా అభినందించదగ్గ విషయం.

# మరో 3 రోజులు వానలే వానలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10

ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్లో మూడు రోజులు పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. దీని ప్రభావంతో ఈ రోజు అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లుండి నుంచి మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరికలు జారీ చేసింది. తీరం వెంబడి గంటకు 40 -60 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయనున్నాయి. ప్రజలు చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని, మరింత అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు.తూర్పు దిశలో ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కొనసాగుతుంది. మరోవైపు దక్షిణ ఒడిస్సా సమీపంలోని ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రాంతంలో సగటు సముద్రమట్టం నుండి 4.5 కి.మీ ఎత్తులో చక్రవాక ఆవర్తనం కొనసాగుతుంది. ఈ రోజు తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.రేపు ఆదిలాబాద్, కొమరం భీం, మంచిర్యాల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

# నేడు జాతీయ ప్రోత్సాహక దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12ను జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ రోజు మన చుట్టూ ఉన్న ప్రజలను ఉత్తేజపరిచేందుకు మరియు సానుకూల ప్రభావాన్ని చూపడానికి ఈరోజు నెలకొల్పబడింది. అర్కాన్సాస్‌లోని సియర్సీలోని హార్డింగ్ విశ్వవిద్యాలయంలోని ప్రోత్సాహక ఫౌండేషన్ ప్రోత్సాహక దినోత్సవం వెనుక ఈ ప్రయత్నాన్ని ప్రారంభించింది. అర్కాన్సాస్‌లోని సియర్సీ మేయర్ బెలిండా లాఫోర్స్ ఆగస్టు 22, 2007న ప్రోత్సాహక దినోత్సవం కోసం మొదటి ప్రకటన చేశారు. మరుసటి నెలలో, అర్కాన్సాస్ గవర్నర్ మైక్ బీబే సెప్టెంబర్ 12, 2007ను అర్కాన్సాస్‌కు "రాష్ట్ర ప్రోత్సాహక దినోత్సవం"గా ప్రకటిస్తూ ఒక ప్రకటనపై సంతకం చేశారు. తరువాత, అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్ కూడా సెప్టెంబర్ 12వ తేదీని అధికారిక జాతీయ ప్రోత్సాహక దినోత్సవంగా ప్రకటిస్తూ ఒక సందేశంపై సంతకం చేశారు. భవిష్యత్తులో జాతీయ ప్రోత్సాహక దినోత్సవంలో మరిన్ని రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడానికి ప్రోత్సాహక ఫౌండేషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఒక విద్యార్థి, సహోద్యోగి లేదా స్నేహితుడికి స్ఫూర్తినిచ్చే కొన్ని మాటలు చెప్పడం వల్ల మనకు ఎటువంటి ఖర్చు ఉండదు. ఒక అపరిచితుడికి ఒక భరోసా ఇచ్చే మాట కూడా వారి జీవితాల్లో మార్పు తీసుకురావచ్చు. ఎవరైనా నిరాశలో ఉన్నప్పుడు ప్రోత్సాహం వారిని పైకి లేపుతుంది. లక్ష్యంపై దృష్టి పెట్టే వ్యక్తిని కూడా ఇది ప్రేరేపిస్తుంది. మనం విఫలమైనప్పుడు, సరైన మాటలు ప్రయత్నిస్తూనే ఉండాలని గుర్తు చేస్తాయి. సరైన సందేశం ప్రియమైన వ్యక్తి దృక్పథాన్ని మార్చే ఒక స్పార్క్‌ను సృష్టించవచ్చు. కొన్నిసార్లు, బాగా చేసిన పనిని గమనించడం అనేది ఒకరి రోజును మెరుగుపరుస్తుంది. కొత్త ప్రతిభను గుర్తించే అలవాటును పెంపొందించుకోవడం వల్ల మనం మాట్లాడటానికి, దయగల మాట లేదా సహాయకరమైన చిట్కాను అందించడానికి ప్రేరేపిస్తుంది. పనిలో, ఇంట్లో మన చుట్టూ ఉన్న ప్రపంచంలో సంబంధాలను మెరుగుపరచుకోవడం విలువైన అభ్యాసం. నిజంగా అంత తేలికైన మార్గం లేదు.


మీ చుట్టూ ఉన్న ప్రజలకు భరోసా మరియు ప్రేరణను అందించండి. బాగా చేసిన పనికి ఎవరికైనా హై ఫైవ్ ఇవ్వండి. ఒక స్నేహితుడు కష్టపడి సాధించుకున్న లక్ష్యాన్ని చేరుకుంటున్నప్పుడు గమనించండి, వారిని ముందుకు సాగమని ప్రోత్సహించండి. ఇబ్బంది

### మనిషి ప్రమేయం లేకుండానే

# ఒక్క నిమిషంలో 200 కార్లు పార్కింగ్..

**హైదరాబాద్, సెప్టెంబర్ 11,**

హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్. పిపిపి విధానంలో ఇప్పటికే 10 అంతస్తుల పార్కింగ్ భవనం నాంపల్లిలో సిద్దం చేసింది. దేశంలో మరెక్కడాలేని సరికొత్త కార్ పార్కింగ్ అనుభూతుని అతి త్వరలో హైదరాబాద్ నగరవాసులకు అందించబోతోంది. హైదరాబాద్ నగరం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అంతేస్ధాయిలో జనాభా పెరుగుదల, వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. కారు పార్క్ చేయాలంటే నగరవాసులకు పట్టపగలు చుక్కలు కనిపిస్తున్నాయి. రద్దీ మాల్స్ లో అయితే సెల్లార్ లో కార్ పార్క్ చేయడం , పార్కింగ్ నుండి బయటకు తీయడం అంటే పద్మవ్యూహంలోకి వెళ్లి వచ్చామా అన్నంతలా నరకం చూస్తున్నారు. కారులో మనిషి లేకుండానే క్షణాల్లో కార్ పార్క్ చేయడం , పార్కింగ్ లొకేషన్ నుండి అంతే వేగంగా మనిషి లేకుండానే కారు ను పార్కింగ్ ఏరియా నుండి బయటకు తెచ్చేయడం ఈ మల్టీలెవిల్ ఆటోమేటెడ్ కార్ పార్కింగ్ ప్రత్యేకత. ఈ తరహా అత్యాధునికమైన మల్టీలెవిల్ జర్మనీ టెక్నాలజీ కార్ పార్కింగ్ విధానం మన దేశంలో మరెక్కడా లేదు. 2వేల చదరపు గజాల ప్రభుత్వ స్దలంలో 102 కోట్ల వ్యయంతో పబ్లిక్ ప్రవేటు భాగస్వామ్యంతో ఈ భవనం నిర్మించారు. నాంపల్లి మెట్రో స్టేషన్ నుండి గాంధీ భవన్ కు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన జర్మనీకి చెందిన నోవమ్ ఈ నిర్మాణ పూర్తి చేసింది. మొత్తం 15 అంతస్దుల భవనంలో 3 బేస్ మెంట్ లు, 7 పై అంతస్దులు మొత్తంగా 10 అంతస్దులు కేవలం పార్కింగ్ కోసం మాత్రమే కేటాయించారు. మిగతా ఐదు అంతస్దులలో రెండు సినిమా థియేటర్లు, ఆకట్టుకునే సిటీ వ్యూ, వినోదం పంచనున్నాయి. ఇక్కడ పూర్తిగా జర్మన్ టెక్నాలజీ ఆధారంగా పార్కింగ్ ప్రక్రియ ఉంటుంది. మీరు కారును ఈ నోవమ్ పార్కింగ్ కాంప్లెక్స్ లోకి తీసుకురాగానే , ఇలా మీకు రైట్ సైడ్ కనిపిస్తున్న సెల్లార్ కు వెళ్లే మార్గం ద్వారా కారును క్రిందకు తీసుకెళతారు. ఈ మార్గంలో కారు అలా వెళ్లి జస్ట్ టర్న్ అవ్వగానే అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్కానర్ ఉంటుంది. ఆ స్కానర్ ద్వారా ఆటోమేటిక్ గా మీ కారు నెంబర్ , వివరాలు పూర్తిగా స్కాన్ చేయడంతోపాటు, మీరు ఏ నెంబర్ పార్కింగ్ మార్గం వద్దకు వెళ్లాలనే వివరాలతో , క్యూర్ కోడ్ కలిగిన స్లిప్ వస్తుంది. క్యూ ఆర్ కోడ్ ఉన్న స్లిప్ లో సూచించిన ఇన్ గేట్ వద్దకు వెళ్లి, అక్కడ రౌండ్ సర్కిల్ గా కనిపిస్తున్న ఈ ప్యాలస్ టేబుల్ పైన మీ కారును వదిలేసి మీరు దిగిపోవచ్చు. మీరు కారును దీనిపై ఏ సైడ్ తిరిగి ఉన్నా ఇబ్బంది లేదు, ఎందుకంటే 360డిగ్రీల కోణంలో తిరిగే ఈ ప్యాలెస్ టేబుల్ మీ కారును సరైన విధానంలో పెట్టి, ఒకే ఒక్క నిమిషంలోపు పార్కింగ్ ప్లేస్ కు తీసుకెళ్లి, పార్క్ చేసేస్తుంది. అలా ఈ అధునాతన పార్కింగ్ కాప్లెక్స్ లో 200 వందల కార్లు, 250 బైక్ లు పార్కింగ్ చేయవచ్చు. మీకు ముందుగా



పార్కింగ్ సమయంలో వచ్చిన క్యూ ఆర్ కోడ్ స్లిప్ ను అక్కడే ఉన్న కౌంటర్ వద్దకు తీసుకెళ్లి, పార్కింగ్ ఛార్జ్ పే చేస్తే, వెంటే వాళ్ల పార్కింగ్ నుండి రిలీజ్ ఇచ్చేస్తారు. అలా రిలీజ్ ఇచ్చిన వెంటనే మీకారు మీరున్న ప్రాంతానికి వచ్చేస్తుంది. అలా వచ్చిన కారును, క్యూర్ కోడ్ స్కాన్ స్లిప్ చూపించి, అవుట్ గేట్ ద్వారా బయటకు తీసుకెళ్లవచ్చు. ఈ మొత్తం ప్రాసెస్ లో కారు పార్కింగ్, కారును బయటకు తీసుకురావడంతో మానవ ప్రమేయం ఎక్కడా ఉండదు. హైదరాబాద్‌లో ఒక్క నిమిషంలో 200 అంతేకాదు 10 అంతస్దుల భవనంలో మీ కారు ఎక్కడ పార్క్ చేసారనేది మీకు ఏ మాత్రం తెలియదు. అలా పజిల్ పార్కింగ్ విధానంలో ఇక్కడ ఆటోమేటెడ్ పార్కింగ్ కొనసాగుతుంది. మహా అయితే ఓ 40 కార్లు పార్క్ చేయగలిగే ఏరియాలో మల్టీలెవిల్ విధానంలో 200 కార్లు పార్క్ చేస్తున్నారు. ఏ మాత్రం కారుకు చిన్న డ్యామేజ్ జరగకుండా ఫుల్లీ ఆటోమేటెడ్ టెక్నాలజీతో సరికొత్త అనభూతిని ఇచ్చేలా సర్వం సిద్దం చేసింది జర్మన్ కంపెనీ నోవమ్.

# సింగరేణిలో సిఐటియు వినూత్న కార్యక్రమం...

### కార్మికుల సొంతింటి కల నెరవేరేలా రహస్య బ్యాలెట్ ద్వారా అభిప్రాయ సేకరణ

పెద్దపల్లి సెప్టెంబర్ 11

సింగరేణి బొగ్గు గనులపై సిఐటియు వినూత్న కార్యక్రమం చేపట్టింది. కార్మికుల సొంతింటి కల అమలు కోసం సింగరేణి వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో సీక్రెట్ బ్యాలెట్ ద్వారా కార్మికుల అభిప్రాయ సేకరణ చేపట్టారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా సింగరేణి 2వ బొగ్గు గనిపై సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి, ఉపాధ్యక్షుడు భూపాల్ హాజరై ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి కార్మికుల యొక్క బలమైన సొంతింటి కోరికను తెలియజేస్తామన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో పాటు యజమాన్యం బ్యాలెట్ ప్రక్రియను జరపకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేసినా స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ ఓటు వేస్తున్నారని రాజారెడ్డి తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా 1360 ఎకరాల ఖాళీ స్థలం ఉందని, వేలాది క్వార్టర్లు శిధిలావస్థలో, నిరుపయోగంగా ఉన్నాయన్నారు. బ్యాలెట్ ద్వారా వెలుబడబోయే ఫలితాలను రెఫరెండంగా భావించి సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం కార్మికుల సొంతింటి కలను నెరవేర్చాలని రాజారెడ్డి డిమాండ్ చేశారు.

# అమ్మో..కేఎఫ్సీ నా...

నిజామాబాద్, సెప్టెంబర్ 11

ఫ్రైడ్ చికెన్ అంటే ఇష్టపడని వారు ఎవరుంటారు. కారంగా.. క్రిస్పీగా.. ఇంకొంచెం ఘాటుగా.. వేడివేడి చికెన్ ముక్కలను లొట్టలు వేసుకుంటూ తింటూ.. అందులోకి కూల్ డ్రింక్ తాగుతూ ఆస్వాదించేవారు చాలామంది ఉంటారు. సాయంత్రం సమయంలో చల్లగా ఉన్న వాతావంణాన్ని.. ఇలాంటి వేడి ఫుడ్ తింటూ చాలామంది ఆస్వాదిస్తూ ఉంటారు. అందువల్లే కేఎఫ్ సీ రెస్టారెంట్లు సాయంత్రం సమయంలో విపరీతమైన రద్దీగా ఉంటాయి. దీనికి తోడు కేఎఫ్ సీ లో వినియోగదారులు కోరుకున్నట్టుగా చికెన్ లో వెరైటీలు లభిస్తుంటాయి.. లెగ్ పీస్, జాయింట్ వింగ్స్, చెస్ట్ పీస్ లు.. ఇలా రకరకాల వెరైటీలు అందుబాటులో ఉంటాయి. ఈ తరహా చికెన్ తినడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నప్పటికీ చాలామంది వినిపించుకోరు. పైగా లొట్టలు వేసుకుంటూ తింటారు. అనేక సందర్భాలలో అనేక సందర్భాలలో కేఎఫ్ సీ లో చికెన్ ఆరోగ్యానికి మంచిది కాదని.. అందులో హానికరమైన పదార్థాలు ఉన్నాయని మీడియాలో వార్తలు వచ్చినప్పటికీ చాలామంది పట్టించుకోరు. ఎక్కడో జరిగింది కదా.. ఇక్కడైతే కాదు కదా అని సర్ది చెప్పుకుంటారు. పైగా భారీ ఆర్డర్లు పెట్టి తమ కడుపును నింపుకుంటారు. చికెన్ మాత్రమే కాదు శీతల పానీయాలు కూడా విపరీతంగా తాగుతుంటారు. అందువల్లే మనదేశంలో కేఎఫ్ సీ రెస్టారెంట్లు విపరీతంగా ఉంటాయి. సినిమా



థియేటర్లు.. పెద్దపెద్ద మాల్స్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాలేజీలు ఉన్నచోట.. హాస్టల్స్ ఉన్నచోట కే ఎఫ్ సీ రెస్టారెంట్లకు కొదవ ఉండదు. ఓ నివేదిక ప్రకారం మనదేశంలో కే ఎఫ్ సీ ప్రతి ఏడాది వందల కోట్ల వ్యాపారం చేస్తూ ఉంటుంది. ఇంకా తన వ్యాపారాన్ని విస్తరిస్తూనే ఉంది. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్రంలో కే ఎఫ్ సీ రెస్టారెంట్ కు సంబంధించి ఒక దారుణమైన నిజం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్ నగరంలో వేణు మాల్ లో ఇటీవల కొందరు చికెన్ లెగ్ పీస్ ఆర్డర్ చేశారు. అది తింటూ ఉండగా కుళ్ళిపోయిన వాసన వచ్చింది. దీంతో ఒక కస్టమర్ వచ్చి నిర్వాహకులను నిలదీశాడు. దీంతో వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీనికి తోడు వింగ్స్ ఆర్డర్ పెట్టిన వ్యక్తికి కూడా ఇలాంటి అనభవం ఎదురయింది. దీంతో అతడి కూడా నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కస్టమర్లు ఇలా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ రెస్టారెంట్ నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. పైగా వెగిలిగా నవ్వారు. ఈ వీడియో

# కవిత చేసిన గాయానికి మందేది

హైదరాబాద్, సెప్టెంబర్ 11, (

బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెషన్ తరువాత కవిత ఎపిసోడ్ ముగిసినట్లేని ఆ పార్టీ ముఖ్యనేతలు భావిస్తున్నారా.. అలా కాకుంటే మరి కవిత చేసిన ఆరోపణలపై నేటికీ ఎందుకు స్పందిలేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. సరిగ్గా పది రోజుల క్రితం కవిత మీడియా సమావేశం ఏర్పాటు చేసి , హరీష్ రావుపై తీవ్ర స్ధాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. కాలేశ్వరంలో అవినీతికి కారణం అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీషన్ రావే., అక్రమంగా డబ్బు సంపాదించకపోతే, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేలకు ఫండింగ్ ఎలా చేశారాంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ ఆరోపణల సమయంలో హరీష్ రావు విదేశాలలో ఉన్నారు. తిరిగి ఇండియా వచ్చిన తరువాత కవిత వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తారని పొలిటికల్ సర్కిల్ లో గట్టి టాక్ నడిచింది. కానీ కవిత చేసిన అవినీతి ఆరోపణలపై హరీష్ రావు ఒక్కమాట మాట్లడలేదు. హరీష్ రావు, ఎంపీ సంతోష్ వల్లనే కేసీఆర్ సిబిఐ విచారణ ఎదుర్కోబోతున్నారని, ఇంకా పార్టీ ఉంటే ఎంత పోతే ఎంత అని మాట్లడితే, తనకేం పట్టనట్లుగా హరీష్ రావు ఎందుకు వ్యవహరించారనేది నేటికీ సమాధానం లేని ప్రశ్నగా మిగిలింది. హరీష్ రావు వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారనే విమర్శలకు హరీష్ రావు నుంచి కౌంటర్ వస్తుందని ఆశించినా ఆ ఊసే లేదు. పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసిన తరువాత రోజు కూడా ఏమాత్రం టార్గెట్ హరీష్ ఎక్కడా గురితప్పలేదు. తాను పార్టీలో ట్రబుల్ షూటర్ కాదు ,



బబుల్ షూటర్ అంటూ రెచ్చిపోయారు కవిత. ఎంపీ సంతోష్ దళితులపై దాడులు చేయించి, లబ్ధిపొంది, నిందలు మాత్రం కేటీఆర్ పై వేశారని సంతోష్ పై చేసిన విమర్శలకు ఎంపీ సంతోష్ నుంచి ఉలుకూ పలుకూ లేదు. ఇలా వీరిద్దరూ మాట్లడలేదు సరే, అన్న కేటీఆర్ స్పందిస్తారని ఊహిస్తే , ఆయన కూడా కవితపై వేటు పార్టీ సమష్టి నిర్ణయం అంటూ ఒక్క ముక్కలో తేల్చేశారు. ఇలా పార్టీలో కేసీఆర్ తరువాత అంతటి చరిస్మా కలిగిన హరీష్ రావును గుక్కతిప్పకుండా అవినీతి అస్త్రాలు సందిస్తే, ఏ ఒక్కరూ కవిత ఆరోపణలను ఖండించడం చేయలేదు. ఇదే విమర్శలు బీఆర్ఎస్ పార్టీలో మరో నేత చేసుంటే, అధికార పార్టీ ఆరోపించి ఉంటే , ఇంత మౌనం ఉండేవారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. హరీష్ రావు అవినీతి చేసారని తన తండ్రికి అనేకసార్లు చెప్పానని కవిత అంటోంది. అలా కూతరు చెప్పినా అల్లుడిని సమర్ధిస్తూ వచ్చారంటే , ఆ అవినీతిలో కేసీఆర్ కు వాటా లేకుండా ఉంటుందా అనే టాక్ పొలిటికల్ సర్కిల్ లో బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే బిఆర్ఎస్‌పై కుటుంబ పార్టీ అనే ముద్ర ఉంది. ఇప్పుడు కవిత ఎపిసోడ్‌లో ఆశించిన స్థాయిలో హరీష్ రావు, ఎంపీ సంతోష్ , కేటీఆర్ స్పందించక పోవడంతో మనం మనం బరంపురం అనే సామెతను గుర్తుచేస్తున్న 0ట్లుందట. అవినీతి అధికారులను ప్రోత్సహించారు, ఎమ్మెల్యేలకు ఫండింగ్ ఇచ్చారు, నా ఓటమికి కుట్ర పన్నారు, రేవంత్ రెడ్డితో కలసి విమానంలో ప్రయాణించినప్పుడే హరీష్ రావు వెన్నుపోటు బయటపడింది, దళితులపై దాడులలో కేటీఆర్‌ను ఇరికించారు, ఇలా అనేక ఆరోపణలు నేటికీ బిఆర్ ఎస్‌ను కవిత రూపంలో వెంటాడుతున్నాయి. కవిత గీత దాటారని వేటు వేశారు సరే, మరి ఈ ప్రశ్నలకు సమధానం చెప్పక్కర్ల లేదా? అలా వదిలేస్తే కొన్నాళ్లకు జనం కూడా లైట్ తీసుకుంటారనే భావనలోకి కేసీఆర్ వెళ్లారా? లేక కవిత వ్యాఖ్యలపై మాట్లడితే కన్న కూతురిని విమర్శించాల్సి వస్తుంది కాబట్టి మౌనం వహిస్తున్నారా అనేది సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలింది. తన తండ్రితో మాట్లడి ఏకంగా 100 రోజులు దాటిందని కవిత మీడియాతో మాట్లడుతూ మనసులో మాట చెప్పేశారు. మరి కవితను వంద రోజుల నుంచి కేసీఆర్ దూరం పెట్టడానికి కారణాలు ఏవనే క్లారిటీ పార్టీ వర్గాలకు సైతం అంతుచిక్కడం లేదట. మొత్తానికి కవిత చేసిన గాయం బీఆర్ ఎస్ ను సమాధానం చెప్పుకోలేని, ప్రశ్నల రూపంలో వెంటాడటమేకాదు, అధికార పార్టీకి సైతం బ్రహ్మాస్త్రంగానే మారనుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# ఖమ్మంలో రోప్‌వే, తీగల వంతెన, రిటైనింగ్ వాల్స్

**ఖమ్మం, సెప్టెంబర్ 11,**

ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. అయితే వేగం పుంజుకోకపోవడానికి కారణం.. భూ సేకరణ సమస్య. ఈ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాకు వచ్చిన తర్వాతనే అక్కడ చుట్టుపక్కల ప్రాంతాల స్థలాలకు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నిర్మాణాలకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు యజమానులు ఒప్పుకోవడం లేదు. ధరలు అధికంగా ఉండటంతో.. ప్రభుత్వానికి స్థలాలు అప్పగించేందుకు నిరాకరిస్తున్నారు. అయితే దీనిపై త్వరలోనే కదలికి వచ్చి.. ప్రాజెక్ట్ పనులు పూర్తి కానున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు ఊపందుకోవడంలో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో నిర్వాసితులను ఒప్పించడం రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తున్నప్పటికీ.. భూసేకరణలో ఎదురయ్యే ప్రతిబంధకాలు వేగాన్ని తగ్గిస్తున్నాయి. ఖమ్మం ఖిల్లాలో రూ.29 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోప్‌వే ప్రాజెక్ట్ మొదటి అడ్డంకిని అధిగమించింది. తొమ్మిది ఇళ్లకు పరిహారం అందించడంతో నిర్మాణం కోసం మార్గం సుగమమైంది. నాలుగు క్యాబిన్ల తయారీ, టవర్ల పనులు వర్క్‌షాప్‌లో జరుగుతున్నాయి. లోయర్, అప్పర్ స్టేషన్లు సిద్ధం చేస్తే 2026 ఆగస్టు నాటికి రోప్‌వే ప్రజలకు అందుబాటులోకి రానుంది. గతేడాది మున్నేరు నది ఉప్పొంగడంతో పరిసర ప్రాంతాలు మునిగిపోయాయి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల రిటైనింగ్ గోడలు నిర్మిస్తోంది. ఇందుకోసం 239 ఎకరాల భూమి అవసరం. ప్రభుత్వ భూమిపై కొంతమేర పనులు పూర్తవగా.. ప్రైవేటు భూమి సేకరణలో ఆటంకం తలెత్తింది. అధికారులు 2026 జూన్ లోగా ఈ పనులు ముగించాలని నిర్ణయించారు. నగర శుద్ధి వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.239 కోట్లతో భూగర్భ మురుగుకాల్వలు మరియు ఎస్టీపీలు నిర్మిస్తున్నారు.

# రాజాసింగ్ కు అర్ధమైనట్టుందే...

హైదరాబాద్, సెప్టెంబర్ 11

బీజేపీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇప్పుడు బీజేపీ చుట్టూ తిరుగుతున్నారు. తాను రాజీనామా చేసినందుకు యూపీ సీఎం ఆదిత్యానాథ్ ఫోన్ చేసి తిట్టారని ఆయన చెబుతున్నారు. హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ హైకమాండ్ నుంచి కొంత మంది తనతో టచ్ లో ఉన్నారని వారు ఎప్పుడు ఆహ్వానిస్తే అప్పుడు బీజేపీలో చేరుతానని ప్రకటించారు. అయితే ఇప్పుడు కూడా ఆయన కిషన్ రెడ్డిపై తీవ్ర విమర్శలుచేస్తున్నారు. పార్టీకి రాజీనామా చేసిందున.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కొంత మంది బీజేపీ నేతలు ఆయనను డిమాండ్ చేస్తున్నారు. దీనిపై రాజాసింగ్ స్పందించారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయబోనని, కిషన్ రెడ్డి ఎంపీ పదవికి రాజీనామా చేస్తే తానూ రాజీనామా చేసి, ఇద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల్లో పోటీ చేసి ఎవరి బలం ఏమిటో నిరూపించుకుందామని సవాల్ విసిరారు. "తెలంగాణలో బీజేపీ నాశనం అయింది కిషన్ రెడ్డి వల్లే. ఆయనే వెనుక ఉండి తనపై తప్పుడు చేయిస్తున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు రబ్బర్ స్టాంప్ లా పని చేస్తు న్నారని ఆరోపించారు. తాజాగా ఆయన ప్రకటించిన రాష్ట్ర కమిటీపై రాజాసింగ్ విమర్శలు గుప్పించారు. ఆ కమిటీ వేసింది ..రామచంద్రరావా..కిషన్ రెడ్డా అని ప్రశ్నించారు. ఈ కమిటీతో తెలంగాణలో బ జేపీ అధికారంలోకి వస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటాన్నారు. "బీజేపీకి ఎవరు



అధ్యక్షుడు అయితే తెలంగాణలో అధికారంలోకి వస్తుందో త్వరలో మరో ప్రెస్ మీట్‌లో చెప్తాను" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడిన ఆయనకు ఆ చాన్స్ దక్కకపోవడం, తనకు నామినేషన్ వేసే చాన్స్ కూడా ఇవ్వలేదని ఆరోపిస్తూ.. పార్టీకి రాజీనామా చేశారు. పదే పదే ఆయన పార్టీని ధిక్కరించి పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్నందున.. ఆయన రాజీనామాను పార్టీ హైకమాండ్ కూడా వెంటనే అంగీకరించింది. దాంతో ఆయన మాజీ బీజేపీ నేత అయ్యారు. అయితే ఆయన వేరే పార్టీల్లో చేరట్లేదు. తనకు బీజేపీ తప్ప మరో పార్టీ సరిపడదని అంటున్నారు. ఆయన ఇప్పటికీ రాష్ట్ర నేతలపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. పార్టీతో సంబందం లేకుండానే ఇలా చేస్తున్న ఆయనకు.. పార్టీలోకి రానిస్తే మరింత రచ్చ చేస్తారని.. ఆయనను పార్టీలోకి ఆహ్వానించేందుకు ఎవరూ సిద్ధపడే అవకాశం లేదు. సైలెంట్ గా ఉండి.. మళ్లీ బీజేపీలో చేరాల్సిన ఆయన.. పదే పదే రాష్ట్ర నేతలపై విమర్శలు చేస్తూ.. బీజేపీలోకి తనకు ఎంట్రీ లేకుండా చేసుకుంటున్నారని బీజేపీ నేతలు

# అసైన్డ్ భూములకు పట్టాలు

కరీంనగర్, సెప్టెంబర్ 11

తెలంగాణలో అసైన్డ్ భూమి అనేది ప్రభుత్వం నిరుపేదలు, భూమిలేని కుటుంబాలు, వెనుకబడిన వర్గాలకు జీవనోపాధి కోసం ఉచితంగా కేటాయించే భూమి. ఈ భూమిని కేటాయించే ప్రధాన ఉద్దేశం పేదలు వ్యవసాయం చేసుకుని జీవనోపాధి పొందడం. వీటిని ముఖ్యంగా భూమి లేని కూలీలకు, పేద రైతులకు, వితంతువులు, వికలాంగులు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారికి కేటాయిస్తారు. ఈ భూములను వేరే వాళ్లకు అమ్మడానికి వీలు లేదు. అయితే చాల కాలంగా ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టా లేక ఇబ్బందులకు గురవుతున్నారు. వారి కోసం ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రకారం పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో అసైన్డ్ భూములు అనేవి ప్రభుత్వం నిరుపేదలు, భూమిలేని రైతులు, కూలీలు, వితంతువులు, వికలాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు జీవనోపాధి కోసం ఉచితంగా కేటాయించే భూములు. ఈ భూములను ఇవ్వడంలో ప్రధాన ఉద్దేశం %-% భూమి లేని కుటుంబాలకు వ్యవసాయ అవకాశాన్ని కల్పించడం, స్వయం సమృద్ధి దిశగా నడిపించడం. 1954 తర్వాత రాష్ట్రంలో అసైన్డ్ భూముల కేటాయింపు చట్టం అమల్లోకి వచ్చింది. ఈ భూములు కేవలం సాగు కోసం మాత్రమే వినియోగించాలి. అమ్మకం, బదిలీ లేదా రియల్ ఎస్టేట్ లావాదేవీలు పూర్తిగా నిషేధం. సాగు చేయని పక్షంలో ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవచ్చు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూభారతి చట్టం అమలు చేసింది. దీని ద్వారా సాగులో ఉన్న రైతులకు శాశ్వత హక్కులు ఇచ్చే ప్రక్రియ మొదలైంది. చాలా కాలంగా సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. దీని ఫలితంగా రైతులు భవిష్యత్తులో భూమి హక్కుల విషయంలో న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోకుండా ఉండే అవకాశం లభించింది. ప్రభుత్వ భూములపై సాగు చేస్తున్నవారిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు , లైసెన్స్‌డ్ సర్వేయర్లు కలిసి పరిశీలన చేపడుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో భూభారతి గ్రామ సభల ద్వారా 3,404 దరఖాస్తులు అందాయి. వీటిలో 662 మంది కొత్త పాసు పుస్తకాలు లేనివారు ఉండగా.. 43 మంది కాస్తులో లేనివారిగా తేలారు. 1,986 మంది భూములు మోకాపై ఉండగా.. ఆధారాలు లేని 1,445 దరఖాస్తులు గుర్తించారు. 360 మంది ఇతరుల నుండి కొనుగోలు చేసిన కేసులు బయటపడ్డాయి. ఈ వివరాలు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలోని కమిటీకి పంపిస్తారు. ఆ తర్వాత తుది పరిశీలన చేపట్టి.. అర్హులైన వారికి పట్టాలు ఇస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పద్ధతులతో డిజిటల్ ట్రాకింగ్, జియో మ్యాపింగ్, బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటోంది. పారదర్శక విధానం ద్వారా అర్హులను ఎంపిక చేసి వారికి పట్టాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది.

## అకడమిక్ లీడర్‌షిప్ బాధ్యతతో కూడిన నిరంతర ప్రయాణం

### ఫ్యాకల్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో వీసీ డా. హెచ్. వినోద్ భట్

చిత్తూరు:చిత్తూరు మురకంబట్టులోని అపోలో నాలెడ్జ్ సిటీలో ఎయిమ్‌సర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్యాకల్టీ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌కు ప్రత్యేక అతిథిగా అపోలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ హాజరై ప్రేరణాత్మక ఉపన్యాసం ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "లీడర్‌షిప్ అంటే కేవలం ఒక పదవి కాదు, అది నిరంతర అభ్యాసంతో నిండిన ప్రయాణం. అకడమిక్ లీడర్‌షిప్ అనేది జనరల్ లీడర్‌షిప్‌తో పోలిస్తే భిన్నమైనది. బోధన, పరిశోధన, పరిపాలనుఈ మూడు రంగాలలోనూ సమన్వయం చేసి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంటుంది. అకడమిక్ లీడర్ వద్ద క్వాలిటీ, కమిట్మెంట్, బాధ్యత అనే మూడు మూలస్తంభాలు ఉండాలి. ఫ్యాకల్టీగా మనం ఒక స్థాయిలో ఆగిపోకుండా, ప్రతి దశలో కొత్త నైపుణ్యాలను సాధించి, తదుపరి స్థాయికి ఎదగాలన్న తపన కలిగి ఉండాలి. అకడమిక్ నాయకులు రెస్పాన్సిబులిటీ, వోనర్ షిప్, జవాబుదారీ తనం వంటి విలువలను ప్రతి రోజూ ఆచరణలో చూపాలని.. పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా అధ్యాపకులు స్ఫూర్తి పొందుతూ, కొత్త ఆలోచనలు, క్రియేటివ్ లెర్నింగ్ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎయిమ్‌సర్ డీన్ డా. ఆల్ఫ్రెడ్ జె. అగస్టిన్, అసోసియేట్ డీన్ డా. రమ్యా రామకృష్ణన్, చెన్నై అపోలో హాస్పిటల్స్ నుంచి వచ్చిన రిసోర్స్ ఫ్యాకల్టీ ప్రొ. రవి మహాజన్, డా. జుగ్నూ మహాజన్ ఎయిమ్‌సర్, ది అపోలో యూనివర్శిటీకి చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

## విష సర్పాల సంచారం నేపథ్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్, ఎస్ఎంఎస్ ప్లాంట్, ఓసి 2 పీవీ కాలనీలో పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టాలి

భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 11

విష సర్పాల సంచారం నేపథ్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్, ఎస్ఎంఎస్ ప్లాంట్, ఓసి 2 పీవీ కాలనీలో పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టాలి, పశువుల కుక్కల కోతుల బెడద తీర్చాలనీ కోరుతూ మణుగూరుకు చెందిన కర్నే బాబురావు గురువారం నాడు ఏరియా ఎస్ ఓ టు జి ఎం బి. శ్రీనివాసచారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్ఎంఎస్ ప్లాంట్ లో ఒక ప్రైవేటు వాహన డ్రైవర్ పాము కాటుకు గురై నరకయాతన అనుభవించాడనీ సకాలంలో మెరుగైన చికిత్స అందటంతో అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుండి బయటపడ్డాడనీ సంతోషం కానీ ఈ సంఘటనతో ఎస్ ఎం ఎస్ ప్లాంట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ మరియు పీవీ కాలనీలో ఓసి- 2 లో కార్మికులు, కాంట్రాక్ట్ వర్కర్లు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బ్లాస్టింగ్ విభాగం ఎస్ ఎం ఎస్ ప్లాంట్, సోలార్ విద్యుత్ ప్లాంట్, పీకే ఓ సి నూతన క్షేత్ర కార్యాలయం పీవీ కాలనీ మణుగూరు ఓసి కార్యాలయం, ఏరియా వర్క్ షాప్, కే పి యు జి తదితర గనులు డిపార్ట్మెంట్లలో వర్షాకాలం కావడంతో చెత్త విపరీతంగా పెరిగి విష సర్పాలతో పాటు దోమలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి కార్మికుల సంక్షేమ రీత్యా పిచ్చి మొక్కలు నరికించాలని పాములకు నిలయంగా మారిన పుట్టలను తొలగించాలని దోమల నివారణకు సింగరేణి శానిటరీ విభాగం ఆధ్వర్యంలో ఫాగింగ్ నిర్వహించాలని, కోతుల కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని మరియు పీవీ కాలనీలో పశువుల సంచారంతో కాలనీ అశుభ్రతతో పాటు దుర్గంధం వెదజల్లుతుంది ముచ్చటపడి కాలనీవాసులు పెంచుకుంటున్న పూల మొక్కలను కూడా పశువులు తినేస్తున్నాయి ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని పరిష్కారం దిశగా యోచన చేయాలని సింగరేణి ఉద్యోగుల తరఫున మరియు కాంట్రాక్ట్ కార్మికుల తరఫున ఏరియా సింగరేణి యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను



1) మణుగూరు ఏరియాలోని అన్ని గనులు డిపార్ట్మెంట్లలో, కాలనీలో విష సర్పాల నివారణకు పిచ్చి మొక్కలు మరియు పుట్టలు తొలగించాలి దోమల నివారణకు పాగింగ్ చేయాలి కోతులు,కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలి.

2) కార్మిక కుటుంబాల్లో అవగాహన కలిగించి పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా చూడాలి

3) కూనవరం, ముత్యాలమ్మ నగర్ పంచాయతీల పాలకవర్గంతో సమన్వయం చేసుకొని పీవీ కాలనీలో పశువుల సంచారాన్ని నివారించాలి. తాను చేసిన విజ్ఞాపన పట్ల ఎస్ ఓటు జిఎం సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని, తెలిపినట్లు బాబురావు మీడియాకు తెలిపారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద పోటు



పెద్దపల్లి , సెప్టెంబర్ 11

పెద్దపల్లి జిల్లాలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద క్రమంగా పెరుగుతుంది. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టు 15 గేట్లెత్తి 1,57,000 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి 25 వేలు క్యూసెక్కులు కడెం ప్రాజెక్టు నుంచి 69774 క్యూసెక్కుల వరద, నది పరివాహక ప్రాంతాల నుంచి 70100 క్యూసెక్కుల వరద నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు తెరిచి 157153 క్యూసెక్కుల నీటిని దిగువనకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీల గాను, ప్రస్తుతం 19.786 టీఎంసీల వరద నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 148 మీటర్ల కాగా ప్రస్తుతం 147.86 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి లక్షా 57 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. గోదావరి పరివాహక ప్రాంతాలలో ఉన్న గ్రామాల ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## నేపాల్ నిరసనలు.. 30కి చేరిన మృతుల సంఖ్య

ఖాట్మాండూ సెప్టెంబర్ 11

నేపాల్ దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో మృతుల సంఖ్య 30కి చేరినట్లు నేపాల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అలాగే 1,033 మంది గాయపడ్డారని, వారిలో 713 మంది చికిత్స తర్వాత డిశ్చార్జ్ అయ్యారని తెలిపింది. ఖాట్మాండూ లోని సివిల్ సర్వీస్ హాస్పిటల్ అత్యధికంగా 436 మంది రోగులకు చికిత్స అందిస్తోందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా 28 ఆసుపత్రులు గాయపడిన వారికి ట్రీట్మెంట్ ఇస్తున్నారు..

సైన్యం రంగంలోకి దిగి కర్ఫ్యూ విధించడంతో అల్లర్లు తగ్గుముఖం పట్టాయి.

================================

## యూరియా కోసం ఎదురుచూపులు

నిర్మల్ సెప్టెంబర్ 11

భైంసా మండలం కామోల్ గ్రామంలో మ్యాక్స్ సొసైటీ వద్ద రైతులు వేకువజామున నుంచి యూరియా కోసం క్యూలైన్లో వేచి వుంటున్నారు. యూరియా కొరతపై మండిపడుతున్నారు. పని వదిలేసి తిండి తిప్పలు లేకుండా యూరియా కోసం క్యూలో అవస్థలు పడుతున్నామని రైతుల ఆవేదన. పంటలకు యూరియా వేయకుంటే పాడవుతాయని దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలనిడిమాండ్ చేస్తున్నారు. .:

==================

## అక్టోబరు 2 నుంచి ఇంటికే కుల ధ్రువీకరణ పత్రం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటికే పత్రాన్ని పంపేలా కసరత్తు చేస్తోంది. కొద్దిరోజులుగా చాలామంది మొబైల్స్‌కు..'మీరు ఇంటిగ్రేటెడ్ ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు.. అది మాకు అందింది. ఈ దరఖాస్తుపై సుమోటో విచారణ జరుగుతోంది.. 25 రోజుల్లోపు ప్రాసెస్ పూర్తవుతుంది.. గవర్నమెంట్ ఏపీ ' అంటూ మెసేజ్‌లు వస్తున్నాయి. అసలు దరఖాస్తు చేయకుండా ధ్రువీకరణ పత్రం ఏంటని కొందరు అవాక్కయ్యారు.. ఆ తర్వాత అసలు విషయం ఏంటో తెలుసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజల కోసం ఈ కొత్త ఆలోచన చేసింది. కుల ధ్రువీకరణ పత్రం కోసం ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. అక్టోబరు 2 నుంచి ఇంటికే కుల ధ్రువీకరణ పత్రం వస్తుంది. చదువు, ఉపకార వేతనాలు, ఉద్యోగం, అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఈ పత్రం ఉపయోగపడుతుంది. గతంలో కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేది. సచివాలయం, రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ అవసరం లేదు. రెవెన్యూ శాఖ ఈ పనిని సులభతరం చేస్తోంది. ఏపీ ప్రభుత్వం కుటుంబాల సర్వేలో వివరాలు సేకరించగా.. వాటి ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన చేస్తున్నారు.

## జగిత్యాలలో కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాజీమంత్రి జీవన్ రెడ్డి

- రాజకీయ ప్రత్యర్థులుగా తలపడ్డ ఇద్దరు
- నేతలది నేడు ఒకే పార్టీ
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కాంగ్రెస్ లో చేరినప్పటి నుంచి గుర్రుగా ఉన్న జీవన్ రెడ్డి
- గత కొంతకాలంగా డైలాగ్ వార్ తో ఎడమోహం పెడమోహంతో ఉన్న సంజయ్, జీవన్ రెడ్డి
- ఇసుక బజార్ ప్రారంభోత్సవంలో కలిసి కరచాలనం చేసుకున్న ఇద్దరు నేతలు

వాళ్ళిద్దరూ రాజకీయ ప్రత్యర్థులు... ప్రస్తుతం ఇద్దరు ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. ఎడమోహం పెడమోహంతో డైలాగ్ వార్ సాగించారు. ఒకరంటే మరొకరికి పడక మాటల తూటాలతో రాజకీయాలను రక్తి కట్టించారు. కానీ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాక్షిగా ఆ ఇద్దరు నేతలు కలుసుకుని కరచాలనం చేసుకున్నారు. అందరి దృష్టిని ఆకర్షించి రాజకీయాల్లో శాశ్వత శత్రువులు శాశ్వత మిత్రులు ఉండరని చాటి చెప్పారు.

వాయిస్

జగిత్యాలలో ఇసుక బజార్ ప్రారంభోత్సవం అరుదైన సన్నివేశానికి వేదికయ్యింది. రాజకీయ ప్రత్యర్థులు కలుసుకుని కరచాలనం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ బిఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. సంజయ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నప్పటినుంచి మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి గుర్రుగా ఉన్నారు. తనకు ఏమాత్రం సమాచారం లేకుండా ఎమ్మెల్యేను కాంగ్రెస్ లో చేర్చుకోవడంపై అలకబూని పార్టీ పెద్దలపై అసహనం వ్యక్తం చేశారు. సందర్భోచితంగా మాటల తూటాలు పేల్చి పార్టీ పెద్దలను ఇరకాటంలో పెట్టారు. గత కొంతకాలంగా డాక్టర్ సంజయ్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ పార్టీ శ్రేణులను అయోమయానికి గురి చేసింది. పార్టీ పెద్దలను సైతం ఇద్దరు మధ్య సయోధ్య లేక ఆందోళనకు గురి చేసింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా కొనసాగిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం ఇద్దరి మధ్య నెలకొన్న రాజకీయ వైరంతో సతమతమయ్యారు. ఇద్దరిని కలిపేందుకు విశ్వప్రయత్నం చేశారు.

వాయిస్

చివరకు జీవన్ రెడ్డి ప్రతిపాదనతో జగిత్యాలలో ఇసుక బజార్ ఏర్పాటు చేసి దాని ప్రారంభోత్సవానికి ఇద్దరి అహ్వానించి అధికారుల సమక్షంలో కలుసుకునే అరుదైన వేదికగా మార్చారు. ముందుగా వచ్చిన జీవన్ రెడ్డి మంత్రి అడ్లూరిని శాలువాతో సన్మానించగా ఎమ్మెల్యే రాకపోవడంతో ఆయన కోసం కాసేపు వెయిట్ చేశారు. ఎమ్మెల్యే వచ్చాక జీవన్ రెడ్డి నమస్కారం చేయగా ఎమ్మెల్యే ప్రతి నమస్కారం చేసి ఇద్దరు కరచాలనం చేసుకుని కులాసాగా ముందుకు సాగారు. మంత్రి సాక్షిగా కలిసిన ఇద్దరు నేతలను చూసి స్థానికులు పార్టీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అనడానికి ఇదే నిదర్శనమని చర్చించుకున్నారు. మాజీమంత్రి జీవన్ రెడ్డి ఎమ్మెల్యే సంజయ్ సహకారంతో ఐక్యంగా జిల్లా అభివృద్ధికి మంత్రిగా కృషి చేస్తానని అడ్లూరు లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

బైట్- అడ్లూరి లక్ష్మణ్ కుమార్ - రాష్ట్ర మంత్రి

వాయిస్

బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్ కాంగ్రెస్ తో అంటగాగుతుండడంతో ఎమ్మెల్యే గా అనర్హుడిగా ప్రకటించాలని బిఆర్ఎస్ ఇప్పటికే న్యాయ పోరాటం చేస్తుంది. ఇటీవల అసెంబ్లీ స్పీకర్ సైతం నోటీస్ జారీ చేయడంతో ఏ పార్టీలో ఉన్నాడో స్పష్టత ఇవ్వని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సతమతమవుతున్న నేపథ్యంలో జీవన్ రెడ్డితో కలిసి కరాచాలనం చేయడం చర్చనీయాంశంగా మారింది.

## కేబుల్ కత్తిరింపులు అపాలి

హైదరాబాద్ , సెప్టెంబర్ 11



ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పొందేందుకు కేబుల్ ఆపరేటర్లుగా జీవితాన్ని ప్రారంభించామని, ప్రభుత్వ చర్యలతో తాము రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని, తమపై కనికరించి అనధికార కత్తిరింపులు ఆపాలని ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు కరుణాకర్రెడ్డి మాట్లాడుతూ రామాంతపూర్లో జరిగిన ఘటనను తమను బాధ్యులను చేయడం సరికాదని, లో లెవల్లో విద్యుత్ వైరు వెళ్లడం వల్ల విద్యుదాఘాతం జరిగిందని, ఆ శాఖపై చర్యలు తీసుకోకుండా ఏ పక్షంగా తమపై కక్షసాధింపులా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఈ కేబుల్ రంగంపై లక్షలాది మంది జీవితాలు ఆధారపడి ఉందని, ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు, జీఎస్టీలు చెల్లిస్తున్నామని, కానీ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కేబుల్ కనెక్షన్లు కట్ చేయడం సరికాదన్నారు. ఇలాంటి చర్యల వల్ల మధ్యతరగతి ఆపరేటర్ల పరిస్థితి ఏమి కావాలని ప్రశ్నించారు. డాట్, ట్రాయ్ వారు 25 ఐఎస్పీ లైసెన్సులు ఇవ్వడం వల్ల కేబుళ్ల సంఖ్య పెరిగిందని, అండర్ గ్రౌండ్ సర్వీసు లేని కారణంగా ఈ పరిస్థితి నెలకొందన్నారు. సింగిల్ ఫైబర్ సిస్టమ్ తీసుకువస్తే దానిని ఆపాదించుకోవడం కోసం సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం నుంచి ప్రతిపాదన వస్తుందని ఎదురుచూస్తున్నామన్నారు. హైదరాబాద్కు అంతర్జాతీయ బ్రాండ్ ఉందని, అనేక మల్టీనేషనల్ సంస్థలు, ఐటీ పరిశ్రమలు ఇంటర్నెట్ సేవలపై ఆధారపడి ఉన్నాయని, అర్థాంతరంగా వాటిని నిలిపివేయడం వల్ల ఆయా రంగాలు తీవ్రంగా నష్టపోవడంతో పాటు అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఉప్పల్ స్టేడియంలో సైతం ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఇలాంటి చర్యల వల్ల పూర్తి స్టేడియానికి ఆ సేవలు నిలిచిపోతుందన్నారు. ఈ వ్యాపారం పూర్తిగా చట్టబద్ధమైందని, కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారమే నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తమతో చర్చలను జరుపాలని, అలా కాకుండా ఏపక్షంగా వ్యవహరిస్తామంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి వెనుకాడమన్నారు.

## గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూమి కేటాయించండి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని కీలక ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. ప్రధానంగా గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటి ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన 98.20 ఎకరాల భూమిని తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి రిక్వెస్ట్ చేశారు. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన భూమిని సేకరించడం, ప్రాజెక్టును సకాలంలో ప్రారంభించేందుకు కీలకమని ఆయన పేర్కొన్నారు.గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణానికి సంబంధించి కీలకమైన సమాచారాన్ని సీఎం రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రికి అందజేశారు. మూసీ, ఈసీ నదుల సంగమం సమీపంలో అతిపెద్ద గాంధీ విగ్రహం ఏర్పాటు ప్రాజెక్టును చేపట్టనున్నట్లు రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు. ఈ గాంధీ సర్కిల్ ఆఫ్ యూనిటీ జాతీయ సమైక్యతకు ప్రతీకగా, గాంధేయ విలువలను ప్రదర్శించే ఒక పటిష్టమైన చిహ్నంగా మారబోతుందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ద్వారా గాంధీ సరోవర్, జాతీయ సమైక్యతను ప్రతిబింబించే, గాంధీ సిద్ధాంతాలకు ఒక చిహ్నంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు తెలిపారు.

## ఆర్థిక కష్టాలున్నా రైతులకు అండగా నిలిచాం

అనంతపురం, సెప్టెంబర్ 10

అధికారంలోకి వచ్చిన కేవలం 15 నెలల వ్యవధిలోనే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేసి చూపించామని కూటమి ప్రభుత్వ నేతలు స్పష్టం చేశారు. అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' బహిరంగ సభలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించారు. చెప్పిన హామీలతో పాటు చెప్పని సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు.ఏ రైతుకూ యూరియా కొరత రాకుండా నేను చూసుకుంటాను. ఎంత యూరియా కావాలో అంతే వాడండి. మనం అడిగిన వెంటనే కేంద్రం యూరియా అందిస్తోంది అని హామీ ఇచ్చారు. ఎన్ని ఆర్థిక కష్టాలున్నా రైతులకు అండగా నిలుస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమిలో మూడు పార్టీల కార్యకర్తల స్పీడ్‌తో సపరిపాలనలో ఏపీ ప్రభుత్వాన్ని అడ్డే లేదన్నారు సీఎం చంద్రబాబు.ప్రజా ప్రయోజనాల కోసం కూటమి సర్కార్ః వవన్ కల్యాణ్అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్ ? సూపర్ హిట్ విజయోత్సవ సభను ఉద్దేశించి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక ప్రసంగం చేశారు. పార్టీలు వేరైనా, ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సూపర్ సిక్స్ హామీలతో ఎన్నికల్లో ఘన విజయం సాధించామన్నారు రాష్ట్రంలో ప్రతీ వ్యక్తికీ రూ. 25 లక్షల ఆరోగ్య భీమా అందించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించామని, రూ. 1005 కోట్లతో పీఎం జన్ మన్ పథకం ద్వారా 625 గిరిజన గ్రామాలను అనుసంధానించి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని పవన్ తెలిపారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో డోలీ మోతలు ఉండవని ఆయన హామీ ఇచ్చారు. రాయలసీమకు ఎప్పుడూ ఒకటే సీజన్ కరవు సీజన్ అని.. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు దక్కేలా చేస్తున్నాం, ఎవరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు చేశామని పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా కూటమి పార్టీలు కలిసి కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు

పెన్షన్ పెంచాం: గోరంట్ల మోహన్ సాయి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచిందని, వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000 నుంచి రూ.15,000కు పెంచిందని బీజేపీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు గోరంట్ల మోహన్ సాయి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారంతో అమరావతితో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆయన అన్నారు.

ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా: కదిరి ఎమ్మెల్యే

ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించాలని నిర్ణయించడం చరిత్రాత్మకమని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 3,000కు పైగా చికిత్సలను 2493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తారని, పాత్రికేయులకు కూడా వర్తింపజేశారని తెలిపారు.

# ఆపద్బాంధవులు జగ్గారెడ్డి దంపతులు

కంటి చూపు కోల్పోయిన విద్యార్థికి రూ 10 లక్షల ఆర్థిక సహాయం



సంగారెడ్డి,(భారత శక్తి ) సెప్టెంబర్ 11 : కర్ణాటకకు చెందిన కిషన్ పవార్, శాంతాబాయి దంపతులు 15ఏళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా కందికి వచ్చి స్థిరపడ్డారు. వీరి చిన్న కుమారుడు సంపూరన్ నాయక్ (బీకాం విద్యార్థి) ఏడాది క్రితం బైక్ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలపాలై, కంటి చూపు కోల్పోయాడు. కంటి నుంచి బ్రెయిన్‌కు వెళ్లే నరం దెబ్బతినడం వల్ల చూపు కోల్పోయిన సంపూరన్, ఒక నెలపాటు కోమాలో ఉండాల్సి వచ్చింది.ఆప్టిక్ హైడ్రోపి వ్యాధితో బాధపడుతున్న సంపూరన్ చికిత్స కోసం ఇప్పటి వరకు తల్లిదండ్రులు ఐదు లక్షల ఖర్చు చేశారు ఇంకా అవసరమైన చికిత్సలకు సుమారు రూ.8 లక్షలు కావాలని వైద్యులు సూచించారు. ఆక్యుపంక్చర్, స్టెమ్ సెల్ రిజనరేషన్ చికిత్సలను ఒకేసారి చేస్తే చూపు తిరిగి వచ్చే అవకాశం ఉందని వైద్యులు తేల్చారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చేయించలేక తల్లిదండ్రులు ఆవేదనతో జగ్గారెడ్డి దంపతులను ఆశ్రయించారు. సంపూరన్ దయనీయ పరిస్థితిని గమనించిన జగ్గారెడ్డి దంపతులు హృదయపూర్వకంగా స్పందించి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు.చికిత్స విజయవంతం కావాలని ఆకాంక్షించిన జగ్గారెడ్డి దంపతులు, ఇలాంటి పేషెంట్ల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా కూడా సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనారోగ్యం బారిన పడిన సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు వ్యక్తిగతంగానే కాక ప్రభుత్వ పంథాలోనూ సహాయం అందించే ప్రయత్నం చేస్తున్నానని, ముఖ్యంగా క్యాన్సర్ రోగుల పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నానని ఈ సందర్భంగా జగ్గారెడ్డి తెలిపారు.

# నిర్మల్ పోలీసింగ్ లో మహిళా మైలురాయి ?

బ్లూ కోర్టు, డయల్ 100 కి సత్వర ప్రతి స్పందన

-- గురువారం కూడా మరింత ప్రభావవంతంగా కొనసాగిన నారిశక్తి కార్యక్రమం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)సెప్టెంబర్ 11 : ఎస్పీ డా. జి. జానకి షర్మిల నాయకత్వంలో ప్రతీ వారం లాగే ఈ వారం కూడా నారిశక్తి కార్యక్రమం మరింత ప్రభావవంతంగా కొనసాగింది.

నిర్మల్ పోలీస్ శాఖ చేపడుతున్న ప్రతి బుధవారం నారిశక్తి కార్యక్రమంలో భాగంగా, ఈ వారం కూడా మహిళా పోలీస్ సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో పెట్రోలింగ్ డ్యూటీ తో పాటు వచ్చిన డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితుల సమస్యలను పరిష్కరించారు.

వీటితో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి, గ్రామాల్లో ఉన్న పాఠశాలలను సందర్శించి పిల్లలకు ×సైబర్ నేరాల× గురించి అవగాహన కల్పించారు.మరియు ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే దుష్పరిణామాలు, మద్యం తాగి వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం వల్ల సంభవించే ప్రమాదాల గురించి వివరించారు.

విలేజ్ పోలీసింగ్ లో భాగంగా మహిళా సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ పరిధి లోని ప్రతీ గ్రామాల్లో తిరుగుతూ కల్తీ కల్లు, గంజాయి వాడకం, అక్రమ రవాణా పై ప్రజలకు చైతన్యం కల్పించారు.

అనంతరం నారిశక్తులు వాహన తనిఖీలు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

ఈ నారి శక్తి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల మహిళా సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భూబకాసురుల ను పుట్టించేది అవినీతి అధికారులే..!

- కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమి హాం ఫట్.!
- అక్రమంగా బోరు, ట్రాన్స్ఫార్మర్ బిగింపు
- ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఉక్కు పాదం మోపాలి



పోరుమామిళ్ల,(భారత శక్తి). సెప్టెంబర్ 11: పోరుమామిల్ల మండలంలోని రంగసముద్రం పంచాయితీ, నర్సింగపల్లి గ్రామం సర్వే నెంబర్ 622 లో కోట్ల రూపాయలు విలువ చేసే 34 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన ఇండ్ల పెద్ద సుబ్బారెడ్డి (ఐపి సుబ్బారెడ్డి) అనే వ్యక్తి కబ్జా చేయడం జరిగింది. ఈ ప్రభుత్వ భూమి, కడప నుంచి అమరావతికి వెళ్లే ప్రధాన జాతీయ రహదారి ప్రక్కనే పోరుమామిళ్ల తహసీల్దార్ కార్యాలయానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తహసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, విఆర్ఓ లు నిత్యం ఈ దారిలో తిరుగుతూనే వుంటారు. ప్రభుత్వ స్థలమని, కబ్జాకు గురైందని తెలిసినా అటువైపు తలతిప్పి చూడరు. ఎందుకంటే చెడు చూడకు, వినకు, మాట్లాడకు అని బాల్యంలో నేర్చుకొని వుంటారు కదా!అది నూటికి నూరు శాతం పాటిస్తున్నారు కాబోలు. నన్నెవడు అడుగుతాడు, ఎవరేమి చేస్తారు అన్న ధీమాతో సుబ్బారెడ్డి గోడలు లేపాడు, ఇంకా మిగిలి వున్న స్థలంలో పిల్లర్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. అక్రమంగా బోరు వేశాడు, కరెంట్ ట్రాన్స్ఫారం బిగించుకున్నాడు, డబ్బులు పెట్టి కొని రిజిస్టర్ చేయించుకున్నట్లు చుట్టూ అందంగా పెన్సింగ్ కూడా ఏర్పాటు చేసుకున్నాడు. కాలుమీద కాలు వేసుకొని కూర్చుని నిర్మాణాలు పర్యవేక్షిస్తు టాడు ఈ భూబకాసురుడు. విలేకరులు వెళ్లి ప్రశ్నిస్తే మండలమంతా వందల, వందల ఎకరాలు దొబ్బేస్తున్నారు వాళ్ళను వదిలేసి నా దగ్గరకు వచ్చి మాట్లాడుతున్నారా..! మీతో ఏమవుతుంది, మీఇష్టం వచ్చినట్లు, మీ చేతనైంది చేసుకోపోండి అని ఐపి సుబ్బారెడ్డి విర్రవీగడం జరిగింది. ఇంత జరుగుతున్నా రెవిన్యూ వాళ్ల కళ్లు మాత్రం అక్కడకుపోక పోవడం దురదృష్టకరం, ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం. రెండు నెలల క్రితం ప్రభుత్వ స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారు అని ప్రజలు సమాచారం ఇస్తే ఆర్ఐ నామకేవాస్తే వచ్చి వెళ్లాడని, మళ్ళీ ఈ ప్రాంతంలో కనపడలేదని చెబుతున్నారు. ఇదీ రెవెన్యూ అధికారుల నిర్వాకం అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్కా సమాచారంతో రెండు రోజుల క్రితం విలేఖరులు కూడా పిర్యాదు చేస్తే పాత పద్దతిలోని వారి అలవాటు ప్రకారం అటుపోయి ఇటు వచ్చారు. ప్రభుత్వ స్థలం కబ్జా అయింది, నిర్మాణాలు చేపడుతున్నారు అని ఎవరయినా పిర్యాదులు చేస్తే మొక్కుబడిగా అటు వెళ్లి ఇటు వస్తున్నారు తప్ప కేసులు పెట్టరు, స్థలాల్లో బోర్డులు పెట్టరు, ఎలాంటి చర్యలు తీసుకోరు. ఏందిసార్ అటుపోయి ఇటు వచ్చారు అని ఆర్ఐ సుధాకర్ రెడ్డిని అడుగగా... అక్కడ అతనిది కూడా కొంత స్థలం వుంది, సర్వేయర్ ను పంపించి కొలతలు వేసి బోర్డు పెడతాంలే అంటున్నారు తప్ప క్రిమినల్ చర్యలు తీసుకుంటాం, ప్రభుత్వ భూముల్ని కాపాడతాం అని మాత్రం చెప్పడంలేదు. భూబకాసురులను పుట్టించేది, పోషించేది అవినీతి రెవిన్యూ అధికారులే అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఎవరు కబ్జా చేసినా వెంటనే స్వాధీనం చేసుకొని క్రిమినల్ చర్యలు చేపట్టాలని, అవినీతి అధికారులపై కూడా ఉక్కు పాదం మోపాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# గ్రూప్ వన్ రద్దుకు నిరసన వ్యక్తం చేసిన బి ఆర్ ఎస్ వి నాయకులు



సంగారెడ్డి,(భారతశక్తి ప్రతినిధి)సెప్టెంబర్11 : గ్రూప్ వన్ పరీక్ష నిర్వహణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ విఫలమైనందున నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని సంగారెడ్డి బి ఆర్ ఎస్ వి నియోజకవర్గ అధ్యక్షులు పెద్దగొల్ల శ్రీహరి,కో ఆర్డినేటర్ రాజేందర్ నాయక్ డిమాండ్ చేశారు.రాష్ట్ర బి ఆర్ ఎస్ వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ పిలుపు మేరకు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ వి జిల్లా నియోజకవర్గ అధ్యక్షులు పెద్దగొల్ల శ్రీహరి , కో ఆర్డినేటర్ రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ టిజిఎస్పిసి చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అభ్యర్థులకు 28 కేంద్రాల్లో సెంటర్లు కేటాయించగా కోటి ఉమెన్స్ కాలేజీలో మహిళ అభ్యర్థులకి ప్రతేకంగా రెండు సెంటర్లలో 71 మంది ఎంపికయ్యారు. మిగిలిన 26 సెంటర్లో 139 మంది ఎంపికయ్యారు.ఇది ఎలా సాధ్యం అని ప్రశ్నించారు. 563 ఉద్యోగాలలో కేవలం 9 శాతం మంది మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నట్లు టీజీపీఎస్సీ షీల్డ్ కవర్లో పేర్కొంది.ఇంగ్లీష్ లో 12,381 మంది పరీక్ష రాస్తే 508 మంది ఎంపికయ్యారు, తెలుగు లో 8,694 మంది పరీక్ష రాస్తే కేవలం 56 మంది మాత్రమే ఎంపికయ్యారు. దీనివల్ల తెలుగు మీడియం చదివిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. అభ్యర్థులు రీ కౌంటింగ్ అప్లికేషన్ చేసుకుంటే వాళ్లకు మార్కులు తగ్గాయి..నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న పబ్లిక్ కమిషన్..2 హాల్టికెట్స్ గతంలో 2011 ఇచ్చినం అని హైకోర్ట్ కి తెలిపిన కమిషన్ ఆ రోజు సమాఖ్య రాష్ట్రంలో నాటి కమిషన్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్యాయం జరిగింది అని పోరాడినం ,ఇప్పుడున్న కమిషన్ అదే విధానాన్ని అనుసరించటం వల్ల గ్రూప్ 1 అభ్యర్థులకు అన్యాయం జరిగిందని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం పట్టింపులకు పోకుండా హైకోర్ట్ డివిజన్ బెంచికి మరియు సుప్రీంకోర్టు కి వెళ్లవద్దని అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బిసీలకు రిజర్వేషన్ అమలుపట్ల హర్షం తెలిపిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు శెట్టి రంగారావు



ఖమ్మం బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 11: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఆమోదం చేయడం పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు హర్షం వ్యక్తం చేసారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు అవుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి ఒక ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మరియు రాష్ట్ర మంత్రివర్గానికి మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు శెట్టి రంగారావు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న కాలంలో బిసీ లందరు ఐక్యంగా వుండి ఈ రిజర్వేషన్ లను ఉపయోగించుకోవాలని కోరారు. బీసీలు రాజకీయంగా చైతన్యవంతమైన వారని వారికి అవకాశం రావడం ఎంతో మేలు చేస్తుంది అన్నారు.

## కామారెడ్డి పట్టణంలో ఈ నెల 15 న నిర్వహించే

# సభను విజయవంతం చేయాలి : మంత్రి సీతక్క



కామారెడ్డిజిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 11: ప్రజా పాలనలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటూ బిసి డిక్లరేషన్ అమలు చేస్తూకామారెడ్డిలో నిర్వహిస్తున్న బీసీ బహిరంగ సభను విజయవంతం చేయాలంటూ బీబీపేట్, దోమకొండ, బిక్నూర్ ,మండల కేంద్రాలలో ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.

ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ, ఈరోజు అధికారంలో ఉన్నామంటే కార్యకర్తల పది సంవత్సరాల పోరాటం, వారి కష్ట ఫలితమేఎన్నికల్లో ప్రజలకు ఏవైతే వాగ్దానాలు ఇచ్చాము అవి నెరవేరుస్తున్నాం, బీసీ డిక్లరేషన్ డ్రాఫ్ట్ మా నివాసంలోనే జరిగింది. కామారెడ్డి పట్టణంలోనే డిక్లేర్ చేశారు అమలు విజయోత్సవ సభ కూడా కామారెడ్డిలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది.ఈ సభను కనివిని ఎరగని రీతిలో విజయవంతం చేసి బిజెపి ప్రభుత్వానికి కనువిప్పు చేయాలి

రాహుల్ గాంధీ 4,వేల కి.మీ ,పైగా పాదయాత్ర చేసి దేశవ్యాప్తంగా ప్రజల మనసులను అర్థం చేసుకుని, తెలంగాణ ప్రజలకు కావలసిన పథకాలను రూపొందించి అందిస్తున్నారు

వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడం లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది

కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్

తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొంది

పార్లమెంట్ లో ఆమోదింప చేయడానికి ఢిల్లీలో ధర్నా చేసాం, బిజెపి అసలు రంగు బయట పెట్టాం

అణగారిన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుపేదల ఓటు హక్కును తొలగిస్తోందని, దేశ సంపదను అంబానీ, అదానీ వంటి ఉన్నత వర్గాలకు దోచిపెడుతోందని విమర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలో ఈ నెల 15 న నిర్వహించే సభ కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలి, బీసీ బిల్లు తీర్మానం చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా ముందుకు వెళ్తున్నామన్నారు. సభను విజయవంతం చేయడానికి లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు.

నీతి, నిజాయితీతో, నిబద్ధతతో బీసీ రిజర్వేషన్ అమలు చేస్తున్నామని, రాష్ట్రం పంపిన బిల్లును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకుంటూ రాజకీయం చేస్తుందన్నారు. కులగణనలలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొనలేదన్నారు. సోషల్ ఇంజనీర్, సోషల్ జస్టిస్ జరగాలని బీసీలకు పదవుల పంపకం చేశామని, బీసీలంతా కంకనబద్ధులై సభకు తరలిరావాలని కోరారు.

కేటీఆర్ సోషల్ మీడియాను అడ్డంగా చేసుకొని అబద్దాలు ప్రచారం చేస్తూప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చూస్తున్నాడు,వాళు అధికారంలో ఉన్నప్పుడు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు, పేదలకు ఇల్లు ఇవ్వలేదు, రుణమాఫీ చేయలేదు, ద్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వలేదు.

ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయాలని, ఎన్నెన్నో కొత్త పథకాలు తీసుకువస్తూ మహిళా క్యాంటీన్లు మహిళలకు బస్సులు, పెట్రోల్ బంకులు, ఇలా అనేకమైన పథకాలు తీసుకువచ్చి వారిని ప్రోత్సహిస్తున్నాం,ఇల్లు లేని పేదలకు ఇండ్లు ఇస్తున్నాం, ఉచిత కరెంట్ అందిస్తున్న, 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం, మహిళలకు ఫ్రీ బస్ పథకాన్ని అమలు చేస్తున్నాం, ఒకేసారి 9,000 కోట్ల రూపాయలతో రైతులకు రైతు భరోసా అందించాం,

50,000 మంది ఉద్యోగాలు ఇచ్చాం, యూరియా అందించే బాధ్యత కేంద్రానిది మేము కూడా చాలా ప్రయత్నాలు చేస్తున్నాం, ఎలాంటి కొరత పడకుండా రైతులకు సరిపడా యూరియాను అందిస్తున్నాం.అందరు సోషల్ మీడియా వేదికగా యూరియా కొరత సృష్టిస్తున్నారు అన్నారు.కొందరు కులం పేరుతో రాజకీయాలు చేస్తూ మన మధ్య గొడవలు సృష్టిస్తున్నారు.దేవుడు గుడిలో ఉండాలి మతం భక్తి గుండెల్లో ఉండాలి.

# హింస,వెట్టిచాకిరి అణచివేత నుంచి పుట్టిన చైతన్యమే .. తెలంగాణ సాయుధ పోరాటం



ఖమ్మం ప్రతినిధి,(భారత శక్తి )సెప్టెంబర్ 11: హింస,వెట్టిచాకిరి అణచివేత నుంచి పుట్టిన చైతన్యమే తెలంగాణ సాయుధ పోరాటం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు అన్నారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు మధిర మండల పరిధి తొండల గోపవరం గ్రామంలోని రైతాంగ సాయుధ పోరాట యోధులు నల్లమల గిరిప్రసాద్ స్మారక వద్ద గురువారం ప్రారంభమయ్యాయి.ముందుగా సిపిఐ నేతలు గిరి ప్రసాద్ స్థూపానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.వారోత్సవాలకు సూచికగా అరుణ పతాకాన్ని బెజవాడ రవిబాబు ఆవిష్కరించారు.అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఏ రహీం, మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో బెజవాడ రవి బాబు మాట్లాడుతూ,రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర గొప్పదని,భూమి,భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం తమ ప్రాణాలు అర్పించి పోరాటం కొనసాగించారని అన్నారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గార్ల,బయ్యారం, ఇల్లెందు ప్రాంతాల్లో నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయని దీంతో రజాకార్ల తూటాలకు 50 మంది దాకా బలయ్యారని వారి మృతదేహాలను గ్రామాల్లో ఊరేగించి పైశాచికానందం పొందారని తెలిపారు.మధిర నియోజకవర్గంలో ప్రతి ఊరు నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం చేసిందని మధిర పక్కనుండే అల్లీనగరం గ్రామస్తులు రజాకార్లను తరిమి తరిమి కొట్టారని తర్వాత..మరింత సేనలతో వచ్చి..ఇళ్లు తగలబెట్టి.. గ్రామంలో విధ్వంసం సృష్టించారని తెలిపారు.గోవిందపురంలోఇలాంటి ఘటనే జరిగిందని తెలిపారు.రజాకార్ల అరాచకాలతో చితికిపోయిన బతుకులన్నీ కమ్యూనిస్టు నాయకుల పిలుపుతో బంధుకులు పట్టి ముందుకు కదిలాయి పలుగు,పారా,కారం,రోకలి బరిసెలు ఇలా ఏది దొరికితే అది పట్టుకొని ఆడ మగ అనే తేడా లేకుండా అంతా సాయుధులై ముందుకు కదిలి,నిజాం పోలీసులకు రాజాకారులకు కమ్యూనిస్టులు చమటలు పట్టించారని తెలిపారు.ఈ పోరాటంలో మధిర ప్రాంతం నుండి నల్లమల గిరి ప్రసాద్,వాసిరెడ్డి వెంకటపతి ఇంకా అనేక మంది నేతలు రజాకారులను తరిమి కొట్టారని తెలిపారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా ఈ ప్రాంతంలో 10లక్షల భూములను పేదవారికి పంచినట్లు గుర్తుచేశారు.

నాలుగు వేల మంది అమరవీరుల బలిదానంతో స్వరాజ్యాన్ని సాధించారని అన్నారు.రైతంగ సాయిధ పోరాట స్ఫూర్తితో ప్రజా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు,సిపిఐ సీనియర్ నాయకులు మంగళగిరి రామాంజనేయులు, చెరుకూరి వెంకటేశ్వర్లు,మడుపల్లి లక్ష్మణ్,తలారి రమేష్,కొండూరి నాగేశ్వరావు,రంగు నాగ కృష్ణ,పరుచూరి రాము, జిల్లా బ్రమ్మం,గోపి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపులి జాడ ఏమాయే

## అటవీశాఖఅధికారులు నిఘాలోనే ఉన్నారా..?



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(భారత శక్తి) : ములుగు జిల్లా పరిసరాల్లో గత కొద్దికాలంగా పెద్దపులి సంచరిస్తుంటే అటవీశాఖ అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పడం తప్ప పెద్దపులి జాడ తెలుసుకోలేకపోయారని అసలుఅటవీశాఖ అధికారులు పెద్దపులి నిఘాలో ఉన్నారా? అనే అనుమానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని వివిధ పరిసరాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్టు పాదముద్రలనుస్థానికులు గుర్తిస్తున్నారు. జిల్లాలోపెద్దపులి మళ్లీ సంచరిస్తూ ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని రోజులుగా పులి చలనం పలు గ్రామాల్లో కనిపించడంతో రైతులు పొలం పనులు చేసుకోవడానికి భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం పత్తిపల్లి గ్రామ శివారు పొలాల్లో పులి పాదముద్రలు గుర్తించిన గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న రేంజర్ డోలి శంకర్ పులి అడుగుజాడలను పరిశీలించి పత్తిపల్లి, చిన్న గుంటూరుపల్లి పరిసరాల్లో పులి సంచరిస్తోందని నిర్ధారించారు. స్థానికులు పులికి హాని తలపెట్టవద్దని, ఎలాంటి కదలికలు గమనించిన వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు.ఇప్పటికే పులి పాకాల రిజర్వ్ ఫారెస్ట్ నుండి పత్తిపల్లి ఎదల చెరువు, బుగ్గ చెరువు దాకా తిరుగుతూ కనిపించిందని గ్రామస్తులు చెబుతున్నారు. తరువాతి రోజుల్లో పులి పులిగుండం, జాకారం, సింగరకుంటపల్లి, తామరచెరువు మీదుగా నర్సాపూర్ పొలాలకు చేరిందని పాదముద్రలు ఆధారంగా అంచనా వేశారు. అటవీశాఖ ములుగు రేంజ్ అధికారి డోలి శంకర్ ఆధ్వర్యంలో బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బందితో 20 మంది ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి పులి కదలికలపై నిఘా పెంచినట్లు సమాచారం. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేస్తున్నట్ల లేదా అని రైతులు వ్యక్తం చేస్తున్నారు. పెద్దపులి రామప్ప చెరువు మీదుగా వానలగుట్ట చేరినట్టు అధికారులు గుర్తించారు. అక్కడ గాండ్రింపులు వినిపించడంతో పశువులు భయంతో గ్రామాల వైపు పరుగులు పెట్టాయని పశువుల కాపరులు తెలిపారు.ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పులి కదలికలను ట్రాప్ కెమెరాలు, మానవ వనరుల ద్వారా నిఘాలో ఉంచామని అధికారులు వెల్లడించారు. పులి రక్షణతో పాటు ప్రజల భద్రతకూ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పులి సహజ వాతావరణంలోనే సంచరిస్తోందని, దానికి ఎటువంటి హాని జరగకుండా చూడటం తమ బాధ్యత అని, ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా కదలిక గమనించిన వెంటనే తమకు సమాచారంఇవ్వాలనీ, ప్రత్యేక బృందంగా ఏర్పడిఎప్పటికప్పుడు పులి సంచారాన్ని గమనిస్తున్నామని ఎఫ్ ఆర్ వో డోలి శంకర్ తెలిపారు.

# వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీ సద్వినియోగం చేసుకోండి

### టీయూడబ్ల్యూజే (ఐజేయు) నిర్మల్ జిల్లా కమిటీ.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 11: వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీకి సంబంధించి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లెటర్ ఇవ్వడం జరిగింది.ముఖ్య గమనిక :- యూట్యూబ్ ఛానల్స్, డిజిటల్ పేపర్స్ వల్ల ప్రైవేటు స్కూల్స్ కూడా ఇబ్బంది పడుతున్నారని డిఇవో దృష్టికి ప్రైవేటు స్కూల్స్ యజమాన్యం తీసుకురావడం జరిగింది.

ఆర్ ఎన్ ఐ సర్టిఫికెట్ కు చెందిన పత్రికలకు మాత్రమే 100% రాయితీ కల్పించడం జరుగుతుంది. మీరు కూడా మీ మండలాలకు సంబంధించిన అధికారులు కానీ ప్రైవేటు స్కూల్స్ యజమాన్యం అడిగితే యూట్యూబ్, డిజిటల్ మీడియా,ఈ 100% వర్తించదు.వారితో అసలైన వర్కింగ్ జర్నలిస్టులకు 100% అమలు కావడం లేదనేది మన దృష్టికి వచ్చింది. దీనిపై డిఇఓ, ఎంఈఓ లతో మాట్లాడడం జరిగింది, అన్ని స్కూళ్లలో అమలు చేసేందుకు డిఇవో చొరవ తీసుకోవడం జరుగుతుంది.

టీయూడబ్ల్యూజే (ఐజేయు) నిర్మల్ జిల్లా కమిటీ.

# గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు మళ్ళీ నిర్వహించండి



వేములవాడ, సెప్టెంబర్ 11 (భారత శక్తి) : గ్రూప్ 1మెయిన్ పరీక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా హైకోర్టు ఆదేశాలను పాటిస్తూ మళ్ళీ నిర్వహించాలని వేములవాడ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే విద్యార్థుల గొంతు కోసినట్లేనని,వేలమంది నిరుద్యోగులకు తీరని నష్టం కలిగించిందని, విద్యార్థులు రాత్రనక పగలనక కష్టపడి చదివి మంచి ఉద్యోగం సాధించాలని తపన నీరుగారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావున కాంగ్రెస్ ప్రభుత్వం తమ తప్పును ఒప్పుకుని పరీక్షను రద్దు చేయాలని ఆయన అన్నారు. అలాగే గ్రూప్ 1 పోస్టుల్లో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులను బయటపెట్టాలని ఆయన కోరారు.


# ప్రభుత్వ జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఐఈఓ పరశురాం నాయక్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 11: ప్రభుత్వ జూనియర్ కళాశాల ను జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి పరశురాం నాయక్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో కళాశాల కార్యకలాపాలను, తరగతుల నిర్వహణను మరియు హాజరును సమీక్షించారు. డీఐఈఓ పరశురాం నాయక్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఇలాంటి ఆకస్మిక తనిఖీలు అవసరమని, విద్యార్థుల భవిష్యత్ కు ప్రాధాన్యతనిస్తూ క్రమశిక్షణతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివరంజని, అధ్యాపకులు భూషణ్ పాండే, బాలానంద్, సందీప్ కులకర్ణి, సతీష్, లావణ్య, హరి ప్రసాద్, సంతోష్ కుమార్, రజనీ కాంత్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది కూడా తనిఖీ కార్యక్రమంలో చురుకుగా భాగస్వామ్యం కలిగారు.

# పులకించే గీతాలతో మనసులను మరిపించిన మరుపురాని మన(సు)కవి ఆత్రేయ

## నేడు ఆత్రేయ వర్ధంతి



పులకించని మది పులకించు వినిపించని కథ వినిపించు కనిపించని ఆశల విందు మనసుని మరిపించు గానం మనసుని మరిపించు.. అంటూ, పదాల మీద స్వారీ చేశాడు ఆయన.

ఈ జీవన తరంగాలలో ఆ దేవుని చదరంగంలో ఎవరికి ఎవరూ సొంతము ఎంతవరకీ బంధము..? అని ప్రశ్నించాడు ఆయన.

పాడుతా తీయగా చల్లగా పసిపాపలా నిదురపో తల్లిగా.. అంటూ మనసులను తల్లిలా జో కొట్టాడు. లక్షలాదిగా ప్రేక్షకులను మురిపించాడు ఆయన.

ఇలాంటి అద్భుతమైన పాటలకు ప్రాణం పోసిన మన(సు)కవి ఆత్రేయ.

మనసు గతి ఇంతే మనిషి బ్రతుకు ఇంతే మనసున్న మనిషికి సుఖము లేదంతే! అంటూ... ఆయన కలం నుంచి ఎన్నో ఆణిముత్యాలు జాలువారాయి. అల్పాక్షరాలలో అనల్పమైన భావాన్ని పండించడమే కవిత్వం యొక్క ఉద్దేశ్యము అని లాక్షణికులు అన్నట్లుగా ఆత్రేయ

తక్కువ మాటలతో ఎక్కువ భావాలను పలికించడంలో దిట్ట. ఆయన పాటలు తెలుగు సినిమాలు కొత్త పుంతలు తొక్కించాయి. ప్రేక్షకుణ్ణి సినిమాలో మమేకమయ్యేలా చేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఆచార్య ఆత్రేయగా సినీ రంగ ప్రవేశం చేసినవారు శ్రీకిళాంబి వేంకట నరసింహా చార్యులు .

**నాటక రంగాన్ని గొప్ప మలుపు తిప్పిన ప్రయోగ శీలి**

ఆచార్య ఆత్రేయ 1921 వ సంవత్సరము మే 7 వ తేదీన నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట మండలం మంగళం పాడు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సీతమ్మ కృష్ణమాచార్యులు. భార్య పద్మావతి ఆత్రేయ బాణం అనే యువతి ప్రేమలో పడి తర్వాత పద్మావతిని పెళ్లాడినారు. ఆ ప్రేమ విఫలమే కావచ్చు ఆయన్ను ఒక కవిగా మలుపు తిప్పింది. ఆ విషాదమే కావచ్చు అమృతతుల్యమైన సాహిత్యాన్ని అంకురార్పణ చేసింది. ప్రేమ మనసులతో ఎలా ఆడుకుంటుందో తెలియడం వల్లే కావచ్చు ఆత్రేయ అన్నేసి తత్వాలను అవపోసన పట్టగలిగారు. మనసును వీణలా మీటి రాగాలెన్నో పండించారు. అంతులేని సాహిత్యాన్ని గీతాల్లో ఒలికించారు. దాదాపుగా 400 సినిమాలకు మాటలు, పాటలు రాసిన గొప్ప కవి. ఆత్రేయకి ప్రముఖ నటుడు కళా వాచస్పతి కొంగర జగ్గయ్య ఆప్తమిత్రుడు. ఆత్రేయ రాసిన పాటలు, నాటకాలు, నాటికలు, కథలు తదితర రచనలన్నీ ఏడు సంపుటాలలో సమగ్రంగా ప్రచు రించి జగ్గయ్య తన మిత్రుడికి ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య ఆత్రేయ తెలుగు సినిమా గేయ రచయితగా, సంభాషణాకర్తగా పేరు పొందినప్పటికీ నాటక రచయితగా ఆయన స్థానం సుస్థిరమైనదనే చెప్పక తప్పదు. మనసు కవిగా సినిమా వారు పిలుచుకునే ఆత్రేయ. నాటకాల్లో చక్కని ప్రయోగాలెన్నో చేసి నాటక రాంగాన్ని గొప్ప మలుపు తిప్పిన ప్రయోగ శీలి.

**కలానికి సిరా బదులు మనసు తడిని వాడిన మనసు కవి**

పాడమని నన్ను అడగవలనా పరవశించి పాడనా.. అని ఎంతో తేలిగ్గా పాటైతే రాశారు గాని ఆత్రేయ రాయడం అంటే అంత సులభంగా అయ్యే పని కాదు అదో పెద్ద కలం కార్యం. భువి నుంచి దివికి దేవతలు దిగి రావాలి. ఆయన మనసు పులకించాలి. తర్వాతనే ఆయన రాయాలి అన్నంత చందంగా ఉంటుంది. ఆయన పాటలు రాసే విధానం. అందుకే రాయడానికి ముందు నిర్మాతలను రాసిన తర్వాత ప్రేక్షకులను ఏడిపిస్తుంటార ని అంటారు ఆయన గురించి బాగా తెలిసిన వారు. కలానికి సిరా బదులు మనసు తడి వాడి రాస్తారాయన. అందుకే అంత ఆలస్యం అని చెబుతారు. అందుకే ఆయన ఆత్రేయ అయ్యారు. ఆచార్య ఆత్రేయ గా తెలుగు సినీ ప్రేక్షకుల మదిలో చిరస్మరణీయులయ్యారు. తెలుగు సినీ చరిత్రలో ఎంతోమంది కవులు ఉన్నప్పటికీ ఆయన మాత్రమే మనసు కవిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాసిన పాటలు "మనసు చేత మనసు కొరకు మనసే రాసిన పాటల్లా ఉంటాయి." అందుకే మనసు కవిగా మన సుకవిగా చిరస్థాయిగా నిలిచిపోయా రాయన. ఆయన పాటల ప్రస్థానం..పోరా బాబు పో..! అంటూ, దీక్ష చిత్రంలో మొదలై ప్రేమ యుద్ధం చిత్రంలో రాసిన "మువ్వల గానం" వరకు సాగింది. సుమారు రెండు వేల పాటలు వేటికవే ప్రత్యేకాలు. ప్రతి దానిలో సమ్మోహన మంత్రం ఏదో ప్రయోగించి రాసినట్టు ఉంటాయి.

**నవరసాలను పాటలలో రంగరించిన మహాకవి**

కేవలం విరహ గీతాలే కాకుండా తన కలం లోంచి ఒక్కో పాట ఒక్కో వైవిధ్యంగా వ్రాసుకొచ్చారు ఆత్రేయ. "భారత మాతకు జేజేలు బంగరు భూమికి జేజేలు" అనే పాట అలాంటిది బడిపంతులు చిత్రంలోని ఆ పాట ద్వారా ఆత్రేయ దేశభక్తిని ఉప్పొంగించారు. భక్తి రస ప్రధానంగానూ ఆత్రేయ కలం అద్భుతాలు సృష్టించింది. శేష శైలా వాస! శ్రీ వేంకటేశా! అంటూ ఆయన శ్రీనివాసుడికి జోల పాట పాడిన విధం ప్రేక్షకుల హృదయాలలో ఇప్పటికీ పదిలంగా ఉంది. శ్రీ వెంకటేశ్వర మాహాత్మ్యం చిత్రంలోని ఈ పాట అప్పటికి, ఇప్పటికీ, ఎప్పటికీ విన్న వెంటనే శ్రీవారి సాక్షాత్కారాన్ని కలిగిస్తుంది. సరిగ్గా అదే సమయంలో "ఉన్నావా..? అసలున్నావా..? అంటూ, భక్త తుకారం చిత్రంలో వ్రాసిన పాటలో ఆ దైవాన్నే నిలదీసి ప్రశ్నించిన కలం యోధుడిగా ఆత్రేయ కనిపిస్తారు. అంతస్తులు చిత్రంలో ఆయన రాసిన "తెల్లచీర కట్టుకున్నది ఎవరి కోసము...? మల్లెపూలు పెట్టుకున్నది ఎవరి కోసము..?" అంటూ, సాగే పాట శృంగార రసం ఒలికించింది. తెలుగు పాటకు మనసుతో నవరసాలను అద్ది ప్రేక్షకులను ఓలలాడించిన మహాకవి ఆత్రేయ " కడవెత్తుకొచ్చింది కన్నెపిల్లా...! అనే పాటను ఆయన ప్రేమనగర్ చిత్రం కోసం రాశారు. ఆ పాటలో తొణకిసలాడిన 'రోమాన్స్' తెలుగు సినిమా ఉన్నంత కాలం బ్రతికే ఉంటుంది.

**కలానికి ఇరువైపులా పదును గల కవి శ్రేష్ఠుడు**

ఇక కమల్ హాసన్, బాలచందర్ కలయికలో తెరకెక్కిన ఆకలి రాజ్యం చిత్రంలో శ్రీ శ్రీ ప్రస్తావన ఉంటుంది. కానీ అందులో సందేశాత్మకమైన సాపాటు ఎటూ లేదు పాటైనా పాడు బ్రదర్! అంటూ ఆకలి కేకలను తన కలలో వినిపించారు. ఈ పుణ్యభూమిలో పుట్టడం మన తప్పు? ఆవేశం ఆపుకోని అమ్మానాన్నదే తప్పా..? అంటూ ఆ పాట సమాజాన్ని ప్రశ్నించింది. అలా తన కలానికి రెండు వైపులా పదును ఉందని నిరూపించిన గొప్ప కవి ఆత్రేయ. ప్రేమ గీతాలు రాయడంలో దిట్ట అయినా రాత్రి అదే ప్రేమ పేరుతో తెరకెక్కిన చిత్రంలో ప్రియతమా! నా హృదయమా! అంటూ ఆయన పలికించిన పదాలు ఎప్పటికీ ప్రేక్షకుల మదిలో నిలిచే ఉంటాయి అనవచ్చు. నేనొక ప్రేమ పిపాసినీ..! అని అంతరంగా ఆవిష్కరణ చేశారు. సిరిమల్లె పూవల్లే నవ్వు! అంటూ నవ్వులు చిందించారు. మాటరాని మౌనమిది అంటూ మనసు మీటారు. రేపంటి రూపం కంటి అంటూ, మంచి చెడులు విశ్లేషించారు. జాబిల్లి కోసం ఆకాశమల్లే వేచాను నిరాకై..! అంటూ, నిరీక్షించారు. అంతేకాదు "రాళ్ళల్లో ఇసుకల్లో.. ప్రేమికుల చేత ప్రేమలేఖలు రాయించారు. ప్రేమ ఎంత మధురం! ప్రియురాలు ఎంత కఠినం! అంటూ, తన కలంతో రాగాలు పలికించారు. అంతేకాకుండా అదే చేత్తో మరో పాట రాసి "కదుపు కాలే కష్టజీవులు, వడలు విరిచి గనులు తొలిచే.. " అంటూ, శ్రామికుల పక్షాన నిలిచారు. తోడికోడళ్ళు చిత్రం ద్వారా ఆత్రేయ ఈ శ్రామికజన చైతన్యాన్ని ప్రేక్షకులకు రుచి చూపించారు. అంతేకాదు వానలో వెళుతూ చిటపట చినుకులు పడుతూ ఉంటే, చెలికాడే సరసన ఉంటే పాటకు శ్రీకారం చుట్టారు. తెలుగు సినిమాల్లో ఎప్పటికీ ఈ పాట చిరస్థాయిగా నిలిచిపోతుంది.

**భావాలకు ఆచార్యత్వం వహించిన ఆచార్యుడు**

కేవలం కలంతో మనసుకు గాలం వేయడమనే విద్య ఆత్రేయకు తెలిసినంతగా మరెవరికి తెలియదంటే అతిశయోక్తి కాదేమో! అని నాకనిపిస్తుంది. అలాంటి మహోన్నత కలం 1989 వ సంవత్సరం సెప్టెంబర్ 13 న ఆగిపోయింది. ఆయన మరణం ఎందరో సినీ అభిమానులకు విషాదాన్ని మిగిల్చింది. ఆయన కలం మూగబోయినా పాటలు ఆగవు. ఆ పాటలు అడిగినా అందులోని రాగాలకు అంతం లేదు. వాటిలో పలికించిన భావాలకు మరణమనేదే లేదు. మనసుతో ఆయన పలికించిన భావాలకు ఆచార్యత్వం వహించారు. కాబట్టే ఆచార్య ఆత్రేయ అయ్యారు. మన (సు)కవి గా అభిమానుల మదిలో ఉండిపోయారు.



చౌదూరి నరసింహారావు
పత్రికా రచయిత, విశ్లేషకులు

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలి : గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్



కామారెడ్డి జిల్లా,(భారతశక్తిప్రతినిధి)సెప్టెంబర్ 11: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని గృహాలను నిర్మించుకోవాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. విజయపాల్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు.

గురువారం బాన్సువాడ మండలంలోని కోనాపూర్, సంగోజీపేట గ్రామంలో పీడీ హౌసింగ్ పర్యటించి వివిధ నిర్మాణ దశలలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను పర్యటించి లబ్ధిదారులకు ఇందిరమ్మ కమిటీ మెంబర్లకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమునకు సంబంధించి పూర్తి అవగాహన కల్పించినారు, వారి యొక్క సందేహములను నివృత్తి పరిచారు.

ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు వారు స్వయంగా స్టేజి ఫోటోలను అప్లోడ్ చేయు వివరములను, లబ్ధిదారులు ఏదైనా వివరములు, సమస్యలు విన్నవించుటకై ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18005995991 గూర్చి వివరించడం జరిగింది. ఇట్టి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమునకు సంబంధించి అవసరమగు ఇసుకను ప్రభుత్వం సంబంధిత మండల రెవెన్యూ అధికారి ద్వారా లబ్ధిదారులు ట్రాక్టర్ కిరాయి,లేబర్ ఏర్పాటు చేసుకొని ఉచితంగా సరఫరా చేయబడుటకు వివరములను తెలియజేసినారు.ఇట్టి గృహ నిర్మాణములకు సంబంధించి ఎవరికిని ఎలాంటి డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదని, ఇవ్వకూడదని తెలియజేయడం జరిగినది. లబ్ధిదారులు తమకు సంబంధించిన వివరాలను ఇందిరమ్మ వెబ్సైట్లో స్వయంగా తెలుసుకోవచ్చునని ఇందిరమ్మ ఇండ్ల ప్రభుత్వ వెబ్సైట్ గురించి తెలియజేసినారు.ఇట్టి కార్యక్రమంలో ఎ. గోపాల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హౌసింగ్), వినీత్ ఏ ఈ (హౌసింగ్), బాన్సువాడ, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వ్యవస్థాపకులుగా ఎదగండి: డాక్టర్ సోమేశ్వర్ ఉద్బోధ



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 11 :ఫార్మసీ విద్యార్థులు తమదైన ప్రభావాన్ని సృష్టించడానికి వ్యవస్థాపకతను ఒక మార్గంగా ఎంచుకోవాలని, తద్వారా ఉద్యోగార్థిగా కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే వారిగా ఎదగాలని బెల్ ఫార్మాస్యూటికల్స్ కాస్మెటిక్స్ & ఓర్సిమెడ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ కె.సోమేశ్వర్ ఆకాంక్షించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'ప్రయోగశాల నుంచి ప్రారంభం వరకు: ఫార్మాస్యూటికల్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఒక కెరీర్ మార్గం' అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.నేటి ఆరోగ్య సంరక్షణ రంగంలో ఫార్మాస్యూటికల్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ యొక్క కీలక పాత్రను డాక్టర్ సోమేశ్వర్ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రయోగశాల పరిశోధనను వాస్తవ ప్రపంచ పరిష్కారాలుగా మార్చడానికి వ్యవస్థాపకత సైన్స్, ఆవిష్కరణ, వ్యాపారాన్ని ఎలా వారధి చేస్తుందో వివరించారు. ఆవిష్కరణ, నాయకత్వం, వ్యూహం, శాస్త్రీయ జ్ఞానం అనే ముఖ్యమైన నైపుణ్యాలను ప్రస్తావిస్తూ, విద్యారంగం దాటి తమదైన ప్రభావాన్ని సృష్టించడానికి వ్యవస్థాపకతను ఒక మార్గంగా చూడమంటూ విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు.ఆవిష్కరణ, ప్రీక్లినికల్ ధ్రువీకరణ, క్లినికల్ ట్రయల్స్, వాణిజ్యీకరణలను వివరిస్తూ, ప్రయోగశాల నుంచి ప్రారంభం వరకు గల సాంకేతిక ప్రయాణాన్ని డాక్టర్ సోమేశ్వర్ విశదీకరించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడంలో సాంకేతిక బదిలీ కార్యాలయాలు, ఇంక్యుబేటర్లు, క్రాస్-ఫంక్షనల్ బృందాలు, కృత్రిమ మేధస్సు, క్లౌడ్ ఆధారిత ప్రయోగశాల నిర్వహణ వంటి డిజిటల్ సాధనాల ప్రాముఖ్యతను కూడా ఆయన విడమరచి చెప్పారు.ఫార్మా వ్యవస్థాపకుడికి అవసరమైన కీలక సామర్థ్యాలను డాక్టర్ సోమేశ్వర్ ప్రస్తావిస్తూ, శాస్త్రీయ చతురత, నియంత్రణ, వ్యాపార వ్యూహం, నాయకత్వ స్థితిస్థాపకత వంటివి వాటిలో ఉన్నాయన్నారు. దీర్ఘ పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాలు, నియంత్రణ సంక్లిష్టతలు, అధిక మూలధన అవసరాలు, మార్కెట్ పోటీ, నైతిక పరిగణనలు వంటి సవాళ్లను కూడా ఆయన ప్రస్తావించారు. వ్యవస్థాపకులుగా ఎదగదలచుకున్న వారికి అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం వంటి ఇంక్యుబేటర్లు, స్టార్టప్ ఇండియా, బీఏఆర్ఏసీ వంటి ప్రభుత్వ పథకాలు, అలాగే వెంచర్ క్యాపిటల్, ఏంజల్ ఇన్వెస్టర్లతో పాటు ఐఐటీలు, నైపర్ల సహకారాలను డాక్టర్ సోమేశ్వర్ వివరించారు.'సైన్స్, వ్యాపారం మధ్య మీరు ఎంచుకోవాల్సిన అవసరం లేదు. వ్యవస్థాపకత అనేది వాస్తవ ప్రపంచ ప్రభావానికి ఒక వాహనం. ప్రయోగశాల నుంచి పడక వరకు మీరు ఉత్ప్రేరకంగా ఉండవచ్చు' అంటూ తన ఆలోచనలను పంచుకున్నారు. తొలుత, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథిని స్వాగతించి, సత్కరించారు.

# అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ది చేకూరేలా చర్యలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్11 (భారత శక్తి): అర్హులకు చేయూత ఫించన్ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చేయూత పెన్షన్ల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పి.పి.టి. ద్వారా డైరెక్టర్ సెర్ప్ గోపాల్ అధికారులకు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ చేయూత పథకం కింద వృద్ధులకు, దివ్యాంగులకు, హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు, వితంతువులకు, నేతన్నలకు,గీత కార్మికులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలు, బీడి టేకేదార్లు, డయాలసిస్, ఫిలేరియా పేషెంట్లకు ప్రభుత్వం పెన్షన్ అందిస్తుందని అన్నారు.ప్రస్తుతం వృద్ధుల పింఛన్ తీసుకుంటున్న వారు మరణిస్తే వారి స్థానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ మంజూరు చేయడం, హెచ్.ఐ.వి, డయాలసిస్ పింఛన్ పోర్టల్ ఓపెన్ ఉందని అన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ సంబంధించి రెండు రిజిస్టర్లు మెయింటెన్ చేయాలని ఒక రిజిస్టర్ లో మంజూరు చేసిన ఫించన్ దారుల వివరాలు,మరో రిజిస్టర్ లో అర్హత ఉన్న లబ్ధిదారుల వివరాలు రాయాలని, ప్రభుత్వం నుండి ఆదేశాలు వస్తే నూతన పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. వృద్ధాప్య పెన్షన్ దారులు మరణిస్తే వెంటనే పెన్షన్ వారి జీవిత భాగస్వామి కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు బర్త్ సర్టిఫికెట్,డెత్ సర్టిఫికెట్ జారీ వివరాల రిజిస్టర్ పక్కాగా మెయింటైన్ చేయాలని అన్నారు. బర్త్, డెత్ సర్టిఫికెట్ 6 నెలల లోపు మాత్రమే స్థానికంగా పంచాయతీ కార్యదర్శులు జారీ చేయాలని, 6 నెలల తర్వాత రెవెన్యూ డివిజన్ అధికారికి మాత్రమే ఆ హక్కు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పెన్షన్ తీసుకుంటున్న వారు శాశ్వతంగా వలస పోతే క్షుణ్ణంగా విచారించిన తర్వాత పెన్షన్ తీసి వేయాలని అన్నారు. ప్రజా భవన్ దగ్గర జరిగే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను వెంటనే ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి రిపోర్టు 3 నుంచి 4 రోజులలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అర్హులైన పేదలకు అందాలని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం కింద 18 నుంచి 59 సంవత్సరాల వయసు గల నిరుపేద కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినట్లయితే ఒకేసారి 20 వేల రూపాయల సహాయం అందుతుందని, తెలిపారు.

ఆపద్బంధు, జె.బి.వై., ఏఏబివై పథకం లబ్ధిదారులకు ఈ స్కిమ్ వర్తించదని అన్నారు. ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తులను తహసిల్దార్ క్షుణ్ణంగా విచారించి ఆర్డీఓ లకు రిపోర్ట్ అందించాలని, డిఆర్ఓ ద్వారా సెర్ఫ్ కు దరఖాస్తులు పంపడం జరుగుతుందని అన్నారు.ఆధార్ కార్డు, డెత్ సర్టిఫికెట్ ,బ్యాంక్ పాస్ పుస్తకం రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం మొదలగు పత్రాలతో వీటిని పరిశీలించాలని అన్నారు. జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు నేతన్న కుటుంబాలలో ఈ పథకానికి ఎవరైనా అర్హులు ఉంటారు లేదు పరిశీలించి ప్రతిపాదన సమర్పించాలని కలెక్టర్ తెలిపారు

# ఆ పోరు కోసం చూస్తున్నా..

## లక్ష్యం ఎంతైనా అతడి దూకుడు ఆగదు: సూర్యకుమార్




: ఆసియా కప్ )ను టీమ్ఇండియా ఘనంగా మొదలుపెట్టింది. తొలి మ్యాచ్‌లో పసికూన యూఏఈపై అలవోకగా విజయం సాధించింది. ఆ జట్టు నుంచి కనీస ప్రతిఘటన లేకపోవడంతో మరో 93 బంతులు మిగిలిఉండగానే గెలుపు తీరాలకు టీమ్ఇండియా చేరింది. అయితే, ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో పోరు జరగనుంది. ఈ మ్యాచ్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాను కూడా ఆ జాబితాలో ఉన్నానంటూ భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. యూఏఈతో మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్య పలు విషయాలపై మాట్లాడాడు. బౌలర్లతోపాటు ఓపెనర్ అభిషేక్ శర్మపై ప్రశంసల వర్షం కురిపించాడు.

"ప్రతి క్రికెటర్ కఠినమైన ప్రత్యర్థితో గొప్ప మ్యాచ్ ఆడాలని కోరుకుంటారు. మేం కూడా ఆ మ్యాచ్ కోసం ఎదురుచూస్తున్నాం. తొలి మ్యాచ్‌లోనే మా కుర్రాళ్లు అదరగొట్టారు. ఆసియా కప్ ఆసాంతం ఇదే ఉత్సాహంతో ఆడతాం. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బరిలోకి దిగిన జట్టులోనూ ఆడిన అనుభవం మా ఆటగాళ్లకు ఉంది. పిచ్ కాస్త నెమ్మదిగా ఉందనిపించింది. స్పిన్నర్లు తమ పాత్రను అద్భుతంగా పోషించారు. పిచ్ ఎలా స్పందిస్తుందో తెలుసుకోవడానికే తొలుత బౌలింగ్ ఎంచుకున్నాం. అయితే, రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పిచ్ తీరు ఒకేలా ఉంది. ఈ అనుభవం మాకు పాక్‌తో పోరుకు ఉపయోగపడుతుంది. కుల్‌దీప్ యాదవ్‌కు హార్దిక్, దూబె, బుమ్రా, అక్షర్ నుంచి మంచి సపోర్ట్ లభించింది. లక్ష్య ఛేదనలో వరాకు వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్ ఉన్నప్పుడు టెన్షనే ఉండదు. లక్ష్య ఛేదన 50 లేదా 200 అనేది చూడడు. తనదైన శైలిలో దూకుడుగా ఆడేస్తాడు. అందుకే, పాక్‌తో మ్యాచ్ కోసం మేమంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం" అని సూర్య వెల్లడించాడు. అభిషేక్ 16 బంతుల్లో 30 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. ఇందులో రెండు ఫోర్లు, మూడు సిక్స్‌లు ఉన్నాయి.




## గంభీర్-సూర్య మార్క్ మొదలైంది..

# అంచనాలకు దొరకరు

చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు పెద్దలు. దానిని అందిపుచ్చుకున్నరేమో భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ - ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్. ఆసియా కప్)లో తొలి మ్యాచ్ నుంచే తమ వ్యూహాలకు పదునుపెట్టారు. తమ టార్గెట్ ఏంటో ప్రత్యర్థులకు స్పష్టమైన హెచ్చరికలు పంపారు.

**బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు**

వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ సన్నాహకంగా భావిస్తోన్న ఆసియా కప్ తొలి మ్యాచ్‌తోనే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ - కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తమ మార్క్‌ను చూపించారు. తుది జట్టు ఎంపికలో అనూహ్య నిర్ణయాలతో మరోసారి వార్తల్లో నిలిచారు. యూఏఈ వంటి చిన్న జట్టు అయినా సరే పూర్తిస్థాయి బలంతోనే బరిలోకి దింపి విజయం సాధించారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులతో మొదలుపెట్టడం గమనార్హం. అనుకున్నట్లుగానే చిన్ననాటి స్నేహితులు అభిషేక్ శర్మ - శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా వచ్చారు. జితేశ్ శర్మను తీసుకుంటారని భావిస్తే.. సంజుకే ఛాన్స్ ఇచ్చారు. బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినా అతడికి జట్టులో స్థానం కల్పించడంతో కాన్ఫిడెన్స్ పెంచినట్లైంది. ఇక వన్‌డౌన్‌లో కెప్టెన్ సూర్యకుమార్ వచ్చాడు. అంతకుముందు వరకూ తిలక్ వర్మ ఆడేవాడు. లక్ష్యం పెద్దది కాకపోవడం.. అప్పటికే విజయానికి చేరువగా రావడంతో సారథే క్రీజ్‌లోకి దిగేశాడు. దీంతో ఎవరికీ ఏ స్థానమూ ఫిక్స్ కాదని గతంలో తాము చెప్పిన మాటలు మరోసారి రుజువు చేసినట్లైంది.

**బౌలింగ్‌లో బలాన్ని నమ్మి..**

దుబాయ్ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలం. అలాగని పేస్‌నూ తక్కువ చేయడానికి లేదు. తొలి మ్యాచ్‌లో కేవలం ఒకేఒక్క స్పెషలిస్ట్ పేసర్‌ను మాత్రమే ఆడించడం గమనార్హం. జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు పేస్ ఆల్‌రౌండర్లుగా ఉన్న హార్దిక్ పాండ్య, శివమ్ దూబెను మేనేజ్‌మెంట్ ఆడించింది. అనూహ్యంగా కెప్టెన్ సూర్య కొత్త బంతిని హార్దిక్‌కు ఇచ్చాడు. కుల్‌దీప్ యాదవ్‌కు అవకాశం ఇస్తారా? లేదా? అని అంతా ఆసక్తిగా చూశారు. ఎందుకంటే అప్పటికే వరుణ్ చక్రవర్తితోపాటు స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తుది జట్టులో ఉన్నారు. అయితే, అంచనాలకు విరుద్ధంగా కుల్‌దీప్ ఛాన్స్ కొట్టేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**ఆల్‌రౌండర్లకే ప్రాధాన్యం..**

జట్టులో ఎంతమంది ఆల్‌రౌండర్లు ఉంటే అంత బలం. ఇప్పటికే టీమ్ఇండియాలో ముగ్గురు ఆల్‌రౌండర్లు ఉండగా.. మరొకరు కూడా ఆ జాబితాలో చేర్చగలిగే ప్లేయరే. ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా బంతి విసరగల సత్తా ఉన్నోడే. పేస్ ఆల్‌రౌండర్ల రూపంలో హార్దిక్ పాండ్యకు తోడుగా శివమ్ దూబె చోటు దక్కించుకున్నాడు. యూఏఈపై మెరిశాడు. చిన్న జట్టు కాబట్టి పెద్ద టెన్షన్ లేకుండా బౌలింగ్ చేశాడు. పాక్‌తో పోరులో ఎలా ఆడతాడో చూడాలి. రవీంద్ర జడేజా లోటును తీరుస్తూ అక్షర్ పటేల్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అందుకే, ఫినిషర్‌గా పేరొందిన రింకు సింగ్‌కు కూడా ఛాన్స్ ఇవ్వకుండా ముగ్గురిని రంగంలోకి దించారు.

**ఇదే కొనసాగిస్తారా..?**

ప్రతి మ్యాచ్‌కు, ప్రతి సిరీస్‌కు భిన్నంగా ఆలోచనలు చేయడం గౌతమ్ గంభీర్‌కు అలవాటు. అది జట్టు ఫలితాలపై తాత్కాలికంగా ప్రభావం చూపినా.. సుదీర్ఘకాలంలో మెరుగ్గా ఉంటాయనేది అతడి భావన. ఇప్పుడు ఆసియా కప్‌లో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ నుంచి కాస్త ప్రతిఘటన తప్పితే.. మిగతా జట్ల నుంచి ముప్పు ఉండకపోవచ్చు. కాబట్టి, ప్రయోగాలకు వేదికగా దీనిని మార్చుకున్నా ఫర్వాలేదు. ఇదంతా వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ నాటికి టీమ్‌ను సిద్ధం చేయడంలో భాగమేనని క్రికెట్ వర్గాలు అంటున్నాయి.

# రిటైర్మెంట్‌పై ఊహాగానాలు

## ఒక్క పోస్టుతో అందరి నోళ్లూ మూయించిన హిట్‌మ్యాన్





భారత వన్డే జట్టు సారథి రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై ఇటీవల తెగ చర్చ జరుగుతోంది. అయితే, అతడు మాత్రం తన గురించి కాదులే అన్నట్లుగా ఒకే ఒక్క పోస్టుతో అందరి నోళ్లూ మూయించాడు. తన లక్ష్యం 2027 వన్డే ప్రపంచకప్ అని చెప్పకనే చెప్పాడు. అందులో భాగంగా అక్టోబర్‌లోనే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఆడేందుకు సిద్ధమని ఫొటోలను షేర్ చేసి స్పష్టంచేశాడు. వాకింగ్ చేస్తూ ఉన్న ఫొటోతోపాటు ప్యాడ్లను కట్టుకుంటున్న ఇమేజ్ అందులో ఉన్నాయి. దీంతో సోషల్ మీడియాలో రోహిత్ ఫ్యాన్స్ కామెంట్లతో హోరెత్తించారు. '2027 ప్రపంచకప్‌నకు భాయ్ సిద్ధమవుతున్నాడు'.. 'మైదానంలో చూసేందుకు ఎదురుచూస్తున్నాం' అంటూ కొందరు ప్రతిస్పందించారు.

**ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్..**

ఇప్పటికే టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్, విరాట్ కోహ్లీ ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడాలని ఉవ్విళ్లూరుతున్నారు. అక్కడ సత్తా చాటితే విమర్శకులకు అడ్డుకట్ట వేయొచ్చనేది వారి ఆలోచన. అయితే, ఆస్ట్రేలియా %ూా%తో మ్యాచులకు ఇటీవల భారత్ %ూా% జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. ఇవాళ్టి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్ ప్రారంభం కానుంది. ఆసీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు జట్ల ఎంపికకు ఇవే ప్రామాణికమయ్యే అవకాశం లేకపోలేదు. రోహిత్, విరాట్‌ను మాత్రం మేనేజ్‌మెంట్ భారత్ %ూా% తరఫున ఆడాలని బలవంతం చేయలేదని తెలుస్తోంది. దీంతో వారిని ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే వీరిద్దరూ ఫిట్‌నెస్ టెస్టులనూ ముగించారనే వార్తలు వచ్చాయి.

**ఇవాళ్టి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్ ప్రారంభం కానుంది. ఆసీస్‌తో వన్డే, టీ20 సిరీస్‌లకు జట్ల ఎంపికకు ఇవే ప్రామాణికమయ్యే అవకాశం లేకపోలేదు**

# బ్రెవిస్‌కు రూ.8.3 కోట్లు



జొహానెస్‌బర్గ్: భీకర ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌కు దక్షిణాఫ్రికా టీ20 లీగ్ వేలంలో రికార్డు ధర పలికింది. సౌరభ్ గంగూలీ కోచ్‌గా వ్యవహరిస్తున్న ప్రిటోరియా క్యాపిటల్స్.. బ్రెవిస్‌ను రూ.8.3 కోట్లకు కొనుగోలు చేసింది. 2022లో ట్రిస్టన్ స్టబ్స్ రూ.4.6 కోట్లతో నెలకొల్పిన రికార్డును బ్రెవిస్ భారీ తేడాతో బద్దలు కొట్టాడు. జోబర్గ్ సూపర్ కింగ్స్ నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ 22 ఏళ్ల బ్రెవిస్‌ను ప్రిటోరియా పట్టుబట్టి సొంతం చేసుకుంది. "బ్రెవిస్‌కు గొప్ప ప్రతిభ ఉంది. అతను బాగా ఆడతాడని ఆశిస్తున్నా. గత ఏడాదిన్నరలో తన ఆట ఎంతో మెరుగైంది. ముఖ్యంగా ఇటీవల ఆస్ట్రేలియాపై గొప్పగా ఆడాడు. టీ20ల్లో రసెల్, రూథర్‌ఫర్డ్ లాగా అతను మ్యాచ్‌లను మలుపు తిప్పే ఆటగాడు. ఆటను నేనెప్పుడూ డబ్బుతో ముడిపెట్టి చూడను. బ్రెవిస్ కోసం ఎంత పెట్టామన్నది పక్కన పెడితే అతడి ప్రతిభ అద్భుతం. అన్నీ చూసుకునే తనపై అంత ధర పెట్టాం" అని గంగూలీ వేలం అనంతరం పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా టీ20 జట్టు కెప్టెన్, ఆల్‌రౌండర్ మార్‌క్రమ్ సైతం స్టబ్స్ రికార్డును మించి ధర దక్కించుకున్నాడు. అతడి కోసం దర్బన్ సూపర్ జెయింట్స్ రూ.7 కోట్లు పెట్టింది. మార్‌క్రమ్‌ను పాత జట్టు సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ రైట్ టు మ్యాచ్ ద్వారా రూ.6.2 కోట్లతో అట్టిపెట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ.. దర్బన్ అంతకుమించిన రేటుతో అతణ్ని సొంతం చేసుకుంది.

# టీ20 కాదు.. టీ10!




ఆసియా కప్‌లో యూఏఈతో భారత్ తొలి పోరు. టాస్ గెలిచిన సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. మూడు ఓవర్లు పడ్డాయి. స్కోరు 25 పరుగులు. హార్దిక్, బుమ్రా, అక్షర్ పటేల్.. ముగ్గురూ ప్రయత్నించినా వికెట్ పడలేదు. ఓపెనర్ అలిషన్ షరాఫు ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టిస్తున్నాడు. ఆ ఊపు చూస్తే.. యూఏఈ చెప్పుకోదగ్గ స్కోరే చేస్తుందని, భారత్‌కు బాగానే పోటీ ఇస్తుందని అనుకున్నారంతా! కానీ ఆ జట్టు మెరుపులు ఆ మూడు ఓవర్లకే పరిమితం. ఇంకో పది ఓవర్లు గడిచేసరికి ఇన్నింగ్స్ అయిపోయింది. స్కోరు చూస్తే కేవలం 57. ఆ కాసిన్ని పరుగులను ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి కేవలం 4.3 ఓవర్లలోనే ఛేదించిన భారత్.. ఆసియా కప్‌లో ఘనంగా బోణీ కొట్టి, పాక్ సహా మిగతా జట్లకు హెచ్చరికలు పంపింది.

దుబాయ్ : టీ20ల్లో ఇన్నింగ్స్‌కు 20 ఓవర్ల చొప్పున గరిష్ఠంగా 40 ఓవర్ల ఆట జరుగుతుంది. కానీ ఆసియా కప్ టీ20 టోర్నీలో యూఏఈతో తన తొలి పోరును టీమ్ఇండియా టీ10 మ్యాచ్‌గా మార్చేసింది. మొత్తం 17.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను పూర్తి చేసి ఔరా అనిపించింది. మొదట 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కుల్‌దీప్ యాదవ్ (4/7), శివమ్ దూబె (3/4)ల ధాటికి విలవిలలాడిన యూఏఈ.. 13.1 ఓవర్లలో కేవలం 57 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు అలిషన్ షరాఫు (22), మహ్మద్ వసీమ్ (19) మినహా ఆ జట్టులో ఎవ్వరూ 3కు మించి పరుగులు చేయలేదు. 9.3 ఓవర్ల వ్యవధిలో, 31 పరుగుల తేడాలో ఆ జట్టు 10 వికెట్లు కోల్పోయింది. అభిషేక్ శర్మ (30బీ 16 బంతుల్లో 2ఐ4, 3ఐ6), శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్‌బీ 2ఐ4, 1ఐ6) మెరుపులతో లక్ష్యాన్ని భారత్.. ఒక వికెట్ కోల్పోయి 27 బంతుల్లోనే ఛేదించింది. తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అభిషేక్.. ఎంత త్వరగా మ్యాచ్ పూర్తి చేద్దామా అన్నట్లు ఆడాడు. ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోతున్న అతడిని నాలుగో ఓవర్లో జునైద్ ఔట్ చేశాడు. ఇంకో నాలుగు బంతులకే భారత్ ఛేదన పూర్తయింది. ఒక వికెట్ తీయడం, మొదట తొలి మూడు ఓవర్లు వికెట్ కోల్పోకుండా ఆడడం తప్ప యూఏఈ ఈ మ్యాచ్‌లో సాధించిందేమీ లేదు. భారత్ ఆదివారం తన తర్వాతి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఢీకొంటుంది. ఆ పోరుకు ముందు యూఏఈతో మ్యాచ్‌ను వార్మప్‌లా సూర్యకుమార్ సేన బాగానే ఉపయోగించుకుంది.

**కుల్‌దీప్ కూల్చేశాడు..:** బంగ్లాదేశ్ కొన్ని నెలల కిందటే టీ20 సిరీస్ గెలిచిన జట్టు యూఏఈ. తాజాగా పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లతో ముక్కోణపు సిరీస్‌లోనూ మెరుగైన ప్రదర్శనే చేసింది. అలాంటి జట్టు భారత్‌తో మ్యాచ్‌లో తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తుందనే అంచనాలే ఉన్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన యూఏఈ.. ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే చెప్పుకోదగ్గ స్కోరే చేస్తుందనిపించింది. ఓపెనర్ అలిషన్ షరాఫు.. హార్దిక్ వేసిన తొలి ఓవర్లో రెండు ఫోర్లు కొట్టాడు. బుమ్రా వేసిన రెండో ఓవర్లోనూ ఒక ఫోర్ సాధించాడు. మూడో ఓవర్లో స్పిన్నర్ అక్షర్ పటేల్ బౌలింగ్‌కు రాగా.. కవర్స్‌లో షరాఫు చూడముచ్చటైన సిక్సర్ బాదాడు. అయితే అతడి జోరుకు నాలుగో ఓవర్లో బుమ్రా బ్రేకులేశాడు. తనదైన శైలిలో సంధించిన యార్కర్‌కు షరాఫు నుంచి సమాధానం లేకపోయింది. ఈ వికెట్ పడగానే యూఏఈ ఇన్నింగ్స్ స్వరూపం మారిపోయింది. తర్వాతి ఓవర్లో జోహైబ్ (2)ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేశాడు. ఇక 8వ ఓవర్లో చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్.. యూఏఈ నడ్డి విరిచేశాడు. అతను ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీశాడు. తొలి బంతికి రాహుల్ చోప్రా (3)ను పెవిలియన్ చేర్చిన అతను.. నాలుగో

# సెమీస్‌లో నుపుర్, జైస్మీన్



లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు అదరగొట్టారు. హెవీవెయిట్ బాక్సర్ నుపుర్ షెరాన్, జైస్మీన్, పూజ రాణి సెమీఫైనల్‌కు దూసుకెళ్లడంతో భారత్‌కు మూడు పతకాలు ఖాయమయ్యాయి. క్వార్టర్‌ఫైనల్లో నుపుర్ (80ం) 4-1తో సొతిమ్‌బొయేవా (ఉజ్బెకిస్థాన్)పై విజయం సాధించింది. బౌట్‌ను నుపుర్ ధాటిగా ఆరంభించింది. స్పష్టమైన పంచ్‌లతో తొలి రౌండ్లో పైచేయి సాధించింది. రెండో రౌండ్లో ప్రత్యర్థి కాస్త ప్రతిఘటించింది. నుపుర్‌ను పదేపదే పట్టుకోవడంతో ఆఖరి రౌండ్లో సొతిమ్‌బయేవాకు ఓ పాయింట్ కోత పడింది. కానీ ప్రత్యర్థిని తలతో కొట్టినందుకు వెంటనే నుపుర్ కూడా ఓ పాయింట్ కోల్పోయింది. అయితే చివరికి ఆమెదే పైచేయి అయింది. బాక్సింగ్ దిగ్గజం కెప్టెన్ హవా సింగ్ మనవరాలే నుపుర్. ఆసియా గేమ్స్ (1966, 1970)లో వరుసగా రెండుసార్లు స్వర్ణం గెలిచిన ఏకైక బాక్సర్ హవా సింగ్. మరో క్వార్టర్‌ఫైనల్లో జైస్మీన్ 5-0తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన మమజొనోవాపై విజయం సాధించింది. బౌట్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన జైస్మీన్.. జడ్జిల ఏకగ్రీవ నిర్ణయంతో విజేతగా నిలిచింది. ఇంకో క్వార్టర్స్‌లో పూజ 3-2తో ఎమిలియా (పోలెండ్)ను ఓడించింది. మాజీ ఛాంపియన్ నిఖత్ జరీన్‌కు మాత్రం నిరాశ తప్పలేదు. గత రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో స్వర్ణంతో మెరిసిన ఆమె ఈసారి క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. 51కేజీల విభాగంలో ఆమె 0-5తో బుసె నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో ఓడిపోయింది. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థే ఆధిక్యంలో నిలిచింది. మరోవైపు పురుషుల విభాగంలో జాదుమని సింగ్ (48కేజీ), అభినాష్ జమ్వాల్ (65కేజీ) క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు.



# యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా ఘనంగా 'రోహిణి' మూవీ ఆడియో లాంచ్..

యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా, దేవిక సాహూ, ఆశ హీరోయిన్లుగా,కె.వి నరసింహ రాజు సమర్పకులుగా, నిర్మాత కుశాల్ రాజు,

దర్శకుడు సంగ కుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'రోహిణి' మూవీ ఆడియో వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో పాటలు, ట్రైలర్‌ను ఆవిష్కరించిన ముఖ్య అతిథులు టీఎఫ్‌సీసీ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత చదలవడ శ్రీనివాస్, త్రినేత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ పరమేశ్వరి మడపటి, హీరో కృష్ణసాయి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత చదలవడ శ్రీనివాస్ ట్రైలర్ లాంచ్ చేసి మాట్లాడుతూ.. " స్టామినా ఉన్న హీరో సన్నీ కునాల్ తప్పకుండా సక్సెస్ సాధిస్తాడు. రూపంలోనూ నటనలోనూ ఆకట్టుకున్న సన్నీ కునాల్ కు ఆల్ ది బెస్ట్. చిన్న సినిమాలు సక్సెస్ అయితే వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కిన రోహిణి సినిమా పెద్ద విజయం సాధించి నిర్మాత కుశాల్ రాజు మరిన్ని సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను" అన్నారు.

టీఎఫ్‌సీసీ సెక్రటరీ, ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. " హీరో సన్నీ కునాల్ కు మంచి భవిష్యత్తు ఉంది. తప్పకుండా సినిమా ఇండస్ట్రీలో హీరోగా మంచి పేరు తెచ్చుకుంటాడు.. కంటెంట్ బాగుంటే ఏ సినిమా అయినా విజయవంతం అవుతుంది. ఇటీవల హిట్ అయిన 'లిటిల్ హార్ట్స్' లాగే , రోహిణి కూడా హిట్ అయి, కాంప్రమైజ్ కాకుండా సినిమా తీసిన నిర్మాత కుశాల్ రాజుకు డబ్బులు రావాలి. మరెన్నో మంచి చిత్రాలు తీస్తూ సినిమా ఇండస్ట్రీలో స్థిరపడాలి " అన్నారు.

దర్శకుడు సంగ కుమార్ మాట్లాడుతూ.. "ఈ సినిమా విజయవంతం కావడానికి యూనిట్‌లో ప్రతి ఒక్కరి కృషి ఉంది. ముఖ్యంగా డాక్టర్ రాజేంద్ర రాజు కాంచనపల్లి అందించిన సహకారం మా సినిమాకు బలం. పాటలకు వస్తున్న స్పందన సంతోషంగా ఉంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నాను" అన్నారు.

నిర్మాత కుశాల్ రాజు మాట్లాడుతూ.. "ఒక మంచి సినిమా అందించాలనే లక్ష్యంతో పని చేశాం. దర్శకుడు సంఘ కుమార్ అందించిన కొరియోగ్రఫీ ఫైట్స్ అదుర్స్. కెమెరామెన్ అభినయ్ ప్రతిభ రోహిణి సినిమాకు హైలైట్. అందుకే సినిమా బాగా వచ్చింది. త్వరలోనే విడుదల చేసే మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాము " అన్నారు.

హీరో సన్నీ కునాల్ మాట్లాడుతూ.. "మేమంతా ఎంతో కష్టపడ్డాం. ఆ కష్టానికి తగిన ఫలితం రావాలి. ప్రేక్షకులు నచ్చే సస్పెన్స్,

మెచ్చే రొమాన్స్ అండ్ థ్రిల్లింగ్ అంశాలు రోహిణి లో చాలా ఉన్నాయి. ప్రేక్షకుల ఆదరణ కావాలి. సినిమాను సూపర్ హిట్ చేయండి. " అన్నారు. హీరోయిన్లు దేవిక సాహూ మాట్లాడుతూ.. "పాటలు బాగుంటే సినిమా హిట్ అవుతుంది. రోహిణి పాటలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా కూడా చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ థియేటర్‌కి వెళ్లి ఈ సినిమాను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం. మాకు అవకాశం ఇచ్చిన నిర్మాత కుశాల్ రాజు కు దర్శకులు సంఘ కుమార్ కు ధన్యవాదాలు" అన్నారు.

లిరిక్ రైటర్ డాక్టర్ దాసరి వెంకటరమణ మాట్లాడుతూ.. "ఈ సినిమాకు సింగల్ కార్డు తో పాటలు రాసే అవకాశం ఇచ్చిన మిత్రుడు డాక్టర్ రాజేందర్ రాజు కాంచనపల్లికి కృతజ్ఞతలు. పాత సినిమాల మాదిరిగా మధురమైన సాహిత్యంతో రాశాను. పాటలు






అందరికీ నచ్చుతాయి " అన్నారు. ప్రముఖ కవి, రచయిత, కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ఈ చిత్రంలోని అన్ని పాటలు రాయగా, సంగీతాన్ని ఆనంద్ అందించారు.

" నవరసాలు పలికించిన డాక్టర్ దాసరి వెంకటరమణ పాటలు వినసొంపుగా, కనువిందుగా ఉన్నాయి. మా ఇలవేల్పు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్యానర్ పై వస్తున్న రోహిణి చిత్రం కుశాల్ అండ్ కునాల్ కు మంచి పేరు తీసుకువస్తుంది. సినిమా ఇండస్ట్రీలో ఇద్దరికీ స్థిరమైన మంచి భవిష్యత్తు ఉండాలని మా ఇష్ట దైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని వేడుకుంటున్నాను. ఇంత గొప్ప సినిమాకు సమర్పకుడిగా ఉన్నందుకు గర్వంగా ఉంది. నా జన్మ ధన్యమైంది." అని సమర్పకులు కెవి నరసింహ రాజు తెలిపారు.

చిత్ర పర్యవేక్షకులు డాక్టర్ రాజేంద్ర రాజు కాంచనపల్లి ఆకట్టుకునే వ్యాఖ్యానంతో వేడుకను విజయవంతం చేశారు." పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న రోహిణి సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది." సినీ ప్రముఖులు రఘు బత్తుల, C. వేణుగోపాల్,

సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ళ రాంబాబు, నిర్మాత లయన్ శ్రీరామ్ దత్తి, దర్శకులు అలహరి, సింహ శ్రీ మిద్దె, బిల్డర్స్ యువ రాజు, కృష్ణ, స్పందన, నగధర్ రాజు, రవీందర్ రాజు, చలపతి, రాపోలు దత్తాత్రి, పోలీస్ అధికారులు రాజా, రవి, ఖాజానా, తదితరులు రోహిణి ఆడియో వేడుకలో పాల్గొన్నారు.



## హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్.. ఆవశ్యకతను వివరించిన సీఎం రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని సూచించారు. తెలంగాణలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన ప్రాజెక్టుల విషయాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రైల్వేతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్షించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి తోడ్పడే ప్రత్యేక రైల్వే లైనుతో పాటు పలు ప్రాజెక్టులను వివరించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించటంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్‌మెంట్ ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం తయారు చేసిందన్నారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు.. అమలు చేయరు : రామచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌తో ఇండియా కూటమిలో ఐక్యత లేదని స్పష్టమైందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్లకు జీతాలు రావడం లేదు. యూనివర్సిటీ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. కాంట్రాక్ట్ పద్ధతిలో



యూనివర్సిటీలను నడుపుతూ భావితరాలను అంధకారంలోకి నెట్టివేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.వెయ్యికోట్లు ఇస్తానని సీఎం రేవంత్ గొప్పలు చెప్పారు. దావోస్‌కు వెళ్లి ఎన్ని కోట్ల పెట్టుబడులు తెచ్చారు? దారి ఖర్చులు కూడా వచ్చినట్లు లేదు. రాష్ట్రంలో పరిపాలనకు పక్షవాతం వచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారు తప్ప.. అమలు చేయరు. యువత గురించి ప్రభుత్వం ఆలోచించాలి'' అని రామచందర్‌రావు కోరారు.

## ఈఎఫ్ గార్డెన్‌ను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** హైదర్‌గూడ అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఈఎఫ్ గార్డెన్‌ను హిమాయత్‌నగర్ ఎమ్మార్వో సీజ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో ఫంక్షన్ హాల్ నడుపుతున్నట్లు గతంలో కేసు నమోదైంది. గత కొంతకాలంగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇటీవల అది ప్రభుత్వానిదేనని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసు సెక్యూరిటీ నడుమ రెవెన్యూ అధికారులు ఫంక్షన్ హాల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ప్రభుత్వ అధికారులతో మజ్లీస్ నేతలు వాగ్వాదానికి దిగారు.

## హైదరాబాద్, విశాఖలోని జగన్ సన్నిహితుడి కంపెనీల్లో సిట్ సోదాలు

**ఆంధ్రప్రదేశ్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** ఏపీ మద్యం కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు చేస్తోంది. వైకాపా అధ్యక్షుడు జగన్ సన్నిహితుడైన నర్రెడ్డి సునీల్‌రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు చేస్తోంది. హైదరాబాద్, విశాఖలోని 10 కంపెనీల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 3 స్నేహహౌస్‌లో, రోడ్ నంబర్ 2 సాగర్ సొసైటీలో, కాటేదాన్‌రాజేంద్రనగర్, ఖైరతాబాద్ కమలాపురి కాలనీ ఫేజ్ 1లోని కార్యాలయాల్లో, వాల్తేర్ రోడ్‌వెస్ట్‌వింగ్ విశాఖలో ఉన్న కార్యాలయంలో



అధికారులు సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్, విశాఖలో ఏకకాలంలో సిట్ బృందాలు దర్యాప్తు చేపట్టాయి. హైదరాబాద్‌లోని 8 కంపెనీలకు సునీల్‌రెడ్డి 4 కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. విశాఖలోని రెండు కంపెనీలకు ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు.

# సింగిల్ బుల్లెట్ తో ట్రంప్ సన్నిహితుడి కాల్చివేత... స్నైపర్ కోసం ముమ్మర వేట

* **యూటా యూనివర్సిటీలో ప్రముఖ యాక్టివిస్ట్ చార్లీ కిర్క్ దారుణ హత్య**
* **స్నైపర్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన కిర్క్**
* **పైకప్పు నుంచి కాల్పులు జరిపినట్లు పోలీసుల అనుమానం**
* **రంగంలోకి దిగిన ఫెడరల్ ఏజెంట్లు, కొనసాగుతున్న విచారణ**
* **అమెరికా వ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం**

**అమెరిక, సెప్టెంబర్ 11:** అమెరికాలోని యూటా రాష్ట్రంలో ఓ స్నైపర్ కోసం పోలీసులు, ఫెడరల్ ఏజెంట్లు ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రముఖ కన్జర్వేటివ్ యాక్టివిస్ట్, దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్‌ను అత్యంత పకడ్బందీగా, ఓ భవనం పైకప్పు నుంచి ఓ స్నైపర్ సింగిల్ బుల్లెట్ తో చంపిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ హత్యతో యూటా వ్యాలీ యూనివర్సిటీ ప్రాంగణం ఉలిక్కిపడింది. హంతకుడిని పట్టుకునేందుకు అధికారులు పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టారు.

### అసలేం జరిగింది?

యూటా వ్యాలీ యూనివర్సిటీలో జరిగిన 'ది అమెరికన్ కమ్‌బ్యాక్' అనే కార్యక్రమంలో ఈ దారుణం చోటుచేసుకుంది. సుమారు 3000 మంది పాల్గొన్న ఈ సభలో చార్లీ కిర్క్ ప్రసంగిస్తూ, తుపాకీ హింసపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తున్నారు. ఓ వ్యక్తి ట్రాన్స్‌జెండర్ మాస్ షూటర్ల గురించి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తుండగా, ఒక్కసారిగా ఆయన గొంతులోంచి రక్తం చిమ్మింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే ఆయన వేదికపైనే కుప్పకూలిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనలో కిర్క్ మాత్రమే గాయపడ్డారని, మిగతా వారంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

### నిందితుడి కోసం వేట

ఈ దాడిని అత్యంత తీవ్రంగా పరిగణించిన పోలీసులు, క్యాంపస్‌లోని ఓ భవనం పైకప్పు నుంచి స్నైపర్ కాల్పులు జరిపి ఉంటాడని బలంగా అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన 18 గంటల తర్వాత కూడా నిందితుడు పరారీలోనే ఉన్నాడని యూటా ప్రజాభద్రతా విభాగం కమిషనర్ బో మెసన్ వెల్లడించారు. సెక్యూరిటీ కెమెరా ఫుటేజ్‌లో నల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి కనిపించాడని, అతడి కోసమే గాలిస్తున్నామని తెలిపారు. పోలీసులు కిర్క్‌పై కాల్పులు జరిపిన ప్రదేశం, అనుమానితుడు ప్రయాణించిన మార్గాలను 'యాక్టివ్ క్రైమ్ సీన్స్'గా గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు విచారణలో స్థానిక పోలీసులకు ఫెడరల్ ఏజెంట్లు కూడా సహకరిస్తున్నారు.

### క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం

ఈ హత్య నేపథ్యంలో దాదాపు 47,000 మంది విద్యార్థులున్న యూటా వ్యాలీ యూనివర్సిటీలో అధికారులు 'సెక్యూర్ ఇన్ ప్లేస్' ఆదేశాలు జారీ చేసి, క్యాంపస్‌ను గంటలపాటు మూసివేశారు. ఘటన తర్వాత ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినప్పటికీ, వారికి ఈ హత్యతో సంబంధం లేదని తేలడంతో విడుదల చేశారు. అయితే, పోలీసుల విచారణకు ఆటంకం కలిగించాడనే ఆరోపణలపై ఓ రాజకీయ కార్యకర్తపై కేసు నమోదు చేసినట్లు యూనివర్సిటీ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం స్నైపర్‌ను పట్టుకోవడానికి పెద్ద ఎత్తున వేట కొనసాగుతోంది. ఈ హత్య వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనేది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటన అమెరికాలో రాజకీయ హింస, తుపాకీ సంస్కృతిపై మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. విచారణ పూర్తయితే గానీ మరిన్ని వివరాలు తెలిసే అవకాశం లేదు.

## కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారం

* **ప్రతిష్ఠాత్మక 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక**
* **పర్యావరణ పరిరక్షణ కృషి చేశారంటూ పురస్కారం**
* **అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న అవార్డు ప్రదానోత్సవం**
* **ఈ నెల 24న 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్'లో పురస్కార ప్రదానం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. పర్యావరణ పరిరక్షణకు కేటీఆర్ కృషి చేశారంటూ, ఆయనను 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఎంపిక చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఘనంగా జరగనుంది. ఈ నెల సెప్టెంబర్ 24వ తేదీన అక్కడ నిర్వహించనున్న 9వ 'ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్' వేదికగా కేటీఆర్‌కు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. పర్యావరణ పరిరక్షణ, హరిత విధానాల అమలులో కేటీఆర్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు చొరవ చూపారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పురస్కారం కేటీఆర్‌కు వ్యక్తిగతంగానే కాకుండా, తెలంగాణలో పర్యావరణ పరిరక్షణకు జరిగిన ప్రయత్నాలకు లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## భారత్–నేపాల్ సరిహద్దులో హై అలర్ట్.. 30 మంది ఖైదీల అరెస్ట్

**నేపాల్, సెప్టెంబర్ 11:** నేపాల్‌లో నెలకొన్న అశాంతిని ఆసరాగా చేసుకుని అక్కడి జైళ్ల నుంచి తప్పించుకున్న ఖైదీలు భారత్‌లోకి ప్రవేశించేందుకు చేసిన యత్నాలను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) బలగాలు భగ్నం చేశాయి. దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన 30 మంది నేపాలీ ఖైదీలను ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నాయి. ఈ పరిణామంతో కేంద్ర భద్రతా ఏజెన్సీలు భారత్‌నేపాల్ సరిహద్దులో హై అలర్ట్ ప్రకటించాయి. వివరాల్లోకి వెళితే... నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మక నిరసనల మధ్య పలువురు ఖైదీలు జైళ్ల నుంచి పారిపోయారు. వీరిలో కొందరు భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన ఎస్ఎస్‌బీ జవాన్లు సరిహద్దుల్లో గస్తీని ముమ్మరం చేసి చొరబాట్లను అడ్డుకున్నారు. అరెస్టయిన వారిలో 17 మందిని ఉత్తరప్రదేశ్‌లో, మిగిలిన 13 మందిని బీహార్, పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతాల్లో పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం సాయంత్రం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బీహార్ ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. నేపాల్‌తో సరిహద్దు పంచుకుంటున్న పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని సహా ఏడు జిల్లాల్లో హై అలర్ట్ విధించారు. బిహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ అమృత్, డీజీపీ వినయ్ కుమార్‌తో కలిసి సరిహద్దు జిల్లాల డీఎంలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. చొరబాట్లను నిరోధించేందుకు ఎస్ఎస్‌బీ బలగాలతో కలిసి రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తున్నారు. చిక్కుకున్న భారతీయులకు ఊరట మరోవైపు, నేపాల్‌లో అల్లర్ల కారణంగా చిక్కుకుపోయిన భారతీయులకు ఊరట లభించింది. ఖాట్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో రాజస్థాన్‌కు చెందిన పలు కుటుంబాలు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు మార్గం సుగమమైంది. చిక్కుకున్న వారిని త్వరగా తరలించేందుకు కొన్ని రోజుల పాటు అదనపు విమానాలు నడపాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలను ఆదేశించింది.

## కవితకు చింతమడక వాసుల ఆహ్వానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆమె తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత గ్రామమైన చింతమడక నుంచి ప్రత్యేక ఆహ్వానం అందింది. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో తమతో కలిసి పాల్గొనాలని గ్రామస్తులు ఆమెను కోరారు. ఈ నెల 21వ తేదీన జరిగే ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ చింతమడక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో గురువారం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి తరలివచ్చారు. తమ గ్రామ ఆడపడుచుగా భావించి, పండుగకు తప్పకుండా రావాలని వారు కవితను ఆత్మీయంగా ఆహ్వానించారు.

## అది పెయిడ్ క్యాంపెయిన్.. నన్నే టార్గెట్ చేశారు

**ఢిల్లీ, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం (E20)పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా స్పందించారు. అదంతా తనను రాజకీయంగా లక్ష్యంగా చేసుకుని, డబ్బులిచ్చి నడిపిస్తున్న ప్రచారం అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సొసైటీ ఆఫ్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో పాల్గొన్న ఆయన, ఇథనాల్ మిశ్రమంపై వస్తున్న ఆందోళనలపై అడిగిన ప్రశ్నలకు ఈ విధంగా బదులిచ్చారు. "మీ ఆటోమొబైల్ పరిశ్రమ ఎలా పనిచేస్తుందో, రాజకీయాలు కూడా అలాగే ఉంటాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి డబ్బులు ముట్టాయి. అది రాజకీయంగా నన్ను దెబ్బతీయడానికే. అందులో ఎలాంటి నిజం లేదు. ప్రతి విషయం స్పష్టంగా ఉంది" అని గడ్కరీ అన్నారు. ఇథనాల్ మిశ్రమం అనేది విదేశీ ఇంధన దిగుమతులకు ప్రత్యామ్నాయమని, ఖర్చు తక్కువని, కాలుష్య రహితమని, పూర్తిగా స్వదేశీ అని ఆయన పునరుద్ఘాటించారు. భారత్ ఏటా శిలాజ ఇంధనాల దిగుమతి కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తోందని గడ్కరీ గుర్తుచేశారు. ఆ దిగుమతులను తగ్గించి, ఆ డబ్బును దేశ ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడం మంచిది కాదా అని ఆయన ప్రశ్నించారు. "మనం మొక్కజొన్న నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నాం. ఈ విధానం వల్ల రైతులకు రూ. 45,000 కోట్లు లాభం చేకూరింది" అని ఆయన వివరించారు. కాలుష్యం కోణంలోనూ ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత కాలుష్య స్థాయిలు ఇలాగే కొనసాగితే ఢిల్లీ వాసుల ఆయుష్షు పదేళ్లు తగ్గిపోతుందని ఓ నివేదిక చెబుతోంది. ప్రపంచమంతా కాలుష్యాన్ని తగ్గించాలని అంగీకరిస్తోంది" అని తెలిపారు. E20 పెట్రోల్ వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజిన్ భాగాల జీవితకాలం తగ్గిపోతోందని కొందరు వాహనదారులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వాదనలు అవాస్తవమని ప్రభుత్వం కొట్టిపారేసింది. వాహన మైలేజీ అనేది కేవలం ఇంధనంపైనే కాకుండా, నడిపే విధానం, టైర్లలో గాలి, ఏసీ వాడకం, సరైన నిర్వహణ వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది. పైగా, E20 పెట్రోల్ వల్ల మెరుగైన యాక్సిలరేషన్, రైడ్ క్వాలిటీతో పాటు కర్బన ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ విధానాన్ని వెనక్కి తీసుకుంటే కాలుష్య నియంత్రణలో సాధించిన ప్రగతిని కోల్పోవాల్సి వస్తుందని పేర్కొంది.



## నిఫ్టీ సరికొత్త మైలురాయి... 25,000 దాటిన సూచీ!

**ఢిల్లీ, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు కూడా లాభాల జోరును కొనసాగించాయి. గురువారం ట్రేడింగ్‌లో సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా, నిఫ్టీ చరిత్రలో తొలిసారి కీలకమైన 25,000 మైలురాయిని దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. ఉదయం కాస్త బలహీనంగా ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని లాభాల్లోకి మళ్లాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 123.58 పాయింట్లు పెరిగి 81,548.73 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32.40 పాయింట్లు లాభపడి 25,005.50 వద్ద ముగిసింది. రోజులో తీవ్ర ఒడిదొడుకులు ఎదుర్కొన్న సెన్సెక్స్, ఒక దశలో 81,642 గరిష్ఠ స్థాయిని తాకింది. కొన్ని రోజుల క్రితం భారత్‌పై అమెరికా అనూహ్యంగా 50 శాతం టారిఫ్‌లు విధించడంతో నిఫ్టీ 24,400 స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే. "ఆ పతనం నుంచి మార్కెట్ క్రమంగా కోలుకుంది. దేశీయ ఆర్థిక వ్యవస్థపై తక్కువ ప్రభావం ఉంటుందన్న అంచనాలు, అమెరికా విధానాలకు భారత ప్రభుత్వం వ్యూహాత్మకంగా స్పందించడం, జీఎస్టీ వంటి కీలక సంస్కరణలు ప్రకటించడం వంటి కారణాలు మార్కెట్ పుంజుకోవడానికి దోహదపడ్డాయి" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. సెక్టార్ల వారీగా చూస్తే నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ సూచీలు లాభపడగా, ఆటో, ఐటీ రంగాలు నష్టపోయాయి. సెన్సెక్స్ బాస్కెట్‌లో ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, ఏషియన్ పెయింట్స్ షేర్లు రాణించాయి. మరోవైపు, ఇన్ఫోసిస్, టైటాన్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా వంటి షేర్లు నష్టాలను చవిచూశాయి.

### బలహీనపడిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ క్షీణించింది. డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, మిశ్రమ ఎఫ్ఐఐ ప్రవాహాల కారణంగా రూపాయి 0.35 శాతం బలహీనపడి డాలర్‌తో పోలిస్తే 88.40 వద్ద ముగిసింది. "అమెరికాలో వెలువడనున్న సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు డాలర్, రూపాయి కదలికలపై ప్రభావం చూపవచ్చు. ముడి చమురు ధరలు తక్కువ స్థాయిలో ఉండటం రూపాయికి పాక్షికంగా మద్దతు ఇస్తోంది" అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతిన్ త్రివేది తెలిపారు.

## హైదరాబాద్ వాసులకు గుడ్ న్యూస్..
# మీ ఫోన్‌లోనే జీహెచ్ఎంసీ సేవలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** హైదరాబాద్ నగరవాసులకు జీహెచ్ఎంసీ సేవలు ఇకపై మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయి. పౌరులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని వాట్సప్ ద్వారానే ఫిర్యాదులు చేయడం, పన్నులు చెల్లించడం వంటి పనులను చక్కబెట్టుకునేలా సరికొత్త వ్యవస్థను జీహెచ్ఎంసీ సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వాట్సప్ చాట్‌బాట్‌ను త్వరలోనే ప్రారంభించనుంది. ఈ చాట్‌బాట్ ద్వారా పౌరులు తమ సమస్యలను సులభంగా ఫిర్యాదు చేయవచ్చు. వాట్సప్‌లో ఫిర్యాదు నమోదు చేయగానే, ఆ సమాచారం నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. ఏ సమస్యకు ఏ అధికారిని సంప్రదించాలో కూడా ఈ చాట్‌బాట్ తెలియజేస్తుంది. దీనితో పాటు ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ వంటి చెల్లింపులను కూడా ఇకపై వాట్సప్ నుంచే పూర్తి చేసే సౌకర్యాన్ని కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ సేవలు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మాత్రమే ఉన్నాయి. అంతేకాకుండా, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు వంటివి ఎలా పొందాలో, ఎవరిని సంప్రదించాలో వంటి వివరాలను కూడా ఈ చాట్‌బాట్ అందిస్తుంది. వార్డుల వారీగా అధికారుల ఫోన్ నంబర్లు సహా పూర్తి సమాచారం ఇందులో లభిస్తుంది. ప్రస్తుతం చాలా మందికి ఆన్‌లైన్ సేవలు, అధికారుల వివరాలపై సరైన అవగాహన లేకపోవడంతో చిన్న పనులకు కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకే 24 గంటలూ అందుబాటులో ఉండే ఈ చాట్‌బాట్‌ను తీసుకొస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ చాట్‌బాట్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన టెండర్లను వచ్చే వారంలోనే పిలవనున్నట్లు జీహెచ్ఎంసీ ఐటీ విభాగం వర్గాలు తెలిపాయి. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని, నగర పౌరులకు సేవలు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.

## నేను జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేయడం లేదు: దానం నాగేందర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ అధిష్ఠానం సరైన అభ్యర్థిని ఎంపిక చేస్తుందని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దానం



మాట్లాడారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలవడం చాలా ముఖ్యమని దానం నాగేందర్ అన్నారు. అక్కడి నుంచి పోటీ చేయనున్నట్లు వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. అవన్నీ ఊహాగానాలేనని స్పష్టం చేశారు. టికెట్ ఎవరికి కేటాయించినా పార్టీ గెలుపుకోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## గొర్రెల పంపిణీ కుంభకోణంలో బాధితులకు ఈడీ నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** గొర్రెల పంపిణీ కుంభకోణంలో దర్యాప్తును ఈడీ అధికారులు వేగవంతం చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించి ఏసీబీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ నెల 15న ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని గొర్రెల పంపిణీ కుంభకోణం బాధితులకు నోటీసులు జారీ చేసింది. మొయినుద్దీన్ అండ్ గ్యాంగ్ ఏపీకి చెందిన రైతుల నుంచి గొర్రెలు కొనుగోలు చేసి దాదాపు రూ.2కోట్లు మేర మోసం చేసినట్టు ఈడీ దృష్టికి వచ్చింది. రైతులకు చెల్లించాల్సిన నగదును ప్రభుత్వ అధికారుల సాయంతో బినామీలు, సొంత ఖాతాలకు మొయినుద్దీన్ బదిలీ చేసుకున్నట్టు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది.





# న్యాయస్థానాల్లో అవినీతి ?

- కదులుతున్న ప్రజాస్వామ్య పునాదులు.. ?
- న్యాయవాదులు అన్యాయం వాదిస్తున్నారు..
- రాజకీయాలు న్యాయస్థానాలను ప్రభావితం చేస్తున్నారు..
- ఎంతో ఉన్నతమైన న్యాయ వ్యవస్థ నిర్వీర్యమైపోతోందా..?
- అవినీతి న్యాయమూర్తుల కథలు ఆందోళన కలిగిస్తున్నాయి..
- సామాన్యుడు అట్టుడిగిపోతున్నాడు.. అన్యాయమై పోతున్నాడు..
- న్యాయస్థానాలున్నాయనే ధైర్యం నానాటికీ అడుగంటిపోతోంది..
- కనిపించని భగవంతుడి కంటే.. కనిపించే కోర్టులను నమ్ముతాం..
- కోర్టులు కరప్ట్ అయితే ఇంకెవరికి చెప్పకోవాలి..
- అమ్ముడుపోతున్న న్యాయ వ్యవస్థ.. తప్పని అవస్థ..
- చట్టాల్లోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న నేరగాళ్లు..
- అవినీతి పరులకు తమవంతు సహకారం అందిస్తున్న కొందరు న్యాయవాదులు..
- న్యాయస్థానాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న రాజకీయ ముష్కరులు..
- సామాన్యుడికి ఒకన్యాయం.. పెద్దలకు ఒక న్యాయం ఈ అంతరం నశించాలి..
- విద్య, వైద్యం, న్యాయం సామాన్యుడి జన్మహక్కుగా స్థిరపడాలి..
- ఆలోచింపజేస్తున్న ఒక రాజకీయ నాయకుడి మాటలు..
- న్యాయవాది, పొలిటిషన్ రఘునందన్ రావు చెప్పిన మాటలు అక్షర సత్యాలు..
- న్యాయవ్యవస్థ ప్రక్షాళన జరగకపోతే ఈ సమాజం నశిస్తుందని హెచ్చరిస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

(స్పెషల్ కరస్పాండెంట్ )

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** ప్రజాస్వామ్య దేశంలో న్యాయవ్యవస్థకు ఉన్న ప్రాముఖ్యత అప్రతిహతం. శాసన, కార్యనిర్వాహక విభాగాల కంటే ఎత్తైన స్థాయిలో నిలిచి, ప్రజల హక్కులను కాపాడేది కోర్టే. న్యాయస్థానం అనేది ప్రజల చివరి ఆశ్రయం. కానీ అదే న్యాయస్థానంలో అవినీతి వేళ్లూనుకపోతే.. ప్రజల విశ్వాసం ఏ స్థాయికి కూలిపోతుందో అంచనా వేయడం కష్టం. ఇటీవలి కాలంలో కోర్టుల్లో లంచాలు, కావాలనే కేసుల వాయిదాలు, పెద్దల ఒత్తిడి, రాజకీయ జోక్యం వంటి అంశాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. తీర్పుల కంటే డబ్బు, ప్రభావం, పరిచయాలు పనిచేస్తున్నాయనే భావన ఏర్పడితే అది ప్రజాస్వామ్యానికి పెద్ద దెబ్బ. "ఆలస్యమైన న్యాయం అన్యాయమే" అన్న నానుడి మనం తరచుగా వింటున్నాం. కానీ ఆలస్యం కావడమే కాకుండా, న్యాయం వక్రీకరించబడితే పరిస్థితి మరింత భయంకరం.

**అవినీతి రూపాలు ఇలా ఉన్నాయి :**

కేసులు త్వరగా ముందుకు కదలడానికి లంచాలు అవసరమవుతున్నాయనే ఆరోపణలు. ఫైళ్ళను ముందుకు జరిపే కోర్టు సిబ్బందిపై నమ్మకం లేకపోవడం. ధనికులు, రాజకీయ నాయకులు, అధికారులకు అనుకూలంగా తీర్పులు రావడం. బలహీన వర్గాలను బలవంతంగా రాజీకి ఒప్పించడం లాంటివి జరుగుతున్నాయి..

**ప్రజలపై ప్రభావం :**

ఇలాంటి అవినీతి కారణంగా పేదలు, మధ్యతరగతి వారు ఎక్కువగా నష్టపోతున్నారు. ధనికులు డబ్బుతో మార్గం సుగమం చేసుకోగలిగినా, సాధారణ పౌరులు లంచం ఇవ్వలేక ఇరుక్కుపోతున్నారు. న్యాయం ఆలస్యమవడం వల్ల వారు నష్టపోగా, న్యాయవ్యవస్థపై వారి విశ్వాసం తగ్గిపోతోంది. విశ్వాసం కోల్పోయిన న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టలేకపోతుంది.

**పరిష్కార మార్గాలు :**

కోర్టు వ్యవహారాల్లో పారదర్శకత పెంచడం. డిజిటల్ టెక్నాలజీ వినియోగం.. ఆన్లైన్ ఫైలింగ్, ఈకోర్టులు, వర్చువల్ విచారణలు.

అవినీతిలో పట్టుబడిన జడ్జీలు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. విచారణ కాలపరిమితి అమలు చేయాలి.. కేసులు సంవత్సరాల తరబడి లాగకూడదనే నిబంధన విధించాలి.. ప్రజల్లో జాగృతిని పెంచడం.. తమ హక్కులు, కోర్టు విధానాలపై అవగాహన కల్పించడం ఖచ్చితంగా చేయాలి..

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థే చివరి భరోసా. ఆ భరోసా దెబ్బతింటే ప్రజాస్వామ్య పునాది కదిలిపోతుంది. అందుకే కోర్టుల్లో అవినీతిని నిర్మూలించడం అత్యవసరం. ప్రజలు కోర్టు తలుపు తడితే తప్పకుండా న్యాయం దొరుకుతుందనే విశ్వాసం ఉండాలి. న్యాయవ్యవస్థను శుభ్రంగా ఉంచడం కేవలం న్యాయవిధుల బాధ్యత మాత్రమే కాదు, సమాజమంతటికీ ఉన్న బాధ్యత అని తెలియజేస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

**ఒకవ్యక్తి తనకు అన్యాయం జరిగిందని తన తల్లి దండ్రులకు చెప్పుకుంటాడు.. స్నేహితులకు చెప్పుకుంటాడు.. పెద్ద మనుషులకు చెప్పుకుంటాడు.. అధికారులకు చెప్పుకుంటాడు..పోలీసులకు చెప్పుకుంటాడు.. అప్పటికీ న్యాయం జరక్కపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాడు.. అయితే దృరదృష్టం ఏమిటంటే ఆ న్యాయస్థానాలు అన్యాయ కూపాలుగా మారిపోతే ఇక ఆ వ్యక్తి ఎవరికీ చెప్పుకోవాలి..? చివరికి మరణాన్ని ఆశ్రయిస్తాడు.. ఈ మాటలు వినడానికి కొంచం ఆశ్చర్యాన్ని కలిగించినా ఇదే వాస్తవం.. కదులుతున్న కాలంతోబాటు జరుగుతున్న వ్యవహారం.. గుడిలోని దేవుడే రక్కసుడిగా మారి రక్తం తాగుతుంటే.. ఇక రక్షణ ఎక్కడుంటుంది..? ఇలాంటి దారుణ పరిస్థితులే ఇప్పుడు న్యాయ వ్యవస్థలో చోటుచేసుకుంటున్నాయి.. ఎన్నెన్నో దృష్టాంతాలు చూస్తున్నాం.. ఎన్నెన్నో వార్తలు వింటున్నాం.. నోట్ల కట్టలతో న్యాయమూర్తులు దొరికిపోతున్నారు.. అన్యాయం వైపు వాదిస్తున్న న్యాయవాదులను చూస్తున్నాం.. చట్టాలను తారుమారు చేస్తున్న లాయర్లను చూస్తున్నాం..న్యాయాన్ని బంధించి, అన్యాయానికి పట్టం గడుతున్న దారుణ పరిస్థితులు నెలకొన్నాయి.. న్యాయదేవత కళ్ళకు గంతలు కడతారు..నిజా నిజాలను ఆమె చూడలేదు.. కేవలం సాక్షులు చెప్పే విషయాలు మాత్రమే వింటుంది.. ఇదే అదనుగా, ఇదే సాకుగా చేసుకుంటున్న కొందరు న్యాయవాదులు చట్టాల్లోని లొసుగులు, క్లాజులు బూతద్దం పెట్టి వేడికి మరీ న్యాయాన్ని ఖూనీ చేస్తున్నారు.. అన్యాయం చేసినవారిని అందలం ఎక్కిస్తున్నారు.. ఇక్కడ డబ్బు ముఖ్యమైన భూమిక పోషిస్తోంది.. డబ్బులు పడేస్తే న్యాయస్థానాలను మేనేజ్ చేసేయ్యొచ్చు అనే ధైర్యం నేరస్తుల్లో నాటుకుని పోయింది.. ఒక దారుణమైన సంఘటన ఇక్కడ చెప్పుకోవాలి.. భారత దేశంలోని ఒక నగరంలో సాయంకాల పూట సముద్రపు ఒడ్డున ఎన్నో ఫ్యామిలీలు సేద తీరుతున్నాయి.. ఒడ్డుకు చేరుతున్న అలలతో ఆడుకుంటూ ఆనందంగా కాలం గడుపుతున్నాయి.. వారందరిలో ఒక న్యాయమూర్తి, ఒక సాధారణ లాయర్, ఒక ప్రముఖ పేరొందిన న్యాయవాది తమ తమ కుటుంబాలతో కలిసి ఎంజాయ్ చేస్తున్నారు.. ఆ సాధారణ లాయర్ ఒక కేసులో నేరం చేసిన వారికి శిక్షపడేలా వాదించాడు.. ఇక ఆ నేరస్తుడికి సంబంధించిన వారు ఆ లాయర్ పై పాగా పట్టారు.. ఆ రోజు కొందరు దుండగులు ఆబీచ్ కి చేరుకున్నారు.. తన కుటుంబంతో కలిసి ఆడుకుంటున్న సాధారణ లాయర్ ని అత్యంత దారుణంగా నరికి చంపారు.. ఆ దారుణ ఘటనను స్వయంగా అక్కడే ఉన్న న్యాయమూర్తి చూశాడు.. అక్కడే ఉన్న ప్రముఖ న్యాయవాది సైతం చూశాడు.. హంతకులు అరెస్ట్ అయ్యారు.. అత్యంత హేయమైన విషయం ఏమిటంటే ఆ హంతకుల తరపున ప్రముఖ న్యాయవాది వాదించాడు.. అక్కడ న్యాయమూర్తి సాక్షాత్తూ హత్యను చూశాడు.. అయితే ఆ న్యాయమూర్తి సమక్షంలోనే, ఆ ప్రముఖ న్యాయవాది హంతకుల తరపున వాదించి, వారు నిర్దోషులని నిరూపించాడు.. చూసిన న్యాయమూర్తి సైతం ఏమీ చేయలేని పరిస్థితి.. అలాంటి సాక్షాలు సృష్టించాడు ఆ ప్రముఖ న్యాయవాది.. ఇలా ఉంటుంది వ్యవహారం.. ఇది కేవలం కథ కాదు.. ఒకప్పుడు ముంబైలో జరిగిన యదార్థ సంఘటన.. ఆ తరువాత ఆ ప్రముఖ న్యాయవాది ఎంపీగా కూడా ఈ దేశానికి, ప్రజలకు సేవలందించారు.. మరి న్యాయం ఎక్కడుంది..? గుడ్డిదైపోయింది..**

*** ఒకసారి న్యాయవాది, బీజేపీ నాయకుడు రఘునందన్ చెప్పిన మాటలు మననం చేసుకుందాం :**

భారతదేశ ప్రజాస్వామ్యం నిలదొక్కుకోవడానికి న్యాయవ్యవస్థే ప్రధాన ఆధారం. కానీ, న్యాయం ఆలస్యమవుతుందనే విమర్శలు కొత్తవి కావు. కేసులు దశాబ్దాల తరబడి పెండింగ్లో ఉండిపోవడం, తీర్పులు సమయానికి రాకపోవడం, సామాన్య ప్రజలకు న్యాయం దూరమవ్వడం అన్నీ మన దేశ న్యాయవ్యవస్థలో తీవ్రమైన లోపాలుగా ముద్ర పడ్డాయి.

ఇటీవల బీజేపీ నేత రఘునందన్ రావు ఒక పోడ్ కాస్ట్ చేసిన వ్యాఖ్యలు ఈ సమస్యను మరింత బలంగా గుర్తు చేశాయి. ఆయన చెప్పినట్లు, కోట్లకొద్దీ కేసులు పెండింగ్లో ఉండటమే కాకుండా, రాజకీయ నాయకులపై ఉన్న నేర కేసులు కూడా ఏళ్ల తరబడి పరిష్కారం లేకుండా ఉండిపోతున్నాయి. "543 మంది ఎంపీల్లో ఎక్కువమందిపై కేసులు ఉన్నాయి. తనతో సహా చాలామందిపై కేసులు ఉన్నాయి. ఈ భారాన్ని మోస్తూనే రాజకీయాలు చేయాల్సి వస్తోంది" అని ఆయన వ్యక్తం చేసిన ఆవేదన కేవలం వ్యక్తిగతం మాత్రమే కాదు; మొత్తం వ్యవస్థ ఎదుర్కొంటున్న వాస్తవానికి ప్రతిబింబం.

ఇక మరో ముఖ్యమైన అంశం.. న్యాయ వ్యవస్థపై వస్తున్న విమర్శలు. ప్రజలు కోర్టులను విమర్శిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకూడదని, ఆత్మపరిశీలన చేసుకోవాలని రఘునందన్ రావు చెప్పిన మాటలు సరికొత్త ఆలోచనకు దారి తీస్తాయి. విమర్శను శత్రువుగా కాకుండా, మార్పు కోసం తీసుకోవడం న్యాయవ్యవస్థకు అవసరమైన ధోరణి.

అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం న్యాయ సంస్కరణలు. రాజకీయాల్లో ఎన్నో విషయాలపై చర్చలు జరుగుతున్నా, న్యాయవ్యవస్థలో మార్పులపై ఎవరూ పెద్దగా మాట్లాడటం లేదు. "ప్రజల జీవితానికి అత్యంత దగ్గరగా ఉండేది న్యాయవ్యవస్థే. కాబట్టి సంస్కరణలు అత్యవసరం" అని రఘునందన్ రావు చెప్పిన మాటలు ఒక హెచ్చరిక.

న్యాయవాదుల పాత్ర కూడా ఇక్కడ ముఖ్యమే. న్యాయవాదులు కేవలం కేసులు వాదించే వారే కాకుండా, సమాజానికి న్యాయం అందించే బాధ్యత వహించాలి. రఘునందన్ రావు చెప్పినట్లుగా, న్యాయ వృత్తి మరియు ప్రజా జీవితం మధ్య ఎటువంటి భేదం ఉండకూడదు.

న్యాయవ్యవస్థపై వస్తున్న విమర్శలు వాస్తవానికి దాని బలహీనతలను బహిర్గతం చేస్తున్నాయి. వాటిని నిర్లక్ష్యం చేయడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. కాబట్టి, కేసుల పరిష్కారంలో వేగం పెరగడం, పారదర్శకత కలగడం, ప్రజలకు సమయానికి న్యాయం అందించడం అత్యవసరమైంది. రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలు ఒక నేతగా ఆయన ఆవేదన మాత్రమే కాదు, ఈ దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ఆందోళనగల ప్రతి పౌరుడి గళం.



## చెంగిచెర్ల పెద్ద క్రాంతి కాలనీలో 600 గజాల పార్కును కాపాడిన హైడ్రా




హైదరాబాద్, సెప్టెంబరు 11 (భారత శక్తి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం చెంగిచర్ల గ్రామంలోని పెద్ద క్రాంతి కాలనీలో పార్కును హైడ్రా కాపాడింది. 600 గజాల మేర ఉన్న పార్కును బై నంబర్లు వేసి వేరేవాళ్లకు అమ్ముతున్నారంటూ హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు వచ్చింది. 66 ఎకరాల మేర 1968లో 1680 ప్లాట్లతో పెద్దక్రాంతి కాలనీ పేరిట లే ఔట్ వేశారు. ఇందులోని పార్కులను కూడా ప్లాట్లుగా అమ్మేస్తున్నారంటూ అక్కడి నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారించిన హైడ్రా.. లే ఔట్ ప్రకారం 600 గజాల స్థలం పార్కుకోసం కేటాయించినదిగా నిర్ధారించింది. ఈ మేరకు గురువారం పార్కు హద్దులను నిర్ధారించి.. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. 600ల గజాల స్థలం రూ. 3 కోట్ల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

## పాఠశాలలో పదోతరగతి విద్యార్థి అనుమానాస్పద మృతి

**హనుమకొండ, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** హనుమకొండ నైమ్‌నగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పోలేపల్లి జయంతి వర్ధన్ (15) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అకస్మాత్తుగా విద్యార్థి ముక్కు, చెవి నుంచి రక్తం రావడంతో గుర్తించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే, విద్యార్థి మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు తెలిపారు. తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హనుమకొండ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.







## గ్రూప్-1పై అప్పీల్‌కు టీజీపీఎస్సీ సమావేశంలో కీలక నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (భారత శక్తి) :** గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయించాలని, లేదంటే పరీక్షలను రద్దు చేసి తాజాగా నిర్వహించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఇవాళ జరిగిన టీజీపీఎస్సీ ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం రీవాల్యూయేషన్ చేస్తే సాంకేతిక సమస్యలు రావొచ్చని టీజీపీఎస్సీ అభిప్రాయపడింది. మరోవైపు ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్‌లు జారీ చేయడంలో, కేంద్రాల కేటాయింపులో పారదర్శకత లేదని సింగిల్ జడ్జి బుధవారం ఇచ్చిన తీర్పులో తప్పుబట్టారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను, సమగ్రతను కొనసాగించలేదని, పక్షపాతంతో వ్యవహరించినట్లు కనిపిస్తోందని, కమిషన్ తన సొంత నియమ, నిబంధనలను సైతం ఉల్లంఘించిందని పేర్కొన్నారు. పరీక్షలు రాసిన వారి సంఖ్యపై పొంతన లేని సమాధానాలు చెబుతోందని, మూల్యాంకనం కోసం చేసిన ప్రొఫెసర్ల ఎంపికలోనూ పారదర్శకత పాటించలేదని, ఫలితంగా తెలుగు మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.